ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 16.09.2026 | సంపుటి :13 సంచిక : 57 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## డిజిటల్ ఇండియాకు

# టోల్‌గేట్

**దేశంలో నగదు రహిత లావాదేవీలకు ఊపిరిలూదిన యూపీఐ వ్యవస్థపై ఇప్పుడు కొత్త రుసుము భారానికి తెరలేచింది. రూ.2 వేలకుపైగా వ్యాపారులకు చేసే అర్హత కలిగిన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం రుసుము వసూలు చేయనున్నారు. సాధారణ వ్యాపారులకు ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 వరకు రుసుము ఉండనుంది. అయితే వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. రూ.2 వేల వరకు ఎలాంటి రుసుము ఉండదు. అంటే అధిక మొత్తాల్లో యూపీఐ ద్వారా వ్యాపారం చేసే వారికి ప్రతి లావాదేవీపై కొంత మొత్తం తగ్గిపోనుంది.**




**చార్జీలు ఇలా..**

| | |
|---|---|
| రూ.2,000 వరకు రుసుము లేదు | రూ.50,000 చెల్లింపుకు..రూ.200 |
| రూ.3,000 చెల్లింపుకు.. రూ.12 | రూ.75,000 చెల్లింపుకు..రూ.300 |
| రూ.10,000 చెల్లింపుకు.. రూ.40 | వ్యక్తి నుంచి వ్యక్తికి రుసుము లేదు |

### యూపీఐ చెల్లింపులపై కొత్త బాదుడు

- రూ.2 వేలు దాటితే వ్యాపారిపై 0.4 శాతం రుసుము
- రూ.75 వేల పైబడితే ఒక్క లావాదేవీకి గరిష్ఠంగా రూ.300
- వ్యక్తి నుంచి వ్యక్తికి రుసుము లేదు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో నగదు రహిత లావాదేవీలకు ఊపిరిలూదిన యూపీఐ వ్యవస్థపై ఇప్పుడు కొత్త రుసుము భారానికి తెరలేచింది. అక్టోబర్ 15 నుంచి రూ.2 వేలకుపైగా వ్యాపారులకు చేసే అర్హత కలిగిన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం రుసుము వసూలు చేయనున్నారు. సాధారణ వ్యాపారులకు ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 వరకు రుసుము ఉండనుంది. అయితే వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయి. రూ.2 వేల వరకు ఎలాంటి రుసుము ఉండదు. ఆ పరిమితి దాటిన అర్హత కలిగిన వ్యాపార చెల్లింపులపై 0.4 శాతం రుసుము వర్తిస్తుంది. అంటే అధిక మొత్తాల్లో యూపీఐ ద్వారా వ్యాపారం చేసే వారికి ప్రతి లావాదేవీపై కొంత మొత్తం తగ్గిపోనుంది.

**వినియోగదారుడికి భారం లేదట..**

**వ్యాపారి సంగతేంటి?**

కేంద్ర ప్రభుత్వం మాత్రం వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము వేయబోమని చెబుతోంది. ఈ రుసుమును వ్యాపారే భరించాల్సి ఉంటుంది. అంతేకాదు.. దానిని నేరుగా వినియోగదారుడిపై బదిలీ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. వినియోగదారుడికి భారం లేదు..వ్యాపారి భరించాలి..మరి వ్యాపారి భారం ఎవరు భరించాలి? తక్కువ లాభంతో నడిచే వ్యాపారాలకు ప్రతి లావాదేవీపై పడే కోత చిన్నదిగా కనిపించినా..

మిగతా 2లో..

## ట్రంప్ ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానాలు

- అమెరికా ప్రభుత్వాన్ని బుజ్జగించేందుకే యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు..
- సామాన్యుడి జేబు ఖాళీ చేయడానికి కేంద్రం కొత్త మార్గాలను అన్వేషిస్తోంది
- మలికార్జున ఖర్గే, రాహుల్ మండిపాటు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రూ.2000 వరకు ఉండే యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు/పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ స్పందించింది. యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా..? కాంగ్రెస్

మిగతా 2లో..



వారసత్వ సంపద పునరుద్ధరించడంలో

## అగాఖాన్ ఫౌండేషన్‌ది అత్యంత కీలక పాత్ర

**ఫౌండేషన్‌పై నాకు అమితమైన గౌరవం**

**మూసీ పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగాఖాన్-Vతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. గ్లోబల్ సమిట్‌కు హాజరుకావాలని ఆయన్ను సీఎం ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అగాఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవముందని చెప్పారు. "వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగాఖాన్ ఫౌండేషన్‌ది అత్యంత కీలకపాత్ర. ఫౌండేషన్ సాయంతో మండలి భవనం, కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించుకున్నాం. మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణకు సాయం కోరుతున్నాం. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమిట్ నిర్వహిస్తున్నాం. 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు"అని సీఎం తెలిపారు.

## '22ఏ'పై చర్చను సమర్థంతంగా ఎదుర్కోవాలి

**నిషేధిత భూముల జాబితాలోని భూముల అంశంపై అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**



**హైదరాబాద్(జనంసాక్షి):** 22-ఏ నిషేధిత భూముల జాబితాపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. రేపు అసెంబ్లీలో 22-ఏ భూముల అంశంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వనున్నందున సీఎం పలువురు మంత్రులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ఎంసీహెచ్‌ఆర్డీ క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. 22-ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను పరిశీలించి అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించడం, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మార్గాలపై మంత్రులతో సీఎం చర్చించినట్లు సమాచారం. అదేవిధంగా భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు చేసినట్లు సమాచారం. అసెంబ్లీ చర్చలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని వెల్లడించేలా ఇప్పటికే వివిధ శాఖల నుంచి అందిన సమాచారం, 22-ఏ భూములకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. మంత్రుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ

మిగతా 2లో..

## సీఎంతో నాకు విభేధాలు లేవు

**ముఖ్యమంత్రితో కలిసి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే నా లక్ష్యం**

**టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగింది**

**మీడియాతో చిట్‌చాట్‌లో మహేశ్‌కుమార్ గౌడ్**



**హైదరాబాద్(జనంసాక్షి):** టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. కుల సర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం జరిగిందన్నారు. కుల సర్వేను కేంద్రం తొక్కి పెట్టడం దురదృష్టకరమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు."సీఎం రేవంత్‌రెడ్డితో నాకు ఎక్కడా గొడవ జరగలేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమే. మా మధ్య గ్యాప్ ఉందని, గొడవ జరిగిందని ప్రచారం జరుగుతోంది. అలాంటివి ఏమీ లేవు. అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరి చేసుకున్నాం. పార్టీ విషయంలో సీఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. బీసీ మంత్రిని తొలగించినప్పుడు నేను కూడా బాధపడ్డా. ఏఐసీసీ నిర్ణయం మేరకే సురేఖపై చర్యలు తీసుకున్నామన్నారు




## గ్రామీణ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**గ్రామీణ నిరుద్యోగానికి పరిశ్రమలు- యువత అనుసంధానమే పరిష్కారం:మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్/సూర్యాపేట(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా, సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు . సెప్టెంబర్ 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొనే కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యాసంస్థల ప్రతినిధులు, స్థానిక అధికారులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికీ, చదువు పూర్తయిన తరువాత పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేకమందిని కలిశానని చెప్పారు. మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజినీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో..

## బిహార్‌లో భాజపాకు భారీ షాక్

**ఆ రాష్ట్రంలో యూసీసీకి జేడీయూ నో**

**పట్నా(జనంసాక్షి):** బిహార్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు తాము వ్యతిరేకమని జేడీయూ స్పష్టంచేసింది. పార్లమెంట్‌లో యూసీసీ బిల్లుకు తాము మద్దతు తెలిపినప్పటికీ..

మిగతా 2లో..










## సిట్టింగ్ జడ్జీ చేత న్యాయవిచారణ జరిపించాలి

- '22ఏ'లో ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు
- 30 శాతం కమిషన్ల కోసం ప్రయత్నాలు మానుకోవాలి
- దీనిపై ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలి: కేటీఆర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. 30 శాతం కమిషన్ల కోసం చిల్లర ప్రయత్నాలు మానుకోవాలి. బేషరతుగా క్షమాపణ చెప్పి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను జాబితా నుంచి తొలగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ధరణి రక్షణ కవచం.. ఇప్పుడు 'భూభారతి కాదు.. భూ హారతి' అసైన్డ్ భూములపై ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీలకు యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది.. అన్ని అక్రమాలు వెలుగులోకి తెస్తాం. ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి22ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని, 30 శాతం కమిషన్ల కోసం చేస్తున్న చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని

మిగతా 2లో..



## ఎస్సీ,ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట

**నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు**

**ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై సమీక్ష**


**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చి దిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమక్షానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో

మిగతా 2లో..

## క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చడం అభినందనీయం

**షూటింగ్‌లో తెలంగాణ పోలీసుల జోరు**

**విజేతలను అభినందించిన డీజీపీ సి.వి. ఆనంద్**



**హైదరాబాద్ (జనంసాక్షి):** షూటింగ్ క్రీడల్లో తెలంగాణ పోలీసు సిబ్బంది సత్తా చాటారు. రాష్ట్ర, సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో కలిపి 6 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 15 పతకాలు సాధించారు. మంగళ వారం డిజిపి కార్యాలయంలో విజేతలను డిజిపి సి.వి. ఆనంద్ అభినందించారు. క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2026 జూన్ 20 నుంచి 28 వరకు

మిగతా 2లో..

# ఆంధ్రా,తెలంగాణకు 5 లక్షల ఇళ్ల కేటాయింపు

### కేంద్ర మంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లు కేటాయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేసిన కేటాయింపుల కంటే ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాలకు ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు."2019-24 మధ్య కాలంలో ఏపీకి 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. దానిలో కేవలం 42వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 2019-24 మధ్య గ్రామీణ ఆవాస యోజన పథకంలో తెలంగాణ చేరలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రెండుమూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తరఫున రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందిస్తాం. అదనపు సాయంతో దాదాపు రూ.1.80 లక్షల వరకు లబ్ధి చేకూరుతుంది. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డికి రూ.12 వేల సహాయం అందిస్తాం. ఆవాస్ ప్లస్ యాప్‌తో పారదర్శకంగా ఎంపిక జరుగుతుంది.జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారుల నమోదుకు కేంద్రం సెల్ఫ్ సర్వే సదుపాయం కల్పించింది. ఆదాయ అర్హత పరిమితి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మోటార్ బైక్, ఫ్రిజ్ ఉన్నా అర్హత కోల్పోకుండా సవరణలు చేసింది. కొత్త, పాత ఇళ్లన్నీ 2-3 ఏళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుంది" అని మంత్రి పెమ్మసాని వెల్లడించారు.

# క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయం

హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ, సాట్‌జీ షూటింగ్ రేంజ్‌లో జరిగింది. రైఫిల్, పిస్టల్ విభాగాల్లో తెలంగాణ పోలీసు షూటర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 4 కాంస్యాలు సాధించారు.13వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన పీసీ 1304 జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రజతాలు సాధించారు. డిజి టెక్నికల్ సర్వీసెస్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎ. ప్రసన్నకుమార్ 50 మీటర్ల పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో కాంస్యం సాధించారు.ఫ్యూచర్‌సిటీ లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు రజతం, కాంస్య పతకాలు సాధించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న వాసీ వి. సువర్ణ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో స్వర్ణం దక్కించుకున్నారు. సీఎస్‌డబ్ల్యూ హైదరాబాద్ సీఐ బి. శంకర్ 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ మాస్టర్ విభాగంలో స్వర్ణం సాధించారు.

సౌత్‌జోన్‌లో 4 పతకాలు

17వ సౌత్‌జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్-2026 ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8 వరకు కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించారు. తెలంగాణ పోలీసు షూటర్లు 2 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించారు.3వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన జి. నిరంజన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్‌లో రెండు స్వర్ణాలు, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్‌లో రజతం సాధించారు. ఫ్యూచర్‌సిటీ ఐటీ సెల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్‌బాబు కాంస్య పతకం సాధించారు.పతకాలు సాధించిన తెలంగాణ పోలీసు క్రీడాకారులను ఐజీ (పి ఒ ఎల్) గజరావు భూపాల్, స్పోర్ట్స్ డీఎస్పీ రామారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

# బీహార్‌లో భాజపాకు భారీ షాక్

రాష్ట్రంలో అమలుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆ పార్టీ సీనియర్ నేత శ్యామ్ రజక్ వెల్లడించారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత నీతీశ్ కుమార్ ఇప్పటికే స్పష్టంచేశారని చెప్పారు. 2029 నాటికి 21 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీ అమల్లోకి వస్తుందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శ్యామ్ రజక్ స్పందించారు.బిహార్‌లో ప్రస్తుతం సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం అధికారంలో ఉందని, ఎన్డీయేలో నీతీశ్ కుమార్ భాగస్వామిగా ఉన్నారు కదా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. దానికి శ్యామ్ రజక్ బదులిచ్చారు. ముఖ్యమంత్రి భాజపాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ.. ప్రభుత్వం మిత్రపక్షాల మద్దతుతో నడుస్తోందని గుర్తుచేశారు. యూసీసీ విషయంలో తమ వైఖరి సుస్పష్టం అని, కాబట్టి అమలు ప్రస్తావనే ఉత్పన్నం కాదని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, ఉమ్మడి పౌరస్మృతి అమలు అంశంపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన ఆర్జేడీ భాజపాపై విమర్శలు గుప్పించింది. మరోసారి ఆ పార్టీ విద్వేష రాజకీయాలకు తెరతీసిందని విమర్శించింది. "భాజపాకు ఇటీవల అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. అందుకే తన పాత ఎత్తుగడ మొదలుపెట్టింది. విద్వేష రాజకీయాలను తిరిగి తీసుకొచ్చింది" అని పార్టీ అధికార ప్రతినిధి శక్తి యాదవ్ పేర్కొన్నారు. బిహార్ ప్రజల నరనరాల్లో లౌకికవాదం ఉంటుందనే విషయాన్ని భాజపా గుర్తుంచుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో యూసీసీ అమలుకు యత్నిస్తే తాము అడ్డుకుని తీరుతామని స్పష్టంచేశారు.

# డిజిటల్ ఇండియాకు టోల్‌గేట్!

నెల, ఏడాది లెక్కలో అది అదనపు వ్యయంగా మారుతుంది.రూ.2 లక్షల అమ్మకాలకు రూ.800 కోత!ఒక వ్యాపారి నెలకు రూ.2 లక్షల అర్హత కలిగిన యూపీఐ అమ్మకాలు చేశాడనుకుందాం. అవన్నీ రూ.2 వేలకుపైబడిన లావాదేవీలే అయితే 0.4 శాతం ప్రకారం నెలకు రూ.800 రుసుము అవుతుంది. ఏడాదికి రూ.9,600.అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి.రూ.2 లక్షల అమ్మకాలు అంటే రూ.2 లక్షల లాభం కాదు.వ్యాపారి సరుకు కొనుగోలు, అద్దె, విద్యుత్, సిబ్బంది జీతాలు, రవాణా తదితర ఖర్చులు భరించాలి. అందువల్ల ఈ రుసుమును అమ్మకాలపై పన్నుగా చెప్పడం సరికాదు. ఇది అర్హత కలిగిన లావాదేవీలపై వ్యాపారి చెల్లించాల్సిన రుసుము.కానీ పేరు ఏదైనా.. వ్యాపారి చేతికి రావాల్సిన మొత్తంలో కోత మాత్రం తప్పదు.ఇది పన్ను కాదు.. కానీ కోత మాత్రం నిజమే!యూపీఐపై విధించే కొత్త రుసుము ప్రభుత్వ పన్ను కాదు. చెల్లింపుల వ్యవస్థలో భాగస్వాములైన సంస్థలకు సంబంధించిన వ్యాపారి రుసుము.అయితే ఇన్నాళ్లూ "డిజిటల్ చెల్లింపులు ఉచితం" అంటూ ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించిన వ్యవస్థలో ఇప్పుడు అధిక విలువైన వ్యాపార లావాదేవీలపై రుసుము విధించడం కొత్త చర్చకు దారితీస్తోంది.ప్రభుత్వం మాత్రం యూపీఐ వ్యవస్థ మౌలిక వసతులు, భద్రత, మోసాల నివారణ, సాంకేతిక అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం అవసరమని చెబుతోంది. చిన్న వ్యాపారులందరికీ కాదుఅయితే ఈ రుసుము ప్రతి చిన్న వ్యాపారికీ వర్తిస్తుందని భావించడం కూడా సరికాదు. అర్హత కలిగిన చిన్న వ్యాపారులకు ప్రత్యేక రక్షణ కొనసాగనుంది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులపై కూడా రుసుము ఉండదు. అందువల్ల "ప్రతి చిన్న వ్యాపారిపై 0.4 శాతం భారం" అని చెప్పడం వాస్తవానికి విరుద్ధం.కానీ అధిక మొత్తాల్లో అర్హత కలిగిన వ్యాపార చెల్లింపులు స్వీకరించే వారికి మాత్రం కొత్త వ్యయం తప్పదు.

డిజిటల్ ఇండియాకు టోల్‌గేట్?

యూపీఐ విజయానికి ప్రధాన కారణం సులభత.. వేగం.. అందుబాటు. చిన్న బండి నుంచి పెద్ద దుకాణం వరకు ప్రతి ఒక్కరూ డిజిటల్ చెల్లింపులను స్వీకరించే స్థాయికి దేశం చేరింది.ప్రభుత్వమే డిజిటల్ చెల్లింపులను విస్తృతంగా ప్రోత్సహించింది. ఇప్పుడు అదే వ్యవస్థ నిర్వహణ, భద్రత, సాంకేతిక అభివృద్ధి కోసం ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలపై రుసుము విధిస్తోంది.వ్యవస్థను నిర్వహించడానికి నిధులు అవసరం కావచ్చు. కానీ ఆ భారాన్ని వ్యాపారిపైనే ఎందుకు వేయాలి? పెద్ద సంస్థలకు, తక్కువ లాభంతో నడిచే వ్యాపారులకు ఒకే రుసుము విధానం ఎంతవరకు న్యాయం? అన్న ప్రశ్నకు సమాధానం అవసరం.

**వినియోగదారుడికి ఉచితం.. వ్యాపారికి కోత**

యూపీఐని దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పుగా నిలబెట్టినది దాని సౌలభ్యమే. ఇప్పుడు అదే వ్యవస్థలో అధిక మొత్తాల లావాదేవీలకు రుసుము ప్రవేశిస్తోంది.ఇది యూపీఐకి ముగింపు కాదు.కానీ "ఉచిత డిజిటల్ చెల్లింపు" అనే దశకు మాత్రం కొత్త మలుపు.డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించి.. ఆ తర్వాత వాటి స్వీకరణపై రుసుము విధించడం "డిజిటల్ ఇండియాకు టోల్‌గేట్"గా మారకూడదంటే.. వ్యాపారులపై పడే భారాన్ని ప్రభుత్వం నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది.

# '22ఏ'పై చర్చను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

అసెంబ్లీలో ఇవ్వాల్సిన సమాధానంపై తుది కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద 22-ఏ నిషేధిత భూముల జాబితా ప్రక్షాళన, భూ యజమానుల సమస్యల పరిష్కారం, రిజిస్ట్రేషన్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.గతంలో 22ఏ భూముల విషయంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభలో వివరించే అవకాశం ఉంది. అదే విధంగా అసెంబ్లీలో 22ఏ అంశాన్ని ఎలా ప్రస్తావించాలి, ప్రతిపక్షాల విమర్శలకు ఏ విధంగా సమాధానం ఇవ్వాలనే దానిపైనా మంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ అక్రమాల అంశాన్ని కూడా రేపు సభలో ప్రస్తావించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ భూముల వ్యవహారంలో అసలు సమస్యకు కారణాలేంటి? గతంలో భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ఎవరి హయాంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలను సభా వేదికగా సీఎం వివరించే అవకాశం ఉంది. మొత్తంగా 22ఏ భూముల అంశంపై రేపటి అసెంబ్లీ చర్చకు ముందే రేవంత్ రెడ్డి మంత్రులతో కసరత్తు చేసినట్లు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టత ఇవ్వడంతోపాటు, మరోవైపు నిజంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు వెసులుబాటు కల్పించేలా పరిష్కార మార్గాలను అన్వేషించిన్నట్లు తెలుస్తోంది.

# ట్రంప్ ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానం

జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించడానికి కేంద్రం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందంటూ విమర్శించారు. "దేశంలో రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీల సంఖ్య 5 శాతం మాత్రమే అయినప్పటికీ.. అవి



మొత్తం విలువ పరంగా సుమారు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తున్నాయి. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానంలో మార్పు చేసుకుంటోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడిన ప్రధాని మోదీ.. మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారు. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం కారణంగా సామాన్యుడి జేబులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. టోకు ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలో ఉండగా.. 'డిజిటల్ చెల్లింపుల పన్ను' విధించడం ద్వారా ప్రజల మిగిలిన పొదుపును కూడా ప్రభుత్వం నాశనం చేయాలని ప్రణాళిక వేసింది. పదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ కొట్టింది. పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికే పెద్ద నోట్లు రద్దు చేశామని ప్రభుత్వం వాదించింది. రూ.5 వేల లావాదేవీలపై రూ. 25, రూ.10వేల లావాదేవీలపై రూ.50 వరకు పన్ను విధించే అవకాశం ఉందని నివేదికలు చెపుతున్నాయి.. ఇది నిజమేనా? ఎండీఆర్.. ద్వారా వ్యాపారులపై పడే అదనపు భారం చివరికి పెరిగిన ధరల రూపంలో సగటు వినియోగదారుడిపైనే పడుతుందని ప్రభుత్వం గ్రహించడం లేదా? ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ప్రతిరోజూ వారి జేబులు ఖాళీ చేయడానికి కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తోంది" అని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు.

# గ్రామీణ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదేపదే హైదరాబాద్‌కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు."గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలి. అదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యాసంస్థలు అందిస్తున్న అర్హతలు, యువతలో ఉన్న ప్రతిభ?ఈ మూడింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రయత్నమే ఈ జాబ్‌మేళా అని తెలిపారు. ఒకే ప్రాంగణంలో అనేక సంస్థల ప్రతినిధులను కలిసి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం గ్రామీణ నిరుద్యోగులకు కల్పించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఒక్కొక్కరికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌తోపాటు వివిధ పారిశ్రామిక ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంస్థలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిశ్రమలను ఇందులో భాగస్వాములను చేస్తున్నట్లు వివరించారు.అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతోపాటు సిమెంట్, తయారీ, సేవలు, ఐటీ, ఫార్మా, నిర్మాణ, వ్యాపార రంగాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి పరిశ్రమ జాబ్‌మేళాలో పాల్గొనేలా పరిశ్రమల శాఖ అధికారులు వ్యక్తిగతంగా సంప్రదించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ సమన్వయంతో ఈ నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేస్తారని వెల్లడించారు.జాబ్‌మేళాపై ఇప్పటికే సుమారు లక్షన్నర మంది ఉద్యోగార్థులకు బల్క్ సందేశాలు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, అధికారులు, విద్యాసంస్థలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోబ్రా ఐజీగా 'అస్సాం ఐరన్ లేడీ'..

### తొలి మహిళగా రికార్డు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సీఆర్పీఎఫ్ కోబ్రా యూనిట్ ఐజీగా ఐపీఎస్ అధికారిణి సంజుక్తా పరాశర్ నియమితులయ్యారు. ఈ యూనిట్‌కు నాయకత్వం వహిస్తున్న తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. అస్సాం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన సంజుక్త.. 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి. 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి దనేష్ రాణా స్థానంలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టారు.అస్సాంకు చెందిన సంజుక్త గతంలో స్వరాష్ట్రంలోనే విధులు నిర్వహించడంతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థలోనూ సేవలందించారు. అస్సాంలోని దట్టమైన అడవుల్లో క్లిష్టమైన సవాళ్ల నడుమ అనేక కీలక ఆపరేషన్లు నిర్వహించిన ఆమెకు.. 'ఐరన్ లేడీ ఆఫ్ అస్సాం'గా పేరుంది. దిల్లీలోని జేఎన్‌యూలో ఉన్నత విద్యనభ్యసించిన ఆమె.. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలో ఆల్ ఇండియా 85వ ర్యాంకు సాధించారు. మావోయిస్టులను, ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాటుదారులను ఎదుర్కొనేందుకు 2008లో కోబ్రా యూనిట్ ఏర్పాటైంది. జంగిల్ వార్‌ఫేర్, గెరిల్లా ఆపరేషన్లను నిర్వహించడంలో ఈ యూనిట్ దిట్ట. మణిపుర్‌లో సాయుధ హింసను అరికట్టేందుకు సీఆర్పీఎఫ్ ఇటీవల రెండు కోబ్రా యూనిట్లను మోహరించింది.

# సిట్టింగ్ జడ్జి చేత న్యాయవిచారణ జరపాలి

డిమాండ్ చేశారు. 22ఏ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వం సరైన సమాధానం ఇస్తుందని ఆశించామని, అయితే రెవెన్యూ మంత్రి కేవలం 'సారీ'తో సరిపెట్టారని కేటీఆర్ అన్నారు. 'తప్పు చేసింది అధికారులు కాదు.. ప్రభుత్వమే. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులపై నెపం నెట్టడం సరికాదు' అని అన్నారు.ప్రజలు తమ కష్టార్జితంతో కొనుగోలు చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చినట్లయితే వాటిని బేషరతుగా తొలగించి, బాధితులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**ధరణి రక్షణ కవచం..**

ధరణి వ్యవస్థ ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. యజమాని వేలిముద్ర లేకుండా ఆస్తి బదిలీ చేయడం సాధ్యం కాని విధంగా భద్రత ఉండేదన్నారు. ప్రస్తుతం యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆరోపించారు. 'ఇది భూభారతి కాదు.. భూ హారతి' అని వ్యాఖ్యానించారు. అన్ని అడ్డగోలు చర్యలను నిలిపివేసి, ప్రజల యాజమాన్య హక్కులను రక్షణ కల్పించేలా యథాతథ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరారు.

**అసైన్డ్ భూములపై హామీ నిలబెట్టుకోవాలి..**

అసైన్డ్ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నారు.అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకం వెనుక అక్రమాలు ఉన్నాయన్న తమ ఆరోపణలు భవిష్యత్తులో వెలుగులోకి వస్తాయని అన్నారు. 'రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం' అని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపారుప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా నిరసన తెలిపే హక్కు తమకుందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనని మాటలను అంటగట్టి, సభ నుంచి బయటకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అంశాల నుంచి తప్పించుకునేందుకే తమను సస్పెండ్ చేసిందన్నారు. 'సస్పెండ్ చేసినప్పటికీ మేము ప్రజల్లోనే ఉన్నాం. ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూనే ఉంటాం. 22ఏ అంశమైనా, ప్రజల భూముల సమస్యలైనా ప్రజల మధ్యకు తీసుకెళ్తాం' అని కేటీఆర్ అన్నారు.రాజకీయ వార్తలు చదవండి

**22ఏ పై న్యాయ విచారణకు స్వాగతం..**

22ఏ వ్యవహారంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిగితే అందరికీ మంచిదేనని కేటీఆర్ అన్నారు. 'తప్పు చేసింది ప్రభుత్వం.. శిక్ష అనుభవిస్తున్నది ప్రజలు' అని వ్యాఖ్యానించారు. నిషేధిత జాబితాలో ఆస్తులను చేర్చడం ద్వారా ప్రజల యాజమాన్య హక్కులను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇవాళ తప్పించుకున్నా రేపు తప్పించుకోలేరని హెచ్చరించారు. పోలీసులపై నమ్మకం లేదు.. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా పనిచేస్తున్నారని విమర్శించారు.'పోలీసులను నమ్ముకుంటే న్యాయం దొరకదనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నాం. న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం దొరుకుతుందని ఆశిస్తున్నాం' అని కేటీఆర్ అన్నారు.కామన్ సివిల్ కోడ్‌పై ఇప్పుడే నిర్ణయం చెప్పాల్సిన అవసరం లేదని, అలాంటి ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.

# బ్రేకప్ దిశగా 'యూకే'

## ఒంటరికానున్న ఇంగ్లాండ్..!



లండన్(జనంసాక్షి):ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలను ఆక్రమించుకుని.. రవి అస్తమించని సామ్రాజ్యంగా ఒకప్పుడు వెలుగొందిన యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభ మసకబారిపోతోంది. ఇప్పుడు యూకేలో భాగమైన దేశాలు కూడా బ్రేకప్ చెప్పాలని నిర్ణయించుకున్నాయి. ఆ మేరకు వేల్స్ స్కాట్‌లాండ్ నార్తర్న్ ఐర్లాండ్ దేశాల ప్రతినిధులు తాజాగా సంతకాలు చేశారు. ప్రస్తుతం మనకు తెలిసిన బ్రిటన్, యూకే పేర్లు కొన్ని దేశాల సమాహారంగా వచ్చాయి. ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, వేల్స్ కలిసి గ్రేట్ బ్రిటన్. వీటికి నార్తర్న్ ఐర్లాండ్ కూడా కలిస్తే యునైటెడ్ కింగ్టమ్ ఇప్పుడు ఈ యూకే నుంచి బయటపడి, పూర్తి స్వయం ప్రతిపత్తిగల దేశాలుగా ఉండాలని వేల్స్, స్కాట్‌లాండ్, నార్తర్న్ ఐర్లాండ్ కోరుకుంటున్నాయి. అదే జరిగితే ఆ రాజ్యంలో ఇంగ్లాండ్ ఒకటే మిగులుతుంది రాజ్యాంగ మార్పునకు సిద్ధంగా ఉండాలని, తమ భవిష్యత్ ఐరోపా యూనియన్‌తో ముడిపడి ఉందని ఆ మూడు దేశాల ఫస్ట్ మినిస్టర్లు.. యూకే ప్రధాని ఆండీ బర్నహామ్ ప్రభుత్వానికి ఇప్పటికే తెలియజేశారు.వెస్ట్‌మినిస్టర్ (బ్రిటన్ పార్లమెంట్, ప్రభుత్వానికి కేంద్రస్థానం) సమయం ముగింపు దశకు వచ్చిందనడానికి ఇంతకు మించిన సంకేతం లేదని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐర్లాండ్ పర్యటనలో భాగంగా రాజధాని నగరం డబ్లిన్‌లో మాట్లాడుతూ.. అవిభాజ్య ఐర్లాండ్‌ను చూడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అది ఎప్పటికైనా జరగాల్సిందే.. ఇప్పుడే జరిగితే మంచిదంటూ వివాదస్పద అంశాన్ని మరోసారి లేవనెత్తారు. ట్రంప్ వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే అవగాహన ఒప్పందంపై మూడు దేశాలు సంతకాలు చేయడం గమనార్హం. వంద సంవత్సరాల క్రితం బ్రిటన్ నుంచి ఐర్లాండ్ స్వాతంత్ర్యం పొందింది. అందులో నార్తర్న్ ఐర్లాండ్ యూకేలో ఉండిపోయింది. మరొక భాగం రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ స్వతంత్ర దేశంగా మారింది.ఈ ఫస్ట్ మినిస్టర్ల వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని కార్యాలయం స్పందించింది. ప్రధాని యూకే ఐక్యతనే విశ్వసిస్తున్నారని చెప్పింది. రాజ్యాంగపరమైన అంశాల్లో చర్చల కంటే ప్రజల జీవన వ్యయాలను తగ్గించడంపైనే ఆయన ప్రధానంగా దృష్టిసారించారని పేర్కొంది. గతంతో పోలిస్తే తమ యూనియన్‌కు ముప్పు ఎక్కువగా ఉందని అనుకోవడం లేదని వ్యాఖ్యానించింది.

### ఎర్రవల్లిలో శుద్ధి ఘటన..

# ఏడుగురి అరెస్ట్

సిద్దిపేట(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేసిన కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వరదరాజ్‌పూర్‌కు చెందిన మాజీ సర్పంచ్‌తో పాటు ఆరుగురు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. విజయవాడలోని ఓ లాడ్జిలో ఉండగా వారిని పట్టుకున్నట్లు సమాచారం. ఆరుగురి ఫోన్లు స్విచాఫ్‌లో ఉండగా.. మరొకరు ఆన్ చేయడంతో పోలీసులు లొకేషన్ ట్రాక్ చేసి పట్టుకున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వీరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి గజ్వేల్‌కు తరలించారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచగా 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వారిని సిద్దిపేట జైలుకు తరలించారు. దళితులను అవమానించారని కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట

ఉన్న ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని, సంక్షేమ శాఖల కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. నవంబర్ 19 నుంచి లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలురెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆధునిక వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ. 25 కోట్లను కేటాయించినట్లు గుర్తుచేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా? ప్రతిష్టాత్మక ఉద్యోగాలు సాధించారా? లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా? ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి "సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్" తో అధ్యయనం చేయించి డిటైల్డ్ రిపోర్టు తయారు చేయించాలని తెలిపారు.

# లోతుకుంట భూ వివాదంపై సుప్రీం తీర్పు..

### స్పందించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్(జనంసాక్షి):** లోతుకుంటలో 40 ఎకరాల భూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పటిషన్‌ను కొట్టివేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయటపడతాయన్నారు. లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతా శ్రీరాం బిల్డర్స్ లేఔట్‌కు ప్రస్తుతం హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థా నాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు... సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది.

## సిఎంసి పరిధి అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో అనధికార నిర్మాణంలో ఉన్న భవనాలకు సంబంధించి శేరిలింగంపల్లి, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాటి విషయంలో అవసరమైన నిరంతర చర్యలను సిఎంసి పరిధి ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు చేపడుతున్నారు. సిఎంసి పరిధిలో మొత్తం 14 అణాధికార నిర్మాణాలను గుర్తించగా వాటిలో 13 నిర్మాణాలను కూల్చివేయడంతోపాటు మరో ఎనిమిది నిర్మాణాలకు నోటీసులను జారీ చేసినట్లు సిఎంసి ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు తెలియజేశారు. మూడు జోన్ల వారీగా చేపట్టిన కూల్చివేతల వివరాల ప్రకారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలో 05, కూకట్పల్లి జోన్ పరిధిలో 02, నిర్మాణాలు, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో 06 ఉన్నాయని ఉన్నతాధికారులు వివరించారు. సిఎంసి పరిధిలోని అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు మరియు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సిఎంసి అధికారులు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగిస్తూ గుర్తించిన అన్ని అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలను కచ్చితంగా చేపట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు.



## రూ. 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం

**నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**విద్యారంగానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలో రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. పాఠశాల నిర్మాణ ప్రాంతాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నమూనా మ్యాప్‌ను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మక్తల్ చరిత్రలో ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా మెరుగైన వసతులు, విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు, మక్తల్ ప్రాంతాన్ని ఒక ప్రముఖ విద్యా కేంద్రంగా (ఎడ్యుకేషనల్ హబ్) తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని, నిర్ణీత కాలపరిమితిలోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను మరియు ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ఉద్యోగుల పోరాటానికి ప్రొఫెసర్ హరగోపాల్ సంఘీభావం

**నంగునూరు సెప్టెంబర్ 14 (జనంసాక్షి )**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత నెల రోజులుగా పాలిటెక్నిక్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ప్రముఖ విద్యావేత్త, హక్కుల నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్‌ను కలసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రొఫెసర్ హరగోపాల్ ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. అంతేకాకుండా జేఏసీ అభ్యర్థన మేరకు కమిటీకి గౌరవ సలహాదారుగా వ్యవహరించేందుకు అంగీకరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యా పరిరక్షణ కమిటీ తరఫున ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ కూడా మద్దతు ప్రకటించారు. జీవో 97ను రద్దు చేసే వరకు



పోరాటం ఆపేది లేదని జేఏసీ చైర్మన్ నాగరాజు మంకాల, కో-చైర్మన్ అభినవ్ బూరం, ఇతర ప్రతినిధులు స్పష్టం చేశారు.

## 18న వనపర్తి జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**వనపర్తి,బ్యూరో సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సెప్టెంబర్ 18న వనపర్తి జిల్లాను సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.ఐదుగురు సభ్యులతో కూడిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం సెప్టెంబర్ 18న వనపర్తి పట్టణంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనుంది.ఈ సమీక్ష సమావేశానికి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితర అధికారులు హాజరుకానున్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై కమిషన్ ఈ సందర్భంగా సమీక్షించనుంది.

### నేడు నారాయణపేట జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 15(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నేడు నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ బుధవారం ఉదయం 10 గంటలకు నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌తో పాటు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్ష సమావేశానికి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీసీఓలు/ఆర్‌సిఓలు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితర అధికారులు హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

## ఇంజనీర్ల కృషితోనే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యం

**జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** భారతదేశం గర్వించదగిన తొలి తరం ఇంజనీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జరుపుకుంటున్న జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు బి.వి. రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్ రావు, వనజతో పాటు పలువురు ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీర్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి జాతీయ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి నేటి ఇంజనీర్లకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. "రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ అభివృద్ధి అనేది ఇంజనీర్ల ప్రతిభ, కృషి లేకుండా సాధ్యం కాదు. రహదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, పట్టణాభివృద్ధి నుంచి ఆధునిక సాంకేతిక రంగాల వరకు ప్రతి అడుగులోనూ ఇంజనీర్ల పాత్ర ఉంది. దేశ అభివృద్ధికి ఇంజనీర్లు వెన్నెముకగా నిలుస్తున్నారు" అని మంత్రి అన్నారు. విశ్వేశ్వరయ్య తన జీవితాన్ని దేశ నిర్మాణానికి అంకితం చేశారని, ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టిని నేటి తరం ఇంజనీర్లు స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమంతో మేళవించి, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఇంజనీర్ల ముందున్న ప్రధాన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో కూడా బలమైన మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నాణ్యమైన రహదారులు, ఆధునిక భవనాలు, మెరుగైన మౌలిక సదుపాయాల ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఇంజనీర్లు అంకితభావంతో పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

## కోదాడకు బుల్లెట్ ట్రైన్ సాధనకు ప్రత్యక్ష కార్యాచరణ



**కోదాడ (జనంసాక్షి):** కోదాడకు బుల్లెట్ ట్రైన్ సాధనకు ప్రత్యక్ష కార్యాచరణ కార్యక్రమాలు కొనసాగించాలని అఖిలపక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో కనగాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన బుల్లెట్ రైలు సాధన సమితి సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ముందుగా అఖిలపక్ష నాయకులతో రైలు సాధన సమితి కమిటీని ఏర్పాటు చేయాలని దీనివలన కార్యచరణ రూపొందించుకోవడానికి మార్గం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో సాధన సమితి కమిటీ ఇచ్చిన పిలుపును అందుకొని ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కోదాడ ప్రజల దీర్ఘకాలిక అభివృద్ధి రవాణా సౌకర్యాలు, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ -- సూర్యాపేట -- కోదాడ -- విజయవాడ -- చెన్నై మార్గంలో బుల్లెట్ ట్రైన్‌ను కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తిలు చేయాలని కమిటీ నిర్ణయించింది.ఈ ప్రాంతం ద్వారా బుల్లెట్ ట్రైన్ అనుసంధానం జరిగితే కోదాడతో పాటు సూర్యాపేట జిల్లా ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపారం, పరిశ్రమలు మరియు పెట్టుబడుల పరంగా ఎంతో ప్రయోజనం తో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు .బుల్లెట్ రైలు మార్గం వచ్చినట్లయితే హైదరాబాద్--కోదాడ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి, భవిష్యత్‌లో కోదాడను ఒక ముఖ్యమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. పార్టీలకు అతీతంగా ఉద్యమాలు నిర్వహించాలని ఐక్యమత్యంతో ఉద్యమాలు నిర్వహించి కోదాడకి బుల్లెట్ రైలు మార్గాన్ని సాధించుకోవచ్చని వక్తలు అభిప్రాయాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఓరుగంటి ప్రభాకర్ రావు పైడిమర్రి వెంకటనారాయణ ఇమ్మడి రమేష్ నూనె సులోచన, పాలూరి సత్యనారాయణ బొలిశెట్టి కృష్ణయ్య, జూలకంటి శ్రీనివాసరావు, కర్రి సుబ్బారావు, చింతబాబుమాదిగ, పసుపులేటి రామారావు పగిడిరామారావు, అంబడికర్ర శ్రీనివాసరావు కట్టా సతీష్, భూమాశ్రీనివాసరావు, చిలుకూరు శ్రీనివాసరావు, రాకేష్ రెడ్డి, సైదా నాయక్, వెంకటరెడ్డి, శ్రీహరి, వాణిజ్య వ్యాపార సంఘాలు ప్రతినిధులు కుల సంఘాలు ప్రతినిధులు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

## అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. హైదరాబాద్-నానక్‌రామ్‌గూడలోని మంత్రీ కాస్మోస్ బిల్డింగ్‌లోకి అక్రమంగా ప్రవేశించి, గేటు తాళాలు పగులగొట్టి, సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించి అక్కడ టిన్‌షీట్లు ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ చంద్రశేఖర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, గడ్డం రవి తదితరులపై మంత్రీ కాస్మోస్ ఓనర్స్ అసోసియేషన్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే మంత్రీ కాస్మోస్ ఓనర్స్ అసోసియేషన్ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు కూడా ఫిర్యాదు లేఖను అందించారు.




## ఆర్‌కేపురం ఆర్‌యూబీకి భూసేకరణ వేగవంతం

**అధికారులతో సమీక్షలో ఎంసీఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

ఆర్‌కే పురం రోడ్ అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రాజెక్టు పనులు సకాలంలో ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. తార్నాకలోని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఆర్‌కే పురం ఆర్‌యూబీ ప్రాజెక్టుకు అవసరమైన భూముల వివరాలు, భూసేకరణ ప్రక్రియ పురోగతి, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూముల గుర్తింపు, రికార్డుల పరిశీలన, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు భూ యజమానులతో సమన్వయం పెంచాలని కమిషనర్ సూచించారు. భూసేకరణలో తలెత్తే సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సాంకేతిక వివరాలు, భూ వివరాలు, అవసరమైన ప్రతిపాదనలు తదితర ప్రక్రియలను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి దశలో పురోగతిని సమీక్షిస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. నగర రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమైన ఆర్‌కే పురం ఆర్‌యూబీ ప్రాజెక్టు అమలుకు అనుకూల వాతావరణం కల్పించేలా భూసేకరణ చర్యలను ప్రాధాన్యంతో చేపట్టాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రాజెక్ట్స్ హెడ్ ఈఈ రోహిణి, డిప్యూటీ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ విభాగ ఏసీపీలు, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోండి

### సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ జరపండి

**ప్రజలు వేసిన ఓటును దుర్వినియోగం చేసిన ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేయాలి**

**రాష్ట్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ ఫిర్యాదు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులు, ఇతర అధికారుల పట్ల అత్యంత అసభ్యంగా ప్రవర్తించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఆమె ఒక లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. చట్టసభల పవిత్రతను మంటగలుపుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సదరు ప్రజా ప్రతినిధులపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారు పోటీ చేయకుండా అడ్డుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఎన్నికల సంఘం ద్వారానే ఏ పౌరుడికైనా ఓటు హక్కు లభిస్తుందని, అలాంటి ఓటర్ల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులే, ఇలా ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమంటే ఓట్లను దుర్వినియోగపరచడమే అవుతుందన్నారు.

**అర్ధనగ్న ప్రదర్శనలు, దాడులకు యత్నం..**

ఈ నెల 7న తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన పేరుతో సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారని ఇందిరాశోభన్ తన ఫిర్యాదులో ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసుల ముందే కనీస ఇంగితజ్ఞానం లేకుండా తమ టీ షర్టులు విప్పేసి అర్ధనగ్నంగా ప్రదర్శనకు దిగారని మండిపడ్డారు. అంతేకాకుండా ఇతర పోలీసు అధికారుల కాలర్లు పట్టుకుని దాడికి యత్నించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని ఆమె విమర్శించారు. చట్టాలను అమలు చేసే పోలీసుల పట్ల, అందులోనూ మహిళా అధికారుల పట్ల చట్టసభల ప్రతినిధులే ఇలా అమానుషంగా ప్రవర్తించడం వారి నైతిక పతనానికి నిదర్శనమని ఘాటుగా స్పందించారు.

**రాజ్యాంగ విలువల ఉల్లంఘనే..**

నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో ప్రాథమిక హక్కే అయినప్పటికీ, అది ఇతరుల గౌరవానికి, ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఉండకూడదని ఇందిరాశోభన్ గుర్తుచేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14, 15, 21లతో పాటు, భారత న్యాయ స్మృతి ప్రకారం మహిళల పట్ల ఈ తరహా ప్రవర్తన తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి గెలిచిన ప్రజాప్రతినిధులే.. ఆ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించాలని కోరారు.

**సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా విచారణ జరపాలి**

ఈ ఘటనపై అసెంబ్లీ ప్రాంగణంలోని సీసీటీవీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా సమగ్ర విచారణ జరిపించాలని ఇందిరాశోభన్ డిమాండ్ చేశారు. నైతిక పతనం, రాజ్యాంగ విలువల ఉల్లంఘన కింద ఈ ఘటనను పరిగణించి బాధ్యులైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తరహా నేరపూరిత మనస్తత్వం ఉన్న వ్యక్తులు భవిష్యత్తులో తిరిగి చట్టసభల్లో అడుగుపెడితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను, మహిళల ఆత్మగౌరవాన్ని రక్షించే దిశగా ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించి కఠిన నిర్ణయం తీసుకుంటుందని తాను ఆశిస్తున్నట్లు ఆమె తన వినతిపత్రంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ మహిళా నాయకులు రేణుక గౌడ్, రజని, జోత్స్న తదితరులు ఎలక్షన్ కమిషన్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రగతినగర్‌లో విషాద ఘటన

**లిఫ్ట్ గ్యాప్‌లో పడి పెయింటర్ మృతి**



**హయత్‌నగర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** హయత్ నగర్ కుంట్లూరు రోడ్డులోని ప్రగతి నగర్‌లో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం వదిలిన ఖాళీ ప్రదేశంలో పడి ఓ పెయింటర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చింతలపూడి వెంకటేశ్వరరావు (55), తన కుమారుడితో కలిసి ప్రగతి నగర్‌లోని రాజధాని బ్యాంక్ పెంట్‌హౌస్‌లో పెయింటింగ్ పనుల కోసం వెళ్లారు. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి లిఫ్ట్ కోసం వదిలిన ఖాళీలో నుంచి కింద పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన ఆయన కుమారుడు వెంటనే కిందకు వెళ్లి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే అంబులెన్స్ చేరుకునేలోపే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భవన నిర్మాణ సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, లిఫ్ట్ గ్యాప్‌ను సురక్షితంగా మూసివేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవన నిర్మాణానికి సంబంధించిన బాధ్యతలు కలిగిన బిల్డర్ మల్లెల సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, భవనంలో భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు హయత్ నగర్ ఎస్హెచ్ఓ శంకర్ తెలిపారు.

## విజిలెన్స్ తనిఖీల్లో నిల్వల్లో తేడాలు



**శివ్వంపేట సెప్టెంబర్ 15 జనంసాక్షి :** శివ్వంపేట మండలం గూడురు శివారులోని శ్రీ సాయి వెంకటరమణ రైస్ మిల్లులో మంగళవారం జిల్లాతో పాటు హైదరాబాద్ చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా 2022--23 రబీ సీజన్ కు సంబంధించి 6,026 బస్తాల ధాన్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించడం జరిగిందని జిల్లా సివిల్ సప్లై ఇన్స్ పెక్టర్ తాటి నర్సింలు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి రూ.53 లక్షల 91వేల 606 చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ధాన్యం నిల్వలు, రికార్డుల్లో వ్యత్యాసాలపై విజిలెన్స్ అధికారులు వివరాలను నమోదు చేసుకుని తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

## కత్తి పెట్టి రూ.20 వేలు...

**రౌడీషీటర్ అరెస్ట్**




**రాజేంద్రనగర్,సెప్టెంబర్15(జనంసాక్షి) :** అత్తాపూర్‌లో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి యువకుడి గొంతుపై కత్తి పెట్టి రూ.20 వేలు డిమాండ్ చేసిన రౌడీషీటర్ సయ్యద్ మహమ్మద్ చంగో (25)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4న నూర్ జహాన్ బేగం ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకోగా, ఆమె కుమారుడు అబ్దుల్ రెహమాన్‌ను చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఈ నెల 13న కేసు నమోదు కాగా, 12 గంటల్లోనే అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నాలుగు కత్తులు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను అనగా తలకట్ల గంగయ్య తండ్రి పెద్ద గంగయ్య తలకట్ల. గ్రామం : పెద్దవాల్గోట్, మండలం : సిరికొండ జిల్లా : నిజామాబాద్ అను నా పాస్‌పోర్టు నంబరు జు4955558 గల పాస్‌పోర్ట్ కలదు. కొద్ది రోజుల క్రితం 2-26 నంబరు గల ఇల్లు మార్పిడి చేసే సమయంలో ఇట్టి పాస్‌పోర్ట్ పోయినది. కావున ఎవరికైనా దొరికినా ఎడల 99123 37006 నెంబర్‌కు సంప్రదించగలరు.

సంపాదకీయం

## డామిట్ కథ అడ్డం తిరిగింది

# భాజపాకు భారీ షాక్


*ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) విషయంలో భాజపాకు సొంత మిత్రపక్షమే గట్టి ఎదురుదెబ్బ ఇచ్చింది. పార్లమెంట్‌లో యూసీసీ బిల్లుకు మద్దతిచ్చిన జేడీయూ, బీహార్‌లో మాత్రం దీన్ని అమలు చేయబోమని సూటిగా తేల్చిచెప్పింది. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ దీన్ని అంగీకరించేది లేదని పార్టీ సీనియర్ నేత శ్యామ్ రజక్ చేసిన వ్యాఖ్యలు, నితీశ్ కుమార్ వైఖరిని మరోసారి బహిర్గతం చేశాయి. 2029 నాటికి 21 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో యూసీసీ అమల్లోకి వస్తుందన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనపై స్పందిస్తూనే, బీహార్‌లో తమ నిర్ణయం మారదని జేడీయూ స్పష్టం చేయడం భాజపా శిబిరంలో కలకలం రేపింది.*

ఇటీవలి పరిణామాలను గమనిస్తే, ఇది భాజపాకు ఒంటరిగా వచ్చిన దెబ్బ కాదు. జంజి ఆందోళనల నేపథ్యంలో పార్టీ ఇప్పటికే ఇబ్బందుల్లో ఉంది. భాజపా జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ కొనసాగుతున్న వేళ, ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం బీహార్‌లోని బంకీపూర్ శాసనసభ స్థానానికి రాజీనామా చేయాల్సి రావడం, ఆ తర్వాత ఖాళీ అయిన ఆ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీకి మరో ఎదురుదెబ్బగా మారింది. జాతీయ అధ్యక్షుడి సొంత నియోజకవర్గంలోనే ఎన్డీఏ కూటమి కీలక స్థానాన్ని కోల్పోవడం పార్టీ అంతర్గత బలహీనతను బయటపెట్టింది. ఈ నేపథ్యంలో సొంత మిత్రపక్షమైన జేడీయూ సైతం ఒక కీలక సైద్ధాంతిక అంశంపై బహిరంగంగా భిన్న వైఖరి తీసుకోవడం, భాజపా నాయకత్వానికి రాజకీయంగా మరింత ఇబ్బందికరంగా మారింది.

వాస్తవానికి యూసీసీ అనేది భాజపా సైద్ధాంతిక ఎజెండాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. దాన్ని జాతీయ స్థాయిలో బలంగా ముందుకు తీసుకెళ్తున్న తరుణంలోనే, అధికారంలో భాగస్వామిగా ఉన్న పార్టీయే బహిరంగంగా విముఖత వ్యక్తం చేయడం సైద్ధాంతిక స్థాయిలో ఒక వైరుధ్యాన్ని ఎత్తిచూపుతోంది. బీహార్ సమాజంలో లౌకికవాద భావజాలం బలంగా ఉందని, దాన్ని భాజపా గుర్తించాలని జేడీయూ నేతలు చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు నిదర్శనం.


ముఖ్యమంత్రి పదవి భాజపాకు చెందిన వ్యక్తి చేతిలో ఉన్నా, ప్రభుత్వం మిత్రపక్షాల మద్దతుతోనే నడుస్తోందన్న వాస్తవాన్ని జేడీయూ మరోసారి గుర్తుచేసింది. జాతీయ అధ్యక్షుడి సొంత రాష్ట్రంలోనే ఎదురైన ఈ వరుస ఎదురుదెబ్బలు, పార్టీకి రాజకీయంగా ఒత్తిడిని పెంచుతున్నాయి. రాబోయే రోజుల్లో యూసీసీ అమలుపై కేంద్రం ఎలాంటి వైఖరి తీసుకుంటుందన్నది, జేడీయూ వంటి మిత్రపక్షాల వైఖరిని భాజపా ఏమేరకు సర్దుబాటు చేసుకుంటుందన్నదానిపైనే ఆధారపడి ఉంటుంది.

## ఎల్‌నినో



వాన పోయెరా
నేల పేగు ఎండెరా
బతుకెట్లరా
కరువు కోర
ఎండిన పంటపైరు
బతుకెట్లరా
మట్టి బుక్కాలి
ఆకులు నమలాలి
ప్రాణం ఉండాలి
నీటి చావులు
తిండి లేక చావులు
అయ్యో జీవులు
బక్క ప్రాణులు
దిక్కు లేని దీనులు
రాలే చీమలు
మన నేతలు
మాటల పిచుకలు
నీటి రాతలు
వచ్చె కరువు
తెచ్చెముప్పు కనరు
మందపు చూపు
చావులు చూచి
కరగని సచివు
రాతి విగ్రహం
ప్రజల బాగు
కని కదలే పేగు
జనం సచివు
సూఫర్ ఎల్‌నినో
కరువుకు చెప్పునో
ధైర్యమే గెల్పు

రేడియమ్
9291527757



## ఓటమెరుగని యుద్ధానికి..

అమ్మను కదా..
అంతరంగంలో
అరణ్యాలు దగ్ధమవుతున్నా..
సవాలక్ష సంక్షోభాలు
కాటేద్దామని మాటేస్తున్నా..
ఓటమెరుగని యుద్ధానికి
నన్ను నేను సదా
సంసిద్ధం చేసుకుంటూనే
ఉంటానిలా...

-డా.ఇక్బాల్ పాషా
9440775732

# అలుపెరుగని కృషికి అరుదైన గౌరవం



పూర్వ నల్గొండ జిల్లా సిరిపురం గ్రామంలో దళిత కుటుంబంలో జన్మించాడు డా.గాదె వెంకటేష్. చిన్ననాటి నుండే చదువును నమ్ముకున్న కుటుంబం వీరిది. పెద్దన్న కండక్టర్ లక్ష్మయ్య మార్గదర్శకత్వంలో తనను తాను తీర్చిదిద్దుకున్నాడు. అన్న బాటలోనే అడుగులు వేస్తూ ఎదిగి వచ్చాడు. అట్లా విద్యార్థిగా ఉన్న రోజుల నుండే అంబేద్కరిజాన్ని అందిపుచ్చుకున్నారు. చదువుతూ పోరాడుతూ దళిత చైతన్య బావుటాను ఎగురవేశారు. 90వ దశకంలోనే ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిన కాలానికి వీరి కుటుంబమే ఒక కూడలి. అలాంటి కుటుంబం నుండి ఎదిగి వచ్చిన అటు దళితోద్యమంలో ఇటు, తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారు. కవిగా విలువైన కవిత్వం రాశారు. 'కుదురు'కవిత్వాన్ని వెలువరించారు. తన అన్న కండక్టర్ లక్ష్మణ్ మీద అన్నయ్య దీర్ఘకవితను ప్రచురించారు. ఇవే కాకుండా వ్యాసాలు, కథలు రాశారు. పారిశుధ్య సమస్య మీద, నిజాం కాలం నాటి స్థితిగతుల మీద విలువైన పుస్తకాలు రచించారు. తన రచనల్లో సామాజిక దృక్పథం, సామాజిక న్యాయకాంక్ష బలంగా ప్రతిధ్వనిస్తాయి.

అలాగే జేఎన్టీయూలో తాను పీహెచ్డీ పూర్తి చేశాడు. తన చదువు, వృత్తి, ప్రవృత్తి వేరు. అయినప్పటికీ తనలో ఉన్న సృజనకారున్ని కాపాడుకుంటూ ముందుకు సాగారు. అట్లా కవిగా, రచయితగా, సామాజిక కార్యకర్తగా, ఇంజనీర్గా బహుముఖ కృషి చేశారు. 22 యేళ్లుగా ఎన్విరాన్మెంట్‌ఇంజనీర్గా పని చేస్తున్నారు. పారిశుధ్య రంగంలో, ముఖ్యంగా ఘన వ్యర్థాల నిర్వహణ (Solid Waste Management) మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణ (Liquid Waste Management) అంశాలపై దశాబ్ద కాలానికి పైగా క్షేత్రస్థాయి నైపుణ్యం కలిగి ఉన్నారు. 'మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ' (పర్యావరణ నిర్వహణ మరియు సాంకేతికత)లో పి. హెచ్.డి. (Ph.D.) పట్టా పొందిండు. ఈ దేశంలో సుస్థిర పారిశుధ్య పద్ధతులను పెంపొందించడంలో గణనీయమైన కృషి చేసిన వారిలో డా.గాదె వెంకటేష్ కూడా ఒకరంటే అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం డాక్టర్ గాదె వెంకటేష్ 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్' (NIUM)తో అనుబంధం కలిగి ఉన్నారు. అక్కడ వీరు నాణ్యమైన పరిశోధన, వాటాదారులకు అవసరమైన శిక్షణ, సందర్భోచిత కన్సల్టెన్సీ సేవలు మరియు పట్టణ రంగ సమస్యలపై విధానపరమైన సూచనలు (policy advocacy) అందించడంలో నిమగ్నమై ఉన్నారు. పరిశోధన, విధానం మరియు ఆచరణాత్మక అమలు మధ్య అంతరాన్ని తగ్గించడంపై వీరి కృషి ప్రధానంగా ఉంటుంది. అంతకుముందు, 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' (ESCI)లో సుమారు ఏడేళ్ల పాటు పనిచేశారు. ఆ కాలంలో, వీరు పట్టణ స్థానిక సంస్థల (ULB) పారిశుధ్య విభాగ సిబ్బంది కోసం అనేక సామర్థ్య పెంపుదల మరియు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పర్యావరణ నిర్వహణ, నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ, ఝాలు, ఆన్-సైట్ పారిశుధ్య వ్యవస్థలు, ఘన వ్యర్థాల నిర్వహణ మరియు ఖీూాపీ వంటి అంశాలను కవర్ చేశాయి. వీరు 500కు పైగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి, వేలాది మంది వృత్తిపరమైన ఇంజనీర్లు, నిర్వాహకులు మరియు అధికారులకు (సివిల్ సర్వెంట్లు మరియు ప్రజాప్రతినిధులతో సహా) శిక్షణ ఇచ్చారు. డాక్టర్ గాదె వెంకటేష్ కృషి ఫలితంగా, మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణ మరియు పారిశుధ్య సేవలను సమర్థవంతంగా అందించడానికి 2009 సంవత్సరంలో పట్టణ స్థానిక సంస్థలలో (ULB) 'పర్యావరణ ఇంజనీర్' అనే కొత్త పదవిని సృష్టించారు. తెలంగాణలో పారిశుధ్య రంగంలో పర్యావరణ ఇంజనీర్లు ప్రస్తుతం కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆయన 2015 నుండి 2020 వరకు తెలంగాణలోని దాదాపు అన్ని పట్టణ స్థానిక సంస్థలను (ULB) సందర్శించి, ఝూ=లు మరియు నగర పారిశుధ్య ప్రణాళికల తయారీ మరియు సాంకేతిక సమీక్షలో చురుకుగా పాల్గొన్నారు. డా.గాదె హైదరాబాద్ ప్రాంతంలోని 41 ఖూదీల కోసం SWM DPRలను తయారు చేశారు, వరంగల్ ప్రాంతంలోని 31 ఖూదీలు మరియు 57 కొత్త ఖూదీల ఝూ=లను సాంకేతికంగా సమీక్షించారు, మరియు ఖూదీల కోసం నగర పారిశుధ్య ప్రణాళికల తయారీకి నాయకత్వం వహించారు. ఆయన సామర్థ్య నిర్మాణ మాడ్యూళ్లు, శిక్షణా క్యాలెండర్లు మరియు అమలు వ్యూహాలను రూపొందించడంలో కూడా పాలుపంచుకున్నారు.

2017 నుండి 2022 వరకు రాష్ట్ర SBM కోఆర్డినేటర్ మరియు ూజెవీ స్పెషలిస్ట్‌గా, డాక్టర్ గాదె నాయకత్వం వహించడంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణలోని 150కి పైగా ఖూదీలలో ఘన మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఆయన విజయవంతంగా అవగాహన కల్పించారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు పౌరులలో ప్రవర్తనా మార్పుకు, 6 లక్షలకు పైగా వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, సామూహిక మరియు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి, వ్యర్థాల విభజనను అవలంబించడానికి దోహదపడ్డాయి. మూలం వద్ద మరియు గృహ స్థాయిలో కంపోస్టింగ్. ఈ ప్రయత్నాలు వ్యర్థాల సేకరణ, రవాణా మరియు శాస్త్రీయ పద్ధతిలో పారవేయడంలో కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి దోహదపడ్డాయి, తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తెలంగాణ సాధించిన విజయాలకు మద్దతునిచ్చాయి.

విద్యా మరియు పరిశోధన రంగాలలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా, తెలంగాణ ప్రభుత్వం మరియు ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (Institution of Engineers India) తెలంగాణ రాష్ట్ర కేంద్రం, ఇంజనీర్-రాజనీతిజ్ఞుడు, భారత్‌రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి 164వ జయంతి ఉత్సవాల సందర్భంగా 57వ ఇంజనీర్స్ డే సందర్భంగా "ఇంజనీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు-2024"ను డాక్టర్ గాదె వెంకటేశ్ ఎంపిక కావడం గర్వకారణం.

**( డా.గాదె వెంకటేష్ "ఇంజనీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్-"ను అందుకున్న సందర్భంగా)**



- డా.పసునూరి రవీందర్
కేంద్ర సాహిత్య అకాడెమి యువపురస్కార గ్రహీత

# తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాదం ఎందుకు ఆవిష్కరించానంటే?

*నేడు ముస్లింలు దేశీయంగా, అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సంబంధించిన విభిన్న పార్శ్వాలను స్పర్శిస్తూ "సాయిబు"అనే నా దీర్ఘకవిత ఇస్లాంవాదాన్ని ఆవిష్కరిస్తూ వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే.అయితే ఇది ఇస్లాంవాదం అనే నూతన వాదంతో మొదలవటంతో సాహిత్యంలో పెద్ద చర్చ మొదలైంది.ఇది మతవాదమా?,మత ఛాందసవాదమా? మతోన్మాద వాదమా?అనే అపోహలు పెంచే విధంగా కొందరు పని గట్టుకుని గోబెల్స్ ప్రచారం చేశారు.అయితే కాలం చాలా బలీయమైనది.*

**"సత్యం వచ్చేసింది.అసత్యం నిష్క్రమించింది.అసత్యమైతే ఎప్పటికైనా నిష్క్రమించవల్సిందే"**

-పవిత్ర ఖుర్ఆన్



కాల పరీక్షకు ఇస్లాంవాదం తట్టుకుని నిలబడింది,బలపడింది, ముస్లింల సామాజిక, ఆర్థిక, రాజకీయ,సాంస్కృతిక స్వరంగా బలపడి ఇస్లాం అనే సైద్ధాంతిక, తాత్విక దృక్పథంతో ముందుకు సాగుతోంది.ముస్లింల చైతన్యానికి బాటలు వేస్తూనే తతిమ్మా అన్ని వర్గాల ప్రజలతో, పీడిత శక్తులతో కల్సి ప్రయాణం చేస్తుంది. దశాబ్దాల ముస్లింల వెనుకబాటుతనం,ఆవేదన, ఆగ్రహం నిరసన, కలలు, కన్నీళ్లు ఇప్పుడీ ఇస్లాంవాద సాహిత్య రూపంలో చిప్పిల్లాయి. ఏ సాహిత్యోద్యమమైనా ఆరంభంలో ధిక్కార స్వరంతో మొదలైనప్పటికీ క్రమేణా అది సైద్ధాంతికత, తాత్వికత వైపుకు ప్రయాణం చేయవల్సిఉంటుంది.కేవలం సంచలనాల కోసమే సాహిత్యమైతే సంక్షోభం తప్పదు.అందుకే ఆలోచనలతో కూడిన దూరదృష్టితో దీనికి సంబంధించిన దిశా నిర్దేశమే ఇస్లాంవాదం చేసింది.మన దేశం విభిన్న కులాల,మతాలు,జాతుల, సంస్కృతుల కలయిక. అందరికీ చెందిన ఒక ఉమ్మడి సంస్కృతి ఉంది.అదే లౌకికత్వం. ఇక్కడ ఒక్క మతమే రాజ్యమేలాలని ప్రయత్నించటం అప్రజాస్వామికం. అందుకే ఇస్లాంవాదం భారత రాజ్యాంగ విలువలకు కట్టుబడి నిజమైన లౌకిక రాజ్యం కోరుతోంది.ఇస్లామే రాజ్యమేలాలని, ముస్లింలే ఆధిపత్యం వహించాలనే కుత్సితత్వం మాకు లేదు.సమస్త బహుజనులతో కూడిన సోషలిస్టు,సెక్యులరిస్టు రాజ్యం మేం కోరుకుంటున్నాం.ఇస్లాంవాదం పుట్టుకరీత్యా సంక్రమించే ఏ కులానికి,మతానికి,ప్రాంతానికి,భాషకు వ్యతిరేకం కాదు.

"పుట్టుకతో ఎవరూ అధికులు కాదు,ఎవరూ అల్పులు కాదు...దైవప్రవక్త ముహమ్మద్ (స) అనే సర్వసమానతా సూత్రాన్ని మేం నమ్ముతాం.తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా భావించే నిజాయితీ, నిష్కల్మషత్వం ఇస్లాంవాదానికి ఉంది.మేం అన్ని మతాల ఉగ్రవాదాలను వ్యతిరేకిస్తాం.కనుకే నా సంపాదకత్వం లో "కవాతు"అనే పేరుతో 45 మంది కవులతో ఇస్లాంవాద కవితా సంకలనం వెలువడింది.

మన దేశంలో ప్రజలు అత్యధికంగా దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న వారే.ప్రజల ప్రధాన సమస్య ఆకలి,నిరుద్యోగం,కనీసం జీవన ప్రమాణాలకు నోచుకోకపోవటం అనేది నిజం.కానీ వీటిని విస్మరిస్తూ మెజారిటీ మతతత్వ ఫాసిస్టు శక్తులు ముస్లింలను,ఇస్లాంను ఒక బూచిగా చూపి సామాన్య ప్రజల్ని ముస్లింలపై రెచ్చగొడ్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు.ఇస్లామోఫోబియాను తమకు అందుబాటులో ఉన్న మీడియా ద్వారా, వనరుల ద్వారా వ్యాపింపజేస్తూ హింసను సృష్టిస్తున్నారు.దీని వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాలు వేరు.ప్రజలకు తమ ఆర్థిక దోపిడీ, పెట్టుబడిదారీ విధానం,మతాధిపత్య,రాజకీయాధిపత్య సామ్రాజ్యవాద సంస్కృతి అర్థం కాకుండా చేసి ఫాసిజాన్ని కొనసాగించటమే అసలు ఎజెండా.ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ముస్లింలమైన మా విశ్వాసాలు, సంస్కృతి, జీవన విధానం వక్రీకరించబడుతూ మాపై మూకదాడులకు కారణమౌతుంటే మేం నోరు విప్పగూడదా?ఇస్లాం శాంతిని, సామరస్యాన్ని, సమానత్వాన్ని ప్రభోదిస్తుందని,మా జీవన విధానం శ్రమైక విలువలు కలిగిన గొప్ప ఉత్పత్తి కారకమని మేం చెప్పకూడదా?మా అస్థిత్వం, విశ్వాసాలు కాపాడుకుంటూ ఉమ్మడి మూల సంస్కృతిలో ఎలా మిళితమవ్వాలో ముస్లింలకు ఎవ్వరూ నేర్పనక్ఖర్లేదు.ఆ ప్రజాస్వామిక దృక్పథం మాకుంది.అందుకే ఈ దేశ సమైక్యత కోసం ఇస్లాంవాదం గళమెత్తింది.దీనిని నిజాయితీతో ఆలోచించే అన్ని వర్గాల సాహిత్యకారులు స్వాగతించారు.పైకి ప్రగతిశీల ముసుగుల్లో ఉంటూ లోలోపల ఇస్లామోఫోబియా, ముస్లిం ఫోబియాతో దహించుకుపోయే బూటకపు సెక్యులరిస్టులకు సహజంగానే ఇస్లాంవాద సాహిత్యోద్యమం మింగుడు పడలేదు.ఇస్లాం అంటే మతం కదా! ముస్లిం అంటే జాతి కదా!అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.మా ఏడుపును కూడా మమ్మల్ని ఏడ్వద్దంటారు.మీ ఏడుపును కూడా మేమే ఏడుస్తాం మీరేడుస్తే అది మతమౌద్దంటారు.నిజానికి ఇస్లాం అనే విశ్వాసంపై ఆధారపడే ముస్లిం (దైవవిధేయుడు)అనే పదం ఉనికిలోకి వచ్చింది.ఈ రెండూ పరస్పర ఆధారిత పదాలే తప్ప వేర్వేరు కాదు.ఇస్లాం అనేది ఒక సమగ్ర జీవన విధానం అని మేం నమ్ముతాం."ధర్మం విషయంలో ఎటువంటి బలాత్కారానికి తావు లేదని "పవిత్ర ఖుర్ఆన్ చెప్తుంది.ఈ ప్రజాస్వామిక సూత్రం ఎల్లప్పుడూ పాటిస్తాం.ముస్లిం సమాజంలో అంతర్గత సంస్కరణలకు మేం వ్యతిరేకం కాదు.అయితే ఏది సంస్కరణ?ఏది కాదో మాకొక అవగాహన ఉంది.అంతర్జాతీయ,దేశీయ సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ సంస్కృతులకు మేం లోబడం. మా స్వీయ అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే పీడిత శక్తులతో కల్సి నడిచేప్రజా ఉద్యమాలలో మమేకమయ్యే చైతన్యాన్ని విస్తరిస్తాం.మాది మతవాదమూ కాదు.మత ఛాందస వాదమూ కాదు.మతోన్మాద వాదమూ కాదు.ఇస్లాంవాదం సర్వ సమానతా వాదం.మానవీయ విలువలతో కూడిన విశ్వమానవ వాదం.ఇన్నేసి ప్రగతిశీల,లౌకిక, ప్రజాస్వామిక సమున్నత లక్ష్యాలతో తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాదాన్ని ఆవిష్కరించాను.నేను మాట్లాడే ప్రతి విషయం రాజ్యాంగబద్ధమైనది.మానవాళికి సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని ప్రతిపాదించిన ఇస్లాంను మత ఛాందసుల చేతుల్లోకీ,మత ఉగ్రవాదులు చేతుల్లోకి వెళ్లకుండా,ప్రగతిశీలుర చేతుల్లో ఉంచటం కూడా మా లక్ష్యంలో భాగమే.దీనిని బలోపేతం చేయాల్సిన బాధ్యత కేవలం ఇస్లాంవాద కవులపైనే కాదు.ప్రగతిశీల, సెక్యులరిస్టు శిబిరాలకు చెందిన అందరు కవులపై ఉంది.

- కవి కరీముల్లా

# అరుపులు,కేకల జర్నలిజానికి అర్నబ్ గోస్వామి ఓ ప్రతీక

*టెలివిజన్ జర్నలిజంలో యాంకర్ పని వార్తను అరిచి చెప్పడం కాదు. వార్త వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయడం. చర్చను కేకల పోటీగా మార్చడం కాదు; భిన్నాభిప్రాయాలను ఆధారాలతో సహా ఎదురెదురుగా నిలబెట్టడం. కానీ భారత టెలివిజన్ జర్నలిజంలో అర్నబ్ గోస్వామి నిర్మించిన మోడల్ ఈ ప్రాథమిక సూత్రాలనే తలకిందులు చేసిందన్న విమర్శ చాలాకాలంగా ఉంది. రిపబ్లిక్ టీవీ ప్రైమ్‌టైమ్‌లో ప్రశ్నకంటే తీర్పు ముందుంటుంది. వాదనకంటే అరుపు ఎక్కువగా వినిపిస్తుంది, ఆధారాలకంటే రాజకీయ లేబుళ్లు పెద్దగా కనిపిస్తాయి. అందుకే ఈ శైలి జర్నలిజమా?, లేక టీఆర్పీ కోసం రూపొందించిన రాజకీయ టెలివిజన్ 'షో' నా ?అన్న ప్రశ్న తప్పనిసరిగా తలెత్తుతోంది.*

అర్నబ్ గోస్వామి ప్రత్యేకతగా చెప్పుకునే "హై-వోల్టేజ్" జర్నలిజం వాస్తవానికి ప్రేక్షకుడి భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసార శైలిగా మారిందని విమర్శకులు చాలాకాలంగా చెబుతున్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ వంటి రాజకీయ ప్రత్యర్థులపై ఆయన నిర్వహించే కార్యక్రమాల్లో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. రాజకీయ ప్రత్యర్థిపై కఠినమైన ప్రశ్నలు వేయడం ఎంత మాత్రం తప్పు కాదు. కానీ ఒక జర్నలిస్టు ప్రశ్నించే వ్యక్తి స్థానాన్ని దాటి రాజకీయ ప్రత్యర్థిని ముందుగానే దోషిగా చిత్రించే స్థాయికి వెళ్లినప్పుడు జర్నలిజం, రాజకీయ ప్రచారం మధ్య ఉన్న సరిహద్దును చెరిపేస్తుంది.

రాహుల్ గాంధీపై రిపబ్లిక్ టీవీ కార్యక్రమాల్లో తరచుగా కనిపించే పదజాలం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. ఆయన రాజకీయ నిర్ణయాలను, కాంగ్రెస్ వ్యూహాలను, ప్రతిపక్ష పాత్రను ఆధారాలతో విమర్శించవచ్చు. కానీ వ్యక్తిని ఎగతాళి చేయడం, పదేపదే అవమానకరమైన విశేషణాలతో సంబోధించడం, ఒక రాజకీయ నాయకుడి ప్రతిష్ఠను దెబ్బతీయడమే కార్యక్రమానికి ప్రధాన ఉద్దేశ్యంగా కనిపించేలా చర్చను నడపడం మాత్రం జర్నలిజం ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ విమర్శలకు ఆధారాలు ఉండాలి. అంతే కానీ యాంకర్ సంయమనం కోల్పోయి తన ఆగ్రహాన్నే ప్రదర్శించడమే టీవీ షో లక్ష్యం కాకూడదు.



అర్నబ్ మోడల్‌లో అత్యంత స్పష్టంగా కనిపించే అంశం "అరుపును వాదనగా మార్చడం". ఒక ప్యానలిస్టు మాట్లాడుతుంటే మధ్యలో అడ్డుకోవడం. ఒకేసారి పలువురితో మాట్లాడించడం. సమాధానం పూర్తికాకముందే మరో ప్రశ్న సంధించడం. తెరపై పెద్ద అక్షరాలతో రెచ్చగొట్టే పదాలను ప్రదర్శించడం. యాంకర్ స్వరాన్నే చర్చకు కేంద్రంగా మార్చడం. ఇవి ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించవచ్చునేమో కానీ, చర్చలోని అసలు విషయం మాత్రం ఆ గందరగోళంలో కనిపించకుండా పోతుంది. రాయిటర్స్ ఇన్స్టిట్యూట్ కూడా భారత టెలివిజన్ వార్తల్లో పెరుగుతున్న దూకుడు, ప్రజాకర్షక రాజకీయ ప్రసార శైలిపై పరిశీలన చేస్తూ రిపబ్లిక్ టీవీ చర్చలను ఉదాహరణగా ప్రస్తావించింది.

ఇక్కడ అసలు ప్రశ్న టీఆర్పీ సంస్కృతిపై. వార్తను ఎంత బాగా పరిశోధించామన్నదికంటే, ఎంత మంది చూశారన్నదే ప్రధాన ప్రమాణంగా మారితే జర్నలిజం సహజంగానే సంచలనాత్మకత వైపు పరుగెడుతుంది. 2020లో రిపబ్లిక్ టీవీకి సంబంధించి టీఆర్పీ రేటింగ్స్‌ను ప్రభావితం చేశారన్న ఆరోపణలతో ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో తీవ్రమైన ఆరోపణలు నమోదయ్యాయి. అర్నబ్ గోస్వామి, రిపబ్లిక్ టీవీ మాత్రం ఆరోపణలను ఖండించారు. తరువాత ఈ దర్యాప్తు పద్ధతిపైనా ప్రశ్నలు తలెత్తాయి. కాబట్టి దీనిని తుది నేర నిర్ధారణగా చెప్పడం సరైంది కాదు. కానీ ఒక వార్తా సంస్థ తన ప్రేక్షకాదరణను ఎలా సంపాదిస్తోంది అన్న ప్రశ్న ఇంత పెద్ద వివాదంగా మారడం మాత్రం మీడియా నైతికతకు హెచ్చరిక.

రిపబ్లిక్ టీవీపై వచ్చిన విమర్శలు కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. బ్రిటన్ ప్రసార నియంత్రణ సంస్థ ఆఫ్కామ్ ఒక రిపబ్లిక్ ప్రసారానికి పక్షపాతపూరిత, అవమానకరమైన వ్యాఖ్యల విషయంలో జరిమానా విధించింది. అంతర్జాతీయ మీడియా కూడా భారత టెలివిజన్ చర్చల్లో పెరుగుతున్న "మీడియా ట్రయల్స్", అరుపుల సంస్కృతి, రాజకీయ ధ్రువీకరణపై అనేక సందర్భాల్లో దృష్టి పెట్టింది. అంటే సమస్య కేవలం అర్నబ్ గోస్వామి వ్యక్తిగత శైలికి సంబంధించినది కాదు. ఆయన ప్రాచుర్యం పొందిన ప్రసార విధానం భారత టెలివిజన్ జర్నలిజంపై చూపుతున్న ప్రభావం కూడా పరిశీలించాల్సిన అంశమే.

అర్నబ్‌పై, రిపబ్లిక్ టీవీ ప్రసారాలపై వివిధ సందర్భాల్లో అనేక ఫిర్యాదులు, కేసులు నమోదయ్యాయి. కేసు నమోదవడం నేర నిర్ధారణ కాదన్న విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. అదే సమయంలో కేసులు నమోదయ్యాయనే వాస్తవాన్ని పూర్తిగా రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కూడా సరైన పద్ధతి కాదు. ప్రతి కేసును దాని ఆధారాలు, దర్యాప్తు, న్యాయస్థానాల నిర్ణయాల ప్రకారం మాత్రమే అంచనా వేయాలి. జర్నలిస్టుకు చట్టపరమైన హక్కులు ఉన్నట్లే, ప్రజల పట్ల బాధ్యత కూడా ఉంటుంది.

ఇంకో ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, ఈ అర్నబ్ మోడల్‌ను అనుకరించడానికి ఇతర టెలివిజన్ ఛానళ్లు ప్రయత్నించడం. ఒక యాంకర్ అరుస్తాడు. ప్రేక్షకులు ఉత్కంఠతో చూస్తారు. ప్రేక్షకాదరణ పెరుగుతుంది. ప్రకటనలు పెరుగుతాయి. అప్పుడు ప్రశాంతమైన, పరిశోధనాత్మకమైన, ఆధారపూర్వకమైన జర్నలిజం కంటే ఘర్షణాత్మకమైన ప్రసారం వ్యాపారపరంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఫలితంగా వార్త ఒక సమాచార సాధనం నుంచి వినోద వస్తువుగా మారుతుంది. ప్రజాస్వామ్యానికి కావాల్సిన స్వతంత్ర మీడియా స్థానంలో రాజకీయ ధ్రువీకరణను పెంచే ప్రసార పరిశ్రమ ఏర్పడే ప్రమాదం ఉంది.

సామాజిక మాధ్యమాల్లో అర్నబ్ గోస్వామిపై వ్యంగ్య చిత్రాలు, మీమ్స్, విమర్శలు విస్తృతంగా కనిపించడం కూడా ఆయన శైలిపై ఉన్న ప్రజా ప్రతిస్పందనలో ఒక భాగం. అయితే సామాజిక మాధ్యమాల మీమ్స్‌ను ప్రజాభిప్రాయానికి శాస్త్రీయ కొలమానంగా చూడలేం. అసలు ప్రశ్న మరింత తీవ్రమైనది. ప్రేక్షకులు ఆ కార్యక్రమాలను చూస్తున్నారా? లేదా ? అన్నది కాదు. వారు నిజమైన, సమతుల్యమైన, ఆధారపూర్వకమైన సమాచారాన్ని పొందుతున్నారా ? లేదా? అన్నదే ప్రధానాంశం.

జర్నలిజం అంటే అధికార పక్షాన్ని ప్రశ్నించడం. అలాగే ప్రతిపక్షాన్ని ప్రశ్నించడం కూడా జర్నలిజంలో భాగమే. ఒకే ప్రమాణాన్ని అధికారానికి, ప్రతిపక్షానికి వర్తింపజేయడమే నిజమైన నిష్పాక్షికత. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించినప్పుడు దేశద్రోహం కాదు; ప్రతిపక్షాన్ని ప్రశ్నించినప్పుడు కూడా ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. కానీ ప్రశ్నించే వ్యక్తి తన రాజకీయ అభిప్రాయాన్ని వార్తగా, తన కోపాన్ని విశ్లేషణగా, తన తీర్పును ప్రజా తీర్పుగా మార్చకూడదు.

అర్నబ్ గోస్వామి వ్యక్తిగత ప్రజాదరణ ఎంత ఉన్నా, ఆయన నిర్మించిన అరుపుల మోడల్ భారత మీడియాకు ఆదర్శంగా మారడం మాత్రం ప్రమాదకరం. ఎందుకంటే జర్నలిస్టు గొంతు ఎంత పెద్దదైనా నిజం అంత పెద్దది కాదు. యాంకర్ కోపం ఎంత తీవ్రంగా ఉన్నా ఆధారం దానికంటే బలమైనది. తెరపై పదాలు ఎంత పెద్దగా కనిపించినా వాస్తవం వాటి కంటే పెద్దది. అరుపు వార్త కాదు. సంచలనం సత్యం కాదు. రాజకీయ నినాదం విశ్లేషణ కాదు. ప్రత్యర్థిని అవమానించడం, దభాయించడం జర్నలిజం కాదు. టీఆర్పీ కోసం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం ప్రజాసేవ కాదు.

ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా నిలవాలంటే అది అధికారాన్ని మాత్రమే కాదు, తనను తాను కూడా ప్రశ్నించుకోవాలి. లేదంటే "దేశం కోసం గొంతెత్తుతున్నాం" అనే నినాదం వెనుక అసలు మిగిలేది దేశ ప్రయోజనం కానేకాదు. తన గొంతు ఎక్కువగా వినిపించాలనే తాపత్రయం మాత్రమే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు

- ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మహిళా సాధికారతతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను అందిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిజిటల్ (స్మార్ట్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సుమారు 1.23 లక్షల పాత రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మారుస్తుండగా, కొత్తగా సుమారు 60 వేల మందికి రేషన్ కార్డుల్లో సభ్యులుగా నమోదుకు అవకాశం కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు పారదర్శకంగా అందించడమే ఈ డిజిటల్ కార్డు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, పౌరసరఫరాల అధికారి పుల్లయ్య, రెవెన్యూ అధికారులు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ, హైదర్గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామా ఇంద్రపాల్ రెడ్డి, నాయకులు జి. శ్రావణ్, ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 18లోగా హామీలు నెరవేర్చాలి
- లేదంటే హైదరాబాద్ దిగ్బంధనం
- మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి ట్రేడ్‌మార్క్
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**ముషీరాబాద్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రేడ్‌మార్క్‌గా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి బెదిరింపులకు దిగుతున్నారని కవిత ఆరోపించారు. ఉద్యోగులు ప్రభుత్వానికి బానిసలు కాదని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అడగడానికి వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీ, పెన్షన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత 32 నెలలుగా ఆరు డీఏలు బకాయి ఉన్నాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ



చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలో టీచర్ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా ఉన్న ఉపాధ్యాయులపై పనిభారం పెంచుతున్నారని కవిత ఆరోపించారు. ప్రమోషన్లు, డీఏలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. 2003లో నియమితులైన ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలుతో ప్రభుత్వానికి సుమారు రూ.2 వేల కోట్ల ఆదా అవుతుందని, ఆ నిధులతో ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని సూచించారు. ఉద్యోగుల హెల్త్ కార్డులు పనిచేయకపోవడం పై కూడా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల 37 డిమాండ్లలో చాలా వరకు ఆర్థిక భారం లేనివేనని, 317 జీవో సహా పలు సమస్యలను ప్రభుత్వం సులభంగా పరిష్కరించగలిగినా పట్టించుకోవడం లేదన్నారు.

### 18లోగా హామీలు నెరవేర్చాలి

ఈ నెల 18లోగా ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యోగ సంఘాలు హైదరాబాద్ దిగ్బంధనానికి పిలుపునివ్వాలని కోరారు. ఉద్యోగుల పోరాటానికి తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఘర్షణకు దిగిన ప్రభుత్వాలు తిరిగి అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను అభివృద్ధిలో భాగస్వాములుగా చేసి గౌరవంగా చూసుకుంటామని అన్నారు.

### ఉద్యోగ సంఘాలపై విమర్శలు

ప్రభుత్వ ఒత్తిడికి ఉద్యోగ సంఘాలు తలొగ్గి తమకు నష్టం చేస్తున్నాయని టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కవిత ఆధ్వర్యంలో పోరాటం చేయాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులపై అధిక పనిభారం ఉందని సంఘాల నాయకుడు సంజీవ్ పేర్కొంటూ, శ్రమ దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, టీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కనిష్క మహేందర్‌రెడ్డి, విద్యావేత్త ధరణి రాణి తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన శాఖలో నిర్లక్ష్య వైఖరికి తావులేదని,అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం,జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం, పాఠశాల నిర్వహణ, సిబ్బంది, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలపై అక్కడ ఉన్న ఎంఈఓ కార్యాలయ సిబ్బందిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశంని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఎంఈఓ కార్యాలయం హాజరు రికార్డులు సక్రమంగా నిర్వహించక పోవడం పై ఆయన మండిపడ్డారు.ఇదే విషయం పై ఎమ్మెల్యే ఎంఈఓను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందించకపోవడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై జడ్పీ సీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. నవాబుపేట్ మండలంలో ఎంఈఓ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకుండా, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలలు, కార్యాలయాల్లోనే విధులు నిర్వహించేలా చూడాలని సూచించారు.ఎంఈఓ ప్రజాప్రతినిధులకే ఫోన్‌లో స్పందించని



పరిస్థితి ఉంటే..విద్యార్థులు, ఉపాధ్యాయుల గోడు ఎవరికి చెప్పుకోవాలి..అంటూ ఎమ్మెల్యే ఎంఈఓ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యాశాఖలో అధికారులు బాధ్యతలను విస్మరించడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, మండలం అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బల్వంత్ రెడ్డి,నాగిరెడ్డిపల్లి సర్పంచ్ శేఖర్,సీనియర్ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్, మాణిక్యం,తదితరులు ఉన్నారు.

### టీచర్ వస్తే చదువు..లేకుండే సెలవు

ఉన్న ఒక్క టీచర్ వస్తేనే చదువు..లేకపోతే సెలవేనా..? ఏకంగా పాఠశాలకే తాళం వేసిన పరిస్థితి మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో నెలకొంది.ఉపాధ్యాయులు సెలవు పెడితే కనీసం ప్రత్యామ్నాయ బోధనా ఏర్పాట్లు కూడా చేయకపోవడంపై నవాబ్ పేట్ ఎంఈఓ తీరు పై తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై స్థానిక సర్పంచ్ గొల్ల శేఖర్, గ్రామస్తులు నవాబ్ పేట్ ఎంఈఓ అబ్దుల్ రహమాన్ కీ ఫోన్ చేసిన స్పందించలేదని వరన్నారు.టీచర్ రాకపోవడం ఒక సమస్య అయితే.. సమస్యను చెప్పేందుకు ఫోన్ చేసినా ఎంఈఓ స్పందించకపోవడం మరో సమస్యగా మారిందని వారు మండిపడుతున్నారు.పాఠశాలకు సమయానికి చేరుకున్న విద్యార్థులు ఎంతసేపు ఎదురుచూసినా బడి తలుపులు తీయకపోవడం,టీచర్ విధులకు రాకపోవడంతో పాఠశాలకు తాళం వేసి ఉండటంతో.. చేసేదేమీ లేక విద్యార్థులు బయటే నిరీక్షించి చివరకు ఇంటిబాట పట్టారు.ఒక్క టీచర్ సెలవుతోనే విద్యార్థుల చదువుకు సెలవు ప్రకటించే పరిస్థితి ఉంటే.. విద్యాశాఖ పర్యవేక్షణ ఏం చేస్తున్నట్లు? అని వారు ప్రశ్నిస్తున్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యాశాఖలో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా సంబంధిత అధికారులపై పై అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు,గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## సెట్విన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



**మక్తల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన సెట్విన్ సాంకేతిక శిక్షణా సంస్థ ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సూచించారు. మంగళవారం సెట్విన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె, కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, కంప్యూటర్ ట్రైనింగ్ లలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులను అడిగి శిక్షణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, స్పోర్ట్స్ యూత్ సర్వీసెస్ శాఖ మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తన శాఖలోనే అనుబంధంగా ఉన్న సెట్విన్ కేంద్రాన్ని మక్తల్ కు తీసుకువచ్చారని తెలిపారు. మక్తల్ ప్రాంత మహిళలు స్వయం ఉపాధితో తమకాళ్లపై తాము నిలబడాలని, నారాయణపేట, గద్వాల, వనపర్తి లాంటి జిల్లా కేంద్రాల్లో సైతం లేని సెట్విన్ ను... మక్తల్ లో ఏర్పాటు చేశారంటే ఈ ప్రాంతంపై మంత్రి వాకిటి శ్రీహరికి ఉన్న ప్రత్యేక అభిమానమని అన్నారు. త్వరలోనే సెట్విన్ కింద మరిన్ని విభాగాలకు సైతం శిక్షణను విస్తరించే యోచనలో మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య నీల గౌడ్, వార్డు కౌన్సిలర్ రహీం పటేల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్మారి రవికుమార్, నాయకులు చంద్రకాంత్ గౌడ్, అమర్, గోవిందరావు, నీలప్ప ముదిరాజ్, సెట్విన్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ట్రైనర్లు తిమ్మప్ప, స్వప్న, వీరమ్మ, ఫర్హానా, సిబ్బంది ప్రవీణ్, లక్ష్మీ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధనకు ఉద్యమాలు కొనసాగించాలి

**సూర్యాపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మన ఇంటి ముందుకు వచ్చిన బుల్లెట్ ట్రైన్ ను కుట్రపూరితంగా పక్కదారి పట్టిస్తున్న తీరుపై విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ నాయకులు శంకరయ్య పిలుపునిచ్చారు. సూర్యాపేటకు నేషనల్ హైవే 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో భాగంగా 33వ రోజు మంగళవారం లంబాడి విద్యార్థి సేన ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన సేవలు పొందాలంటే బుల్లెట్ ట్రైన్ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించాలని కోరారు.దీక్షలో విశ్వనాథ్ రాథోడ్, శ్రవణ్ కుమార్, సిద్దు, సాయిచరణ్, మధు, విశాల్, లింగనాయక్, రమేష్, బాలాజీ పాల్గొన్నారు.వారికి మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, రమణాచారి,



ధర్మార్జున్, డేవిడ్ కుమార్, శివకుమార్, అనంతుల మధు, జర్నలిస్టు భూపతి రాములు,వనిత, మల్లికార్జున్, సుందరయ్య, బాలస్వామి, సట్టు నాగయ్య, వాసుదేవరావు, సలీం, శోభన్ రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.

## పాంచజన్య సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** కొడంగల్‌లో జరగనున్న పాంచజన్య సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మెదక్ టి అర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరించి, సభకు సంబంధించిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెరాస పార్టీ సీనియర్ నాయకులు లిఇప్పా రమేశ్ , కేవల్ నందకిషోర్ తెరాసవి అధ్యక్షులు ఎండీ జునైద్ , కాసాపురం అశోక్ , వేపురి శ్రీనివాస్ గారు ౹=ా సోషల్ మీడియా మెదక్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వైష్ణవ్ రాజ్ , దినేశ్ , రేహాన్ , మల్లేశ్ , మోయినుద్దీన్ , ప్రేమ్ , భూపత్పూర్ రమేశ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొడంగల్‌లో జరగనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం



చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కేసీఆర్ గిరిజన బాంధవుడు

- రేవంత్ రెడ్డి గిరిజన ద్రోహి...
- రేవంత్ పాలనపై గిరిజనుల ఫైర్..
- తెలంగాణ బాపు కేసీఆర్ చేసిన అభివృద్ధి ఎక్కడ? కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఎక్కడ?
- గిరిజనులపై కాంగ్రెస్‌కు అంత ప్రేమ ఉంటే..
- ఒక్క మంత్రి పదవి కూడా ఎందుకు ఇవ్వలేదు

**బోడుప్పల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ గిరిజన నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో గిరిజనులకు హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ సాధికారతతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందితే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల సమస్యలపై ఎందుకు స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని ప్రశ్నించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో గిరిజన నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. లకావత్ కిరణ్ నాయక్ మాట్లాడుతూ.. “మా తండాలో మా రాజ్యం” అనే నినాదాన్ని నినాదంగానే కాకుండా ఆచరణలో చూపించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. 3,146 తండాలు, గోండు గూడేలు, చెంచు పెంటలను గ్రామ పంచాయతీలుగా మార్చి




గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం, గిరిజన గురుకులాలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు, గిరిజన భవనాలు, ఉపాధి పథకాలు వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో తండాలకు రోడ్లు వచ్చాయి.. విద్యుత్ వచ్చింది.. తాగునీరు వచ్చింది.. పంచాయతీ హక్కులు వచ్చాయి. గిరిజనులకు ఆత్మగౌరవం వచ్చింది. మరి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు కొత్తగా ఏం ఇచ్చారో రేవంత్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి” అని లకావత్ కిరణ్ నాయక్ సూటిగా ప్రశ్నించారు. వెంకట్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. “గిరిజనులు ఇక మాటలను నమ్మే పరిస్థితిలో లేరు.. చేసిన పనులను, ఇచ్చిన హక్కులను చూసే పరిస్థితిలో ఉన్నారు” అని అన్నారు. “గిరిజనులను ఓటు బ్యాంకుగా చూస్తే సహించేది లేదు. వారి హక్కులు, సంక్షేమం, భూములు, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా బీఆర్ఎస్ గిరిజన విభాగం ప్రజల తరఫున నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తుంది” అని నాయకులు హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో గిరిజనుల కోసం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందా? అని సవాల్ విసిరారు. గిరిజనుల అభివృద్ధిపై రాజకీయాలు కాకుండా.. వారికి న్యాయం చేయడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, లేతాకుల మాదవి రఘుపతి రెడ్డి,కౌడే పోచయ్య, యూత్ అధ్యక్షులు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, బుల్లెట్ శంకర్, అశోక్, కైసర్, అక్షిత్, రాజ్ కుమార్, శ్రీను నాయక్, రామ్ నాయక్, యాకు నాయక్, జాటోత్ అశోక్, నాగేశ్వరరావు, వేణుగోపాల్, చంద్రశేఖర్, వెంకన్న, రవి, కళ్యాణి, ఇందిర, సరస్వతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** భారతరత్న, ప్రముఖ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో మంగళవారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అందిస్తున్న సేవలను అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు.జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ యుగేందర్ మాట్లాడుతూ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, సమయపాలన, నాణ్యత, నిబద్ధత, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఇంజనీర్లు పనిచేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.ఆందోల్ కార్యనిర్వహణ ఇంజనీర్ కుర్మయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాలువలు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం ఇంజనీర్ల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.సంగారెడ్డి ఉపవిభాగ ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ ఇంజనీర్లు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకొని ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉప కార్యనిర్వహణ ఇంజనీర్లు రామచందర్, తబిత, అన్విత, సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్లు కోటేశ్వర్ రావు, అరవింద్, శ్రీనాథ్ రెడ్డి, సంధ్య, అఫ్రోజ్, స్థల ఇంజనీర్లు జగదీష్, శివరాజ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లంబాడీ వారసుల పోడు భూముల పట్టాలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

- ఎస్టీ సెల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్



**కొల్లాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** లంబాడీ వారసులకు పోడు భూముల పట్టాలపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్టీ సెల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పట్టణ పరిధిలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని లంబాడీ తండాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అందాయని చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ముఖ్యంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తండాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో అర్హులైన లంబాడీ వారసులకు పెద్ద సంఖ్యలో పోడు భూముల పట్టాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, తండాల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే కొందరు నాయకులు రాజకీయ పార్టీలు మారుతున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీలు మారిన వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తమ ఉద్దేశం కాదని, ప్రజలకు ఏ పార్టీ ద్వారా ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది, తండాల అభివృద్ధికి ఎవరు కృషి చేస్తారనే అంశాన్నే ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 30 నెలలు గడుస్తున్నప్పటికీ లంబాడీ తండాలు, గ్రామపంచాయతీల అభివృద్ధి విషయంలో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని చంద్రశేఖర్ నాయక్ విమర్శించారు. తండాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం తదితర సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని లంబాడీ తండాల్లో పోడు భూముల పట్టాలు పొందిన లంబాడీ వారసులపై కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల ఆధారంగా తమ భూములను సాగు చేసుకుంటున్న వారిపై కేసులు పెట్టడం సరికాదని, ఇప్పటికే నమోదైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి, లంబాడీ వారసులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 17వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని లంబాడీ తండాలు, గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసే కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్టీ సెల్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని తండాల్లో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన లంబాడీ వారసులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లంబాడీ వారసుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పోడు భూముల పట్టాలపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. లంబాడీ వారసుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఇదే విధంగా చిన్నచూపు చూస్తే రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. లంబాడీ సమాజం తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిసాన్ నాయక్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్, పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, ఎస్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులే..

- సీపీఎం నేత ఆర్. శ్రీనివాస్



**తెలకపల్లి, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడ్డంపల్లిలో కామ్రేడ్ లింగోజిరావు స్థూపానికి నివాళులర్పించిన అనంతరం గడ్డంపల్లి, అనంతసాగర్, బండపల్లి, దాసుపల్లి గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించి మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దొరలు, జాగీర్దారులు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారులు ఎర్రజెండా నాయకత్వంలో సాగించిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమమన్నారు. ఈ పోరాట ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందని, వేలాది గ్రామాలు విముక్తి పొందాయని తెలిపారు. పోరాట చరిత్రను మతపరమైన వివాదంగా చిత్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నేడు అభివృద్ధి పేరుతో పేదల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భూమి, కూలీ, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. శ్రీను, రామయ్య, గుంపల్లి అశోక్, జిల్లా నాయకులు గోపాస్ లక్ష్మణ్, నాగపూర్ మధు, అంతటి కాశన్న, మండల నాయకులు నందిపేట భాస్కర్, విజయ్ గౌడ్, కాసన్న, శివరాం, మనోహర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేస్తే కఠిన చట్టాలు



**ఇటిక్యాల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు లక్ష్యం పెట్టుకుని చదువులో ఉన్నత స్థాయిలో రాణించాలని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేస్తే కఠిన చట్టాలు అమలు అవుతాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ,లీగల్ అదికారి శివ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేట ర్ శివలీల వివరించారు. మంగళవారం మండల పరిధిలోని చాగాపురం ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ. జిల్లా బాలల పరిరక్షణ విభాగము ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలలు వేధింపులకు గురవుతున్నట్లు తెలిస్తే వెంటనే 122 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీ కి లేదా1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సామాజిక మాధ్యమాల వల్ల పిల్లలు చెడు అలవాట్లకు లోనయ్యే అవకాశం ఉంటుందని బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్ లను ఉపయిoగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎవీ మోహన్. ఉపాధ్యాయులు రాములు, హుసేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్ద చెరువు అలుగు ఆక్రమణపై స్థానికుల ఆందోళన

- మట్టి వేసి పూడ్చివేస్తున్న దుర్గా క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ విజయ్ కుమార్
- గతంలో అలుగుపైనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం..
- పట్టించుకోని అధికారులు
- రజకవాడ, చెన్నకేశవ నగర్ మునిగిపోయే ప్రమాదం ఉందంటూ ఆందోళన

**మక్తల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు అలుగు కబ్జాకు గురవుతోంది. చెరువుకు అత్యంత కీలకమైన అలుగు ప్రాంతాన్ని మట్టి వేసి పూడ్చివేస్తుండడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. దుర్గా క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ విజయ్ కుమార్ గతంలో పెద్ద చెరువు అలుగు మీదనే నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ప్రస్తుతం అద్దెలకు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అప్పట్లో అధికారులు స్పందించకపోవడంతో, ఇప్పుడు ఏకంగా అలుగు భాగాన్నే మట్టి వేసి చదును చేసే దుస్సాహసానికి ఒడిగట్టారని విమర్శలు వస్తున్నాయి. అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మునిగిపోనున్న లోతట్టు ప్రాంతాలు

చెరువు అలుగును ఇలా పూడ్చివేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర ముప్పు పొంచి ఉందని నిపుణులు, స్థానికులు హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువు నిండితే అలుగు ద్వారా మిగులు నీరు సాఫీగా వెళ్లడానికి వీలు లేకుండా పోతుంది. గతంలో వర్షాలు ఎక్కువైనప్పుడు మక్తల్‌లోని రజకవాడ, చెన్నకేశవ నగర్ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అలుగును మట్టితో పూడ్చివేస్తే, ఈసారి వర్షాలు పడితే ఈ రెండు కాలనీలు పూర్తిగా నీట మునిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

చెరువుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, ఇరిగేషన్



శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్యాక్రాంతం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి, పెద్ద చెరువు అలుగు ప్రాంతంలో వేసిన మట్టిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే అలుగును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని మక్తల్ పట్టణ ప్రజలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే ఆరోపణలన్నీ నిరాధారమైనవి



**జడ్చర్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేస్తున్న విమర్శలన్నీ పూర్తిగా నిరాధారమైనవని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే వ్యాఖ్యలు చేయడం సరికాదని, వాటిని ఆధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ గిరిజన నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ప్పటి నుంచి తగిన ఆధారాలు లేకుండా మాట్లాడటం అలవాటుగా మారిందని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జడ్చర్లలోని నల్లకుంట ఎఫ్‌టీఎల్ పరిధిపై సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే అసైన్డ్ భూముల అంశంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వం తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. రంగారెడ్డిగూడెంలోని భూముల వివరాలపై ఎమ్మెల్యే స్పష్టతనిస్తే మంచిదని హితవు పలికారు. గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన తండాలు బీఆర్ఎస్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని లక్ష్మారెడ్డి తెలిపారు. కేసీఆర్ గిరిజనుల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి తండాకు తాగునీరు అందించడంతో పాటు గిరిజన విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందించామన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అన్ని తండాల్లో కృతజ్ఞతా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ శంకర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పిట్టల మురళి, నాయకులు రఘుపతి రెడ్డి, ప్రనిల్ చందర్, రామ్మోహన్, బుక్క మహేష్, నందకిషోర్ గౌడ్, ఉమా శంకర్ గౌడ్, లత, కరాటే శ్రీను, శ్రీనివాస్ యాదవ్, పరమటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సఖి సెంటర్‌ను సందర్శిం చిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న సఖి (వన్ స్టాప్) సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్‌లోని షెల్టర్ గది, కౌన్సిలింగ్ గది, మీటింగ్ హాల్‌తో పాటు పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యుఓ) రాజేందర్ గౌడ్‌తో కలిసి సఖి సెంటర్ సిబ్బందితో మాట్లాడి కేంద్రం నిర్వహణ తీరును అడిగి తెలుసుకు న్నారు. సెంటర్‌లోని హాజరు రిజిస్టర్, వివిధ రికార్డులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీ లించారు. ఇప్పటివరకు సఖి సెంటర్ ద్వారా ఎంత మంది బాధితులకు సేవలు అందించారనే వివరాలతో పాటు, గత నెల రోజులుగా ఎంతమంది బాధితులు సెంటర్‌ను ఆశ్రయించారనే సమాచారాన్ని అడిగి తెలు సుకున్నారు. సెంటర్‌కు ఎక్కువగా ఎలాంటి కేసులు వస్తున్నాయని, బాల్య వివాహాలకు సంబంధించిన కేసులు ఎన్నినమోదయ్యాయని కలెక్టర్ ప్రశ్నించగా, వివాహాల సీజన్‌లో బాల్య వివాహా లకు సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తుంటాయని సెంటర్ బాధ్యురాలు క్రాంతి రేఖ వివరించారు. సఖి సెంటర్‌లో నమోదైన గృహ హింస, లైంగిక దాడులు, వరకట్న వేధింపులు,పోక్సో, అదృశ్యం, అపహరణ, మోసం, ప్రేమ వివాహాలు, ఆశ్రయం కల్పించిన కేసు లు, కౌన్సిలింగ్, వైద్య సేవ లు, ప్రస్తుతం విచారణలో ఉన్న కేసులకు సంబంధించి న వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బాధితులకు సఖి సెంటర్‌లోనే భోజనం అందించేలా కిచెన్ గదిని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలా గే సెంటర్ పై అంతస్తులో నిర్వహిస్తున్న షీ టీం విభాగాన్ని ఇతర అనువైన ప్రదే శానికి తరలించే అంశంపై డీ డబ్ల్యు ఓ తో చర్చించా రు. కోస్గి ప్రాంతం నుంచి వచ్చే బాధితులకు నారా యణపేట కంటే మహబూ బ్‌నగర్‌కు చేరుకోవడం సులభంగా ఉంటుందని పేర్కొన్న కలెక్టర్, మహబూ బ్‌నగర్ సఖి సెంటర్ నిర్వా హకులతో మాట్లాడి కోస్గి ప్రాంతానికి చెందిన బాధి తులకు అక్కడే అవసర మైన ఆశ్రయం, సేవలు అందించేలా చర్యలు తీసు కోవాలని డీ డబ్ల్యు ఓ కు సూచించారు. అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సిడబ్ల్యుసి సంబంధించిన కేసుల సంఖ్య, గత రెండు నెలల్లో నమోదైన కేసుల పూర్తి వివరాలను తనకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సఖి సెంటర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాధితులకు అవసరమైన సేవలు సత్వరమే అందేలా సఖి సెంటర్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు.

# మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వీడాలి



**బిజినేపల్లి, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షులు తుమ్మలఅల్లోజి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల మత్స్యకారుల సంఘం భవనంలో మత్స్యకారుల గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ. మంగనూరు గ్రామంలో గల కొత్త కుంట చెరువులోమత్స్యకారులను చేపలు పట్టకుండా సంబంధం లేని వ్యక్తులు పట్టపొలం మాది అనిమీరుచేపలు పట్టుకోకూడదనిమత్స్యకారులపై దాడికి పూనుకున్నారు అట్టి వ్యక్తులపైపోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన,జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త కుంట చెరువు యొక్క ఎఫ్ టి ఎల్ పరిధిలోని శిఖం భూమిని అక్రమంగా పట్టా చేసుకొని ఆక్రమించుకొని మత్స్యకారుల హక్కులను కాలరాస్తూ మా పట్టా పొలంలో మేమే చాపలు పట్టుకుంటామని వృత్తికి సంబంధం లేని వ్యక్తులు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడడం విడ్డూరంగా ఉందన్నారు. మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాన్ని సంబంధిత అధికారులు తహసిల్దార్ ఇరిగేషన్ అధికారులకు మరియు మత్స్యశాఖ జిల్లా అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలియచేసిన ఫలితం లేదన్నారు. ఇలాంటి ఘటనలు ఉన్నరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు. లేనిపక్షంలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామనిఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల మత్స్యపారు శ్రామిక సహకార సంఘం అధ్యక్షులు తుమ్మల అల్లోజి. గౌరవ అధ్యక్షులు బొందయ్య. యాదయ్య. బోలా కృష్ణయ్య. గూడ కాశన్న. కార్యదర్శి బంగారయ్య. శంకర్. ఇ. మల్లికార్జున్ చింతకాయల యాదయ్య అన్ని గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిరుతల దాడిలో రెండు ఆవులు మృతి

- చిరుతల భయంతో జక్కుతున్న..రైతులు
- ఏడాదిగా సంచారం..ఫిర్యాదులు బుట్టదాఖలా..?
- రైతుల్లో భయాందోళన..



**గండీడ్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** చిరుత దాడిలో రెండు ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని,చోటుచేసుకుంది. వివరలలోకి వెళితే..గండీడ్ మండల పరిధిలోని గ్రామానికి పెద్దవార్వాల్ చెందిన,శివ్వని బాలయ్య, సోమవారం సాయంత్రం పొలం వద్ద పశు వులను కట్టేసి ఇంటికి వెళ్లగా..రాత్రి అవి పెద్దగా అరుస్తున్న శబ్దాలు వినిపించడంతో గ్రామస్తులు సమాచారం అందించారు. పొలం వద్దకు వెళ్లి చూడగా రెండు ఆవులు మృతి చెంది కనిపించాయి. అటవీశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి. చిరుతల దాడిగానే నిర్ధారించారు. ఏడాదిగా ఇదే తంతు ఈప్రాంతంలో ఏడాదిగా చిరుతలు,సంచరిస్తున్నాయని, ఇప్పటికే,10-15 సార్లు పశువులపై దాడులు జరిగినా శాశ్వత చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిరుతల భయంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారని తెలిపారు. ఇకనైనా అటవీశాఖ అధికారులు నిఘా పెంచి,చిరుతల కదలికలను గుర్తించి రైతులు,పశువులకు రక్షణ కల్పించాలని కోరారు. చిరుతల దాడిలో మృతి చెందిన రెండు ఆవుల విలువ సుమారు రూ. 65వేలు ఉంటుందని బాధితుడు బాలయ్య తెలిపారు. పంచనామా నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలని కోరారు.

# వనపర్తిలో గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని నల్లచెరువు ట్యాంక్‌బండ్‌ను సందర్శించిన కలెక్టర్, గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో గణేష్ ఉత్సవాల కోసం ఎన్ని మండపాలకు అనుమతులు ఇచ్చారు, నిమజ్జనం కోసం నల్లచెరువు వద్దకు ఎన్ని విగ్రహాలు వచ్చే అవకాశం ఉందనే వివరాలను పోలీసు అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నల్లచెరువు ట్యాంక్‌బండ్ వద్ద సుమారు 300 గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందని పోలీసు అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం జరిగే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్యాంక్‌బండ్ వద్ద తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సూచనలు స్పష్టంగా అందేలా ప్రకటనల వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. భారీ గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం అవసరమైన క్రేన్లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శిక్షణ పొందిన ఈతగాళ్లను విధుల్లో ఉంచాలని, వారికి తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన ప్రదేశంలో ఎవరూ నీటిలోకి దిగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ట్యాంక్‌బండ్ వద్ద విద్యుత్ సరఫరా విషయంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన కార్యక్రమాల్లో విద్యుత్ తీగలు, లైటింగ్ తదితర ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిమజ్జన కార్యక్రమం వేగంగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, పోలీస్, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

### నూతన టౌన్ హాల్ ఈ నెల 25 నాటికి ప్రారంభించాలి

కలెక్టర్ పాత మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన టౌన్



హాల్‌ను పరిశీలించారు. త్వరలో ప్రారంభించనున్న టౌన్ హాల్‌లో మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టౌన్ హాల్‌కు సంబంధించిన మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, ఈ నెల 25వ తేదీలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్, వనపర్తి తాసిల్దార్ రమేష్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





# కదలని వెలిశాల-పెద్దంపల్లి రోడ్డు!

## రెండు ప్రభుత్వాలు.. రెండు శిలాఫలకాలు

- రూ.3.50 కోట్లకుపైగా ప్రతిపాదనలు..
- పనులు మాత్రం శిలాఫలకాలకే పరిమితం..
- వర్షాలతో బురదమయంగా మారిన రహదారి
- నరకయాతన పడుతున్న మూడు గ్రామాల ప్రజలు

**టేకుమట్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):**

*శిలాఫలకాలు వేశారు.. హామీలు ఇచ్చారు.. నిధులు మంజూరు చేశామని ప్రకటించారు.. కానీ రోడ్డు మాత్రం వేయలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. ఎమ్మెల్యేలు మారుతున్నా.. వెలిశాల-పెద్దంపల్లి-రాఘవాపూర్ రహదారి దుస్థితి మాత్రం మారడం లేదు. ఒకే రోడ్డుకు రెండు ప్రభుత్వాల హయాంలో రెండు శిలాఫలకాలు వెలిసినా, ప్రజలకు మాత్రం ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దీంతో "శిలాఫలకాలు వేయడానికేనా నిధులు.. రోడ్డు ఎప్పుడు వేస్తారు?" అంటూ వెలిశాల రామకృష్ణాపూర్ - పెద్దంపల్లి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.*

వెలిశాల నుంచి పెద్దంపల్లి మీదుగా రాఘవాపూర్ వరకు రహదారి నిర్మాణానికి సీఆర్ఆర్ 2018-19 కింద రూ.270 లక్షలతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. 2019 నవంబర్ 5న అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే శంకుస్థాపన జరిగినా పనులు ముందుకు సాగకపోవడంతో ఆ నిధులు, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇదే రహదారికి మరోసారి ప్రతిపాదనలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఆర్ఆర్ 2025-26 కింద వెలిశాల నుంచి రాఘవాపూర్ గుట్ట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొంటూ 2026 మే 1న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తుల్లో రోడ్డు సమస్యకు ఇకనైనా పరిష్కారం లభిస్తుందన్న ఆశలు చిగురించాయి. కానీ ఆ ఆశలు కూడా ఆవిరయ్యాయని వారు వాపోతున్నారు.



### రెండు శిలాఫలకాలు.. రెండు ప్రభుత్వాలు

ఒకే రహదారికి బీఆర్ఎస్ హయాంలో ఒక శిలాఫలకం.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో శిలాఫలకం.. కానీ రహదారి నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ఏళ్ల తరబడి రహదారి కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు శిలాఫలకాలే మిగిలాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైనట్లు చెబుతున్నా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

### వర్షం పడితే చాలు.. రహదారి బురదమయం

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. గుంతలు, బురదలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు సైతం బురదలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. రైతులు పొలాలకు వెళ్లేందుకు, విద్యార్థులు పాఠశాలలకు చేరేందుకు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు వెళ్లడం కూడా కష్టంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు.

### శిలాఫలకాలు కాదు.. రోడ్డు కావాలి

ఏ ప్రభుత్వం వచ్చినా తమ సమస్యను పట్టించుకోవడం లేదని వెలిశాల రామకిష్టాపూర్ వి పెద్దంపల్లి గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో, అభివృద్ధి పనుల ప్రారంభ సమయంలో కనిపించే హామీలు ఆ తర్వాత అమలుకు నోచుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు. శిలాఫలకాలతో ఫొటోలు దిగడం కాదని.. తమకు సురక్షితమైన రహదారి కావాలని మూడు గ్రామాల ప్రజలు రైతులు స్పష్టం చేస్తున్నారు.

# చీరలతో వినాయకుడు..!

- 5 వేల కొత్త చీరలతో భారీ వినాయక విగ్రహం
- 16 అడుగుల వెడల్పు.. 32 అడుగుల ఎత్తు
- సుమారు రూ.20 లక్షల వ్యయంతో రూపకల్పన
- వరంగల్‌లోనే కాదు.. తెలంగాణలోనే తొలిసారిగా వినూత్న ప్రయోగం



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :**
వినాయక చవితి వచ్చిందంటే చాలు వినూత్నమైనటువంటి ఆకర్షణీయమైన వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేయడం జరుగుతుంది. ఒక్కో సంవత్సరం ఒక్కో రకమైన ఆలోచన తో వినాయక విగ్రహాల నేలకొల్పి భక్తులను ఆకట్టుకునేలా చేయడం ఆయా వినాయక మండళ్లకు చెల్లుతుంది. వరంగల్ నగరంలోని శ్రీ సిద్ధి విఘ్నేశ్వర కమిటీ ఈసారి సరికొత్త ఆలోచనకు రూపమిచ్చింది. వేలాది కొత్త చీరలతో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులను ఆకట్టుకుంటోంది. సుమారు 5 వేల కొత్త చీరలను ఉపయోగించి రూపొందించిన ఈ విగ్రహం నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.
చీరలతో రూపొందించిన వినాయక విగ్రహం సుమారు 16 అడుగుల వెడల్పు, 32 అడుగుల ఎత్తు కలిగి ఉంది. విగ్రహం తయారీకి దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చయినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక నైపుణ్యంతో చీరలను అమర్చి విగ్రహానికి రూపాన్ని తీసుకురావడం విశేషం. విగ్రహం రూపకల్పన కోసం సుమారు నాలుగు రోజుల పాటు కళాకారులు, కమిటీ సభ్యులు రాత్రింబవళ్లు శ్రమించారు. ఒక్కో చీరను ప్రత్యేకంగా అమర్చుతూ విగ్రహానికి తుది రూపం తీసుకొచ్చారు. కొత్త చీరలతో ఇంత భారీ స్థాయిలో వినాయక విగ్రహాన్ని రూపొందించడం వరంగల్‌లోనే కాకుండా తెలంగాణలోనే తొలిసారిగా చేపట్టిన వినూత్న ప్రయత్నంగా కమిటీ పేర్కొంది. శ్రీ సిద్ధి విఘ్నేశ్వర కమిటీ ప్రతి సంవత్సరం వినాయకుడిని ఒక్కో ప్రత్యేక రూపంలో రూపొందిస్తూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఈసారి చీరలతో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తమ ప్రత్యేకతను చాటుకుంది. వరంగల్ జేపీఎన్ రోడ్డులోని వైభవలక్ష్మి షాపింగ్ మాల్ ఎదురుగా ఈ భారీ చీరల వినాయకుడిని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని చూసేందుకు భక్తులు, నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వినాయకుడి ప్రత్యేక అలంకరణ, భారీ ఆకృతి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# ధర్మాపూర్ తాగునీటి సమస్యపై కలెక్టర్ పరిశీలన

### నీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

**కొడంగల్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గంలోని ధర్మపూర్ గ్రామంలో తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.గ్రామ సమీపంలోని చెరువుకుంటలో ఉన్న బోర్‌ను వినియోగించి గ్రామానికి తాగునీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఈఈ రవికుమార్‌తో పాటు సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ జయసుధ, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో ఉషశ్రీ, సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మి నాగప్ప, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి సాగు

- ఇద్దరు నిందితుల అరెస్ట్.. 1245 గంజాయి మొక్కలు,11 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం
- గంజాయిసాగు,రవాణా,నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నితికా పంత్ హెచ్చరికా
- స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారుగా ఒక కోటి,50 లక్షలు గా అంచనా



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15(జనంసాక్షి ):**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్పీ ఆదేశాల మేరకు, విశ్వసనీయ సమాచారం ప్రకారం గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ పత్రిక ప్రకటనలో తెలియపరచారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1,245 గంజాయి మొక్కలు మరియు 11 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డి.ఎస్.పి అశోక్ ఆధ్వర్యంలో సిఐ రమేష్,ఎస్ఐ రవి తనిఖీలు చేపట్టారు. తేదీ:13.09.2026న జైనూర్ ఎస్ఐ జి. రవికుమార్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పట్నాపూర్ మెయిన్ రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన అంబురే పుండలిక్, తండ్రి :సీతారాం, వయస్సు 50 సంవత్సరాలును తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న టవల్‌లో దాచిన 11 గ్రాముల ఎండు గంజాయి గుర్తించారు. ప్రభుత్వ పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో అంబురె పుండలిక్ తన కుమారుడుతో ,కలిసి తమ వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం లభించింది. దీంతో పోలీసులు వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఈఓ), ప్రభుత్వ పంచ సాక్షుల సమక్షంలో వ్యవసాయ భూమిని తనిఖీ చేయగా,అక్కడ పెద్ద సంఖ్యలో గంజాయి మొక్కలు గుర్తించారు. మొత్తం 1,245 గంజాయి మొక్కలను వేర్లతో సహా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ. ఒక కోటి 50లక్షలుగా అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితుల వివరాలు 1. అంబురే పుండలిక్ 2. అంబురే రమేష్‌లను 14.09.2026న అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు,రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి సాగు చేసే వారిపై నిఘా వేసి, అప్రమత్తంగా ఉండి అదుపులోకి తీసుకున్నందుకు జైనూర్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి.ఎస్పి. అశోక్, జైనూర్ సిఐ రమేష్, ఎస్ఐ రవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బులిస్తేనే లిస్టులో పేరు



## ఇందిరమ్మ కమిటీలకు తగ్గిన ప్రాధాన్యత

- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఇష్టారాజ్యం

**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్15 (జనంసాక్షి) :**
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తిగా వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వం గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకే ఇళ్లు ఇవ్వాలని స్పష్టంగా చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పార్టీ నాయకుల ఇష్టారాజ్యం నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### పేరుకే ఇందిరమ్మ కమిటీలు

నిబంధనల ప్రకారం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ, గ్రామసభలో అర్హులను గుర్తించాలి. కానీ వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కమిటీకి తెలియకుండానే కొందరు అధికార పార్టీ నాయకులు తమ ఇళ్లలో కూర్చుని లిస్టులు రెడీ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కమిటీ సభ్యులకు కూడా ఎవరిని ఎంపిక చేశారో తెలియని పరిస్థితి. గ్రామాల్లో పేరుకే ఇందిరమ్మ కమిటీలని, పెత్తనమంతా కాంగ్రెస్ నాయకులదేననే ఆరోపణలు ఉన్నాయి.

### డబ్బులిస్తేనే లిస్టులో పేరు

మండలంలో అత్యంత వివాదాస్పదమైన అంశం ఇదే. రూ.20 వేల నుంచి రూ.50 వేలు ఇస్తేనే శాంక్షన్ లిస్టులో పేరు రాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అడిగేవారే లేకపోవటంతో మొదటి దఫా మాదిరిగానే మధ్యవర్తులు, నాయకులు మళ్ళీ వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు బహిరంగంగానే చెబుతున్నారు. డబ్బులు ఇవ్వలేని పేదలు లిస్టు నుంచి గల్లంతవుతున్నారు. రేకుల షెడ్డు, పెంకుటిళ్లు ఉన్నప్పటికీ ఆధార్ తో ఫోటో తీసే సమయంలో ఇతరత్రా కారణాలతో అర్హులను అనర్హులుగా చేయటంతో పాటు, తమ వారికి మాత్రం అన్ని అర్హతలు ఉన్నట్లు చూపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### రాజకీయ అంశంతోనే ఎడతెగని జాప్యం

నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్ల సంఖ్య ఆధారంగా అధికారులు మండలాల వారీగా విభజించారు. ములుగు నియోజకవర్గంలోని వెంకటాపూర్ మండలంలో అధికారులు రెడీ చేసిన జాబితాకు, స్థానిక కాంగ్రెస్ నేతలు రెడీ చేసిన జాబితాకు మధ్య తేడా ఉండటంతోనే ఎంపిక ఆలస్యమవుతోందని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో గెజిటెడ్ అధికారుల విచారణ పూర్తయినా, ఫైనల్ లిస్టు మాత్రం గ్రామ స్థాయిలో కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లోనే నలుగుతోంది.

### ఇళ్ల కోసం అర్హుల ఎదురుచూపులు

ఎంపికైన వారు కూడా మూడు నెలలుగా ఇల్లు ఎప్పుడు మంజూరవుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అధికారులు రెండు, మూడు సార్లు సర్వేలు చేసినా ఫలితం లేకపోవడంతో లబ్ధిదారుల్లో అసహనం పెరుగుతోంది. సెప్టెంబర్ 15వ తేదీ లోగా ఎంపిక పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయని, రెండు, మూడు రోజుల తేడాతో పారదర్శకంగా గ్రామసభలోనే లిస్టు ప్రకటిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ గ్రామాల్లో మాత్రం లబ్ధిదారుల లిస్టులు ముందుగానే ఫిక్స్ అయిపోయాయనే చర్చే జరుగుతోంది.ఏదేమైనప్పటికీ వెంకటాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికను పారదర్శకంగా గ్రామసభలోనే ప్రకటించాలని, డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు ఇందిరమ్మ కమిటీని కాదని రెడీ చేసిన లిస్టులను రద్దు చేయాలని అర్హులైన పేదలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎగువ ప్రాంతాల నీటితో పొంగిపొర్లుతున్న కోలుకొండ

### చిన్నమడూరు చెక్‌డ్యాం.. రైతుల్లో ఆనందం



**దేవరుప్పుల, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):**
దేవరుప్పుల మండలంలోని కోలుకొండ, చిన్నమడూరు గ్రామాల పరిధిలోని వాగులో ఉన్న చెక్‌డ్యాం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో పూర్తిగా నిండిపోయి మత్తడి పోస్తోంది. స్థానికంగా పెద్దగా వర్షాలు కురవకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు వాగులోకి చేరడంతో చెక్‌డ్యాం జలకళను సంతరించుకుంది.చెక్‌డ్యాం నిండిపోవడం తో వాగులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో కోలుకొండ, చిన్నమడూరు గ్రామాల ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని, బోర్లు, బావుల్లో నీటిమట్టాలు మెరుగుపడి పంటలకు సాగునీటి భరోసా లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.వాగులో నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. చెక్‌డ్యాం మత్తడి పోస్తున్న దృశ్యాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో చెక్‌డ్యాం నిండిపోవడంతో కోలుకొండ, చిన్నమడూరు గ్రామాల్లో ఆనంద వాతావరణం నెలకొంది.

# గ్రోమోర్ కేంద్రంలో నకిలీ పొటాష్ విక్రయం

- మూడు బస్తాలు కొనుగోలు చేసిన రైతుకు మట్టి కలిసిన బస్తాలు
- ఇప్పటికే 150 బస్తాల వరకు విక్రయించినట్లు ఆరోపణలు
- ల్యాబ్ పరీక్షల అనంతరం చర్యలు: ఏఓ





**నల్లబెల్లి, (జనంసాక్షి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌లో కోరమండల్ పొటాష్ పేరుతో మట్టి కలిసిన ఎరువును విక్రయించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొండాయిల్‌పల్లెకు చెందిన రైతు కొనకటి రాజు మూడు బస్తాలను రూ.2,200 చొప్పున రూ.6,600కు కొనుగోలు చేశారు. పంటకు వేయడానికి ఓ బస్తాను తెరవగా అందులో అధికంగా మట్టి, తక్కువగా రసాయన పదార్థం కనిపించడంతో నిర్వాహకులకు తిరిగి అప్పగించారు. మిగిలిన రెండు బస్తాలతో పాటు గోదాములోని మరో బస్తాను పరిశీలించగా వాటిలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు రైతు తెలిపారు. ఇటీవల గ్రోమోర్ గోదాముకు కోరమండల్ పొటాష్ పేరుతో 294 బస్తాలు రాగా, యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులకు సుమారు 150 బస్తాలు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇప్పటికే కొనుగోలు చేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై ఏఓ బన్న రజిత మాట్లాడుతూ అనుమానిత బస్తాలను ప్రయోగశాల పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి, ఎరువు నకిలీదని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# కౌకూర్‌లో వరద కష్టాలకు చెక్

### రూ.9.18 కోట్లతో డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం

**అల్వాల్, సెప్టెంబరు 15 (జనంసాక్షి):**
ఏళ్లుగా కౌకూర్ ప్రజలను వేధిస్తున్న వరద, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపేలా రూ.9.18 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నట్లు మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కింది బస్తీలో ప్రారంభం కానున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. కింది బస్తీ బాక్స్ డ్రైన్‌కు రూ.2.50 కోట్లు, ప్రియదర్శిని ఎన్‌క్లేవ్ నాలా నుంచి వెన్‌రాగ్ వరకు రూ.4.30 కోట్లు, వెన్‌రాగ్ ఎన్‌క్లేవ్ నుంచి ఓం శ్రీ గ్రాండ్ వరకు రూ.2.38 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మల్లికార్జున్ తెలిపారు. గత ఏడాది స్థానికులతో కలిసి సమస్యలను మైనంపల్లి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన అధికారులతో మాట్లాడి పనులకు సహకరించారని చెప్పారు. విల్లా ఆర్కిడ్స్, జనప్రియ, ప్రశాంత్ విహార్ కాలనీల్లో రూ.20 కోట్లకుపైగా విలువైన డ్రైనేజీ పనులు బడ్జెట్ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు.
అనంతరం మైనంపల్లి కౌకూర్ మోడల్ మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌ను ప్రజా ప్రయోజనాల కోసం కాపాడేందుకు సహకరించినందుకు స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జితేంద్రనాథ్, తోట లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రెండు పంటలకు సాగు నీరు అందించడమే ఏకైక లక్ష్యం

**స్టేషన్ ఘన్‌పూర్,సెప్టెంబర్ 15 (జనం సాక్షి):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్న దని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద ప్రజలకు అండగా నిలుస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపా రు. చిల్పూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయి లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు.అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8లక్షల కోట్ల కు వాయిదాలు, మిత్తిలు చెల్లిస్తూ కూడా పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలి పారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 2సంవత్సరాల కాలంలో ప్రవేశ పెట్టిన ప్రతీ పథకాలద్వారా రాష్ట్రంలోని ప్రతీ కుటుంబాని కి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్ల డించారు. చిల్పూర్ మండల కేంద్రంలో అతి త్వరలోనే మండలకార్యాలయాల నిర్మాణాని కి శంకుస్థాపన తో పాటు శ్రీబుగులు వెంకటేశ్వ రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్న ట్లు తెలిపారు. మల్లన్న గండి రిజర్వాయర్ ద్వారా చిల్పూర్ మండలంలోని అన్ని గ్రామాలకు గోదావరిజలాలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. నియోజ కవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే నా ఏకైక లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, కాంగ్రె స్ పార్టీ మండల అధ్యక్షుడు చిర్ర నాగరాజు, జనగామ జిల్లా దిశా కమిటీ సభ్యుడు కొర్ర వెంకటేష్ నాయక్, నాయకులు గడ్డమీది సురేష్,తాళ్లపెల్లి సమ్మయ్య, పోలేపల్లి రంజిత్ రెడ్డి, మల్లారెడ్డి, రంగు రమేష్,గుగులోత్ ఉమ్లా నాయక్, ఎన్నకూస కుమార్, కిమాని, రవీందర్, శ్రీనివాస్, రూప్లా నాయక్, రత్నాకర్ రెడ్డి, గణగోని రమేష్, తౌటి సునీల్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# 50 లక్షలు ఇవ్వండి.. భూసేకరణ ఆపండి

- డిండి ఎత్తిపోతల పథకంపై రైతుల ఆగ్రహం.. చింతపల్లిలో భారీ రాస్తారోకో



**చింతపల్లి, సెప్టెంబర్ 15(జనంసాక్షి) :**
డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై పెద్ద సంఖ్యలో రైతులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రాజెక్టు కోసం తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోతు న్నామని, సరైన పరిహారం అందించకుండా భూసేకరణ చేపట్టడం అన్యాయ మని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమే తమ జీవనాధారమని, ప్రస్తుత భూముల విలువలకు అనుగుణంగా ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన పరిహారం ఇవ్వలేని పక్షంలో భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.అనంతరం ఇరిగేషన్ ప్రాజెక్టు డీఈతో పాటు చింతపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగి స్తామని, భూసేకరణను ముందుకు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. రైతుల రాస్తారోకోతో రాష్ట్ర రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నట్వ గిరిధర్, ఎల్లంకి అశోక్, కొలుకులపల్లి కొండల్, ఆకుల శ్రీనివాస్, బి. రాములు, వెంకట్‌రెడ్డి అనిల్, భాస్కర్, వీరయ్య, లింగం, అశోక్ పాల్గొన్నారు.

# అడవి సిరికి ఆన్‌లైన్ రెక్కలు..!

- 'భద్రగిరి' బ్రాండ్‌తో గిరిజన ఉత్పత్తులకు దేశవ్యాప్త మార్కెట్
- పర్యాటక రంగంతో అనుసంధానం.. ఇక ఇంటికే ఆర్గానిక్, అటవీ ఉత్పత్తులు

**భద్రాచలం, సెప్టెంబరు 15 (జనంసాక్షి) :** అడవిలో పండిన ఉత్పత్తులు.. గిరిజనుల చేతుల్లో రూపుదిద్దుకున్న సంప్రదాయ వస్తువులు.. ఇక భద్రాచలం దాటి దేశవ్యాప్తంగా వినియోగదారుల ఇళ్లకు చేరనున్నాయి. గిరిజనుల శ్రమకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించే లక్ష్యంతో భద్రాచలంలోని భద్రగిరి మార్ట్ మరో ముందడుగు వేసింది. పర్యాటక రంగంతో అనుసంధానించిన ఈ మార్ట్ నుంచి గిరిజనుల ఆర్గానిక్, అటవీ, సంప్రదాయ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా వినియోగదారులకు అందించే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

### అడవి ఉత్పత్తులకు 'భద్రగిరి' బ్రాండ్

రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌ను ఈ ఏడాది మార్చి 27న శ్రీరామనవమి సందర్భంగా గవర్నర్ ప్రారంభించారు. భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులకు ఏజెన్సీ ప్రాంతాల గిరిజన ఉత్పత్తులను పరిచయం చేయాలనే ఉద్దేశంతో వివిధ రకాల ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీలు, టీ పొడి, కరక్కాయలు, కరక్కాయ పొడి, తేనె, సబ్బులు, షాంపూలు, కుంకుడుకాయలు, అటవీ ఫలాలు, సేంద్రియ తృణధాన్యాలు, పప్పులు, బియ్యం తదితర ఉత్పత్తులు మార్ట్‌లో అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ




లభిస్తోంది.

### మధ్యవర్తులకు చెక్.. ఉత్పత్తిదారులకు మేలు

ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజన మహిళలు, రైతులు నేరుగా తమ ఉత్పత్తులను భద్రగిరి మార్ట్‌కు సరఫరా చేస్తున్నారు. తద్వారా మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి ఉత్పత్తిదారులకే మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపడుతున్నారు. భద్రగిరి మార్ట్ ద్వారా సుమారు 100 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూరుతుండగా, మరో 10 కుటుంబాలకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆర్గానిక్, అటవీ, సంప్రదాయ గిరిజన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

### సంతల వాతావరణంలో.. గిరి ఉత్పత్తుల సందడి

ఏజెన్సీ ప్రాంతాల్లో కనిపించే వారపు గిరిజన సంతల వాతావరణాన్ని భద్రగిరి మార్ట్‌లో పునఃసృష్టించి, పర్యాటకులకు గిరిజన జీవన విధానం, సంప్రదాయ ఉత్పత్తులను పరిచయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పీవో పేర్కొన్నారు.

ఇక భద్రాచలం రావాల్సిన పనిలేదు!

పర్యాటక రంగంతో భద్రగిరి మార్ట్‌ను అనుసంధానించడంతో పాటు ఆన్‌లైన్ విక్రయాలకు శ్రీకారం చుట్టడం ద్వారా గిరిజన ఉత్పత్తులకు మరింత విస్తృత మార్కెట్ లభించనుంది. భద్రాచలం పర్యటనలో భాగంగా మార్ట్‌ను సందర్శించిన వారు నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు, ఇకపై ఆన్‌లైన్ ద్వారా తమ ఇళ్ల నుంచే ఆర్డర్ చేసుకునే అవకాశం కలగనుంది. ఐటీడీఏ పీవో బి.రాహుల్ చేపట్టిన ఈ చర్యపై పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

### నాణ్యత బాగుంది.. ఇంటికే వస్తే మరింత సౌకర్యం

హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ.. శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి భద్రాచలం వచ్చిన సందర్భంగా భద్రగిరి మార్ట్‌ను సందర్శించి గిరిజనుల ఆర్గానిక్, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇక్కడ లభిస్తున్న ఉత్పత్తులు నాణ్యంగా ఉన్నాయని, ఆన్‌లైన్ సౌకర్యం కల్పించడం వల్ల భవిష్యత్తులో దూరం నుంచి భద్రాచలం రావాల్సిన అవసరం లేకుండానే తమకు కావాల్సిన ఉత్పత్తులను ఇంటికే తెప్పించుకోవచ్చని పేర్కొన్నారు. సత్తుపల్లికి చెందిన వసుంధర మాట్లాడుతూ.. విహారయాత్రలో భాగంగా భద్రాచలం వచ్చి భద్రగిరి మార్ట్‌ను సందర్శించినట్లు తెలిపారు. మార్ట్‌లో లభించే ఆర్గానిక్ ఉత్పత్తులు నాణ్యంగా, మన్నికగా ఉన్నాయని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఆన్‌లైన్ ద్వారా ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం మంచి సౌకర్యమని అభిప్రాయపడ్డారు.

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

- 7 తులాల బంగారం స్వాధీనం



మల్కాజిగిరి, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) : నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 7 తులాల బంగారు ఆభరణాలు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.ఈ నెల 12న నేరెడ్‌మెట్ శివ నగర్ లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు ను దుండగులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం నేరెడ్‌మెట్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ ఆర్య (19) మహమ్మద్ సోను (30) ఆసిమ్ (20)లను అదుపులోకి తీసుకుని విచారించారు.ఎల్బీనగర్‌లో ఉంటూ ఎంబ్రాయిడరీ పని నేర్చుకుంటున్న వీరు, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన నేరెడ్ మెట్ పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## మత సామరస్యాన్ని చాటుకున్న ముస్లిం యువకుడు

- వినాయకుడికి లడ్డు ప్రసాదం బహుకరణ



**కేశంపేట, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో బజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మొహమ్మద్ జావిద్ వినాయకుడికి లడ్డూను బహుకరించాడు. ఆరు కిలోల లడ్డును తయారు చేయించి యూత్ సభ్యులకు అందజేసి మత సామరస్యాన్ని చాటుకున్నాడు. జావిద్ ను యూత్ సభ్యులతో పాటు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ యూత్ అధ్యక్షులు కల్వకోలు మచ్చేందర్ గౌడ్, జి. శ్రీకాంత్, డి.మహేష్, కే. నరేష్ ,బి. సురేష్, జి. సాయి, యం. రాజలింగం, డి. మహేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

- జంపర్ కలిపేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం



చందంపేట, సెప్టెంబర్ 14 (జనం సాక్షి) : చందంపేట మండలంలోని బుడ్డోనితండాలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై రైతు నేనావత్ దస్రు (35) మృతిచెందాడు. చందంపేట ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దస్రు తన పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ జంపర్‌ను కలిపేందుకు ప్రయత్నిస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకొని. మృతుడి భార్య నేనావత్ విమ్లా (30) ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందంపేట ఎస్సై లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్యతో పాటు నలుగురు సంతానం ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గురుకుల టెండర్లలో ఏం జరుగుతోంది..?

- నాలుగు నెలల జాప్యం.. బైలా ప్రకారమేనా? ఇష్టానుసారమా?
- టెండర్ల చైర్మన్ జాయింట్ కలెక్టర్ సమాధానం చెప్పాలి.. కలెక్టర్ జోక్యం తప్పనిసరి

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల టెండర్ల వ్యవహారం నాలుగు నెలలుగా సాగుతున్నా కొలిక్కి రాకపోవడంపై కాంట్రాక్టర్లలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత టెండర్లు లేవని చెప్పి.. అనంతరం నోటిఫికేషన్ జారీ చేసి.. ఆ తర్వాత జరిగిన తప్పులపై విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్ల చైర్మన్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ బైలా ప్రకారమే వ్యవహరిస్తున్నారా? లేక ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారా? అని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

అనుభవజ్ఞులైన సరఫరాదారులను పక్కనపెట్టి కొత్తవారికి అవకాశం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో పాటు, టెండర్లు అధిక ధరలకు ఖరారైతే ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టెండర్ ప్రక్రియలో పారదర్శకత లేకపోతే గురుకుల విద్యార్థులకు అందే నిత్యావసరాలు, కూరగాయలు, మాంసాహార పదార్థాల ధరలు,




నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. నాలుగు నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారానికి ఇక తెరపడాల్సిన సమయం ఆసన్నమైందని కాంట్రాక్టర్లు అంటున్నారు. టెండర్ నిబంధనలు, బైలా, అర్హతలు, ధరల నిర్ణయం, విచారణలోని అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సమీక్షించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిధుల పరిరక్షణ, విద్యార్థుల ఆహార నాణ్యత, అర్హులైన కాంట్రాక్టర్లకు సమాన అవకాశం ఈ మూడు అంశాల్లో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలి. నాలుగు నెలల జాప్యానికి బాధ్యులెవరు? టెండర్లు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## గణేష్ మండపంలో పూజారి మృతి

- పూజల విషయంలో వివాదం..
- అనంతరం అస్వస్థతతో మృతి



తిరుమలగిరి (సాగర్) , సెప్టెంబర్ 15 (జనంసాక్షి) : నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన పూజారి ఉప్పల దత్తు ప్రసాద్ (పూజారి) మృతి చెందిన ఘటన చింతలపాలెం గ్రామంలో జరిగింది. పోలీసుల, గ్రామస్తుల వివరాల ప్రకారం సోమవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో చింతలపాలెం గ్రామంలోని రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో దత్తు ప్రసాద్ పూజలు నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన గుండాల రవి, గుండాల పున్నయ్యలు తమ మండపంలో ముందుగా పూజలు నిర్వహించాలని కోరుతూ ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో వారు దత్తు ప్రసాద్‌పై చేతులు వేస్తూ గొడవకు దిగినట్లు సమాచారం.అనంతరం గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని పూజారి దత్తు ప్రసాద్‌కు నచ్చజెప్పి గుండాల రవి గణేష్ మండపం వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం దత్తు ప్రసాద్ అకస్మాత్తుగా స్పృహ తప్పి కిందపడిపోయారు. వెంటనే ఆయనను నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు.మృతుడి కుమారుడు ఉప్పల శ్రీ వల్లభ రాఘవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దత్తు ప్రసాద్ మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 17 (జనం సాక్షి) : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలను వ్యభిచారంలోకి దింపి ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం, చిరుమర్రి గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల బాలకృష్ణ, 30సం,,ఆర్థిక లాభాల కోసం జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ,మహిళలను వ్యభిచారంలోకి తీసుకువచ్చే అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు బాలకృష్ణపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో, అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిలోని గది ని పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జిలో గది పొందేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. కాకినాడకు చెందిన మహిళను ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వ్యభిచారంలోకి తీసుకువచ్చినట్లు, ఖమ్మంకు తరలించి లాడ్జి గదిలో ఉంచి, కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడి నేర ప్రవర్తనను నిరోధించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం, 1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు.

## కోయ-గోండి భాషకు ప్రామాణికత దిశగా కీలక అడుగు

- అక్టోబర్ 2 నుంచి భద్రాచలంలో జాతీయ స్థాయి డిక్షనరీ వర్క్‌షాప్
- 8 రాష్ట్రాల నుంచి 120 మంది ప్రతినిధుల హాజరు



**భద్రాచలం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** కోయ-గోండి భాషకు ప్రామాణికత కల్పించడంతో పాటు, సమగ్ర డిక్షనరీ రూపకల్పన దిశగా జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు భద్రాచలం వేదిక కానుంది. అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజుల పాటు 12వ జాతీయ గోండి - కోయ భాషా ప్రామాణీకరణ, డిక్షనరీ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం రాత్రి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తన చాంబర్‌లో ఆదివాసీ ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోయ--గోండి భాష పరిరక్షణ, ప్రామాణీకరణ, డిక్షనరీ రూపకల్పనకు ఈ వర్క్‌షాప్ కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఐటీడీఏ ఆతిథ్య సహకారంతో, జాతీయ గోండి--కోయ భాషా ప్రామాణీకరణ, డిక్షనరీ మరియు రికగ్నైజేషన్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది కోయ--గోండి భాషా ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. భాషా పరిరక్షణకు సంబంధించిన ఈ జాతీయ స్థాయి కార్యక్రమానికి ప్రముఖులతో పాటు సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ సాధ్యమైనంత విస్తృతంగా ఆహ్వానించాలని పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో కోండ్రు వీరాస్వామి, సీనియర్ కోయ భాషా రిసోర్స్ పర్సన్ పాయం వెంకటరత్నం, కారం దారయ్య, ఇర్ప రాధాకృష్ణమూర్తి, కాక రాజు, కణితి రామకృష్ణ, వీసాల శ్రీలక్ష్మి, మడివి గురుత్వ, మడివి సూక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ కార్యాలయం ముందు రైతుల నిరసన

**బుక్ చేసుకున్నా యూరియా దొరక్క ఆగ్రహించిన రైతులు**
**ఫేక్ బుకింగ్ అంటున్న సొసైటీ అధికారులు**
**గందరగోళంగా యూరియా యాప్ బుకింగ్**



**పెనుబల్లి, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** యాప్‌లో యూరియా బుకింగ్ ప్రహసనంగా మారింది. బుక్ చేసుకున్న రైతులకు పెనుబల్లి సొసైటీ కార్యాలయంలో యూరియా కట్టలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం కార్యాలయం ముందు నిరసనకు దిగారు.మా పాస్ బుక్ మీద బుక్ అయిన యూరియా ఎందుకు ఇవ్వరు, స్టాక్ ఎక్కడికి పోతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. స్టాక్ అయిపోయిందని, ఫేక్ బుకింగ్ అవుతున్నాయని రైతులకు సొసైటీ సిబ్బంది సమాధానం చెప్పడంతో రైతులు అవాక్కవుతున్నారు. సొసైటీ సిబ్బంది రైతులకు సమాధానం చెప్పలేక కార్యాలం మూసి వెళ్లిపోయారు. రైతులు వ్యవసాయ అధికారి సొసైటీ కార్యాలయం ముందుకు వచ్చి యూరియా కట్టలు ఎందుకు ఇవ్వరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ముందు అలానే బైఠాయించారు. డబుల్ స్టాక్ చూపిస్తుందని సొసైటీ కార్యాలయం సిబ్బంది సమాధానం ఇస్తున్నా రైతులు శాంతించలేదు. యాప్ ద్వారా కూడా అవకతవకలు జరుగుతున్నాయని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 15 (జనం సాక్షి) :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఆవశ్యకతపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఈనెల 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు 'మన అంగన్వాడి మన బాధ్యత' నినాదంతో నిర్వహిస్తున్న తొమ్మిదవ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల నిర్వహణపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాల ఆవశ్యకత, అంగన్వాడి చిన్నారులు బాలామృతం సద్వినియోగం చేసుకోవడంపై, ఇతర పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఎత్తుకు తగ్గ బరువు లేని



చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇలాంటి పిల్లలకు చైల్డ్ డెవలప్మెంట్ కార్డులను ఇచ్చి వారి వివరాలను అందులో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైతే హైదరాబాదులోనూ పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందేలా చూడాలన్నారు. బరువు తక్కువ ఉండే చిన్నారులకు ప్రత్యేక ఆహార కిట్లను అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అంగన్వాడి కేంద్రాల వద్ద పోషన్ వాటికలను ఏర్పాటు చేసి వివిధ కూరగాయలు, ఆకుకూరల పెంపకాన్ని చేపట్టాలని తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి జిల్లాలోని హై స్కూల్, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లోని సుమారు 40,000 మంది విద్యార్థులకు హెల్త్ కార్డులను అందజేసి, వివిధ పరీక్షలను నిర్వహించి, వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పోషన్ మాసంకు సంబంధించిన గోడపత్రికలను, 'బలమైన బాల్యానికి వెయ్యి మెట్లు' పేరుతో ముద్రించిన బుక్లెట్స్ ను, ఎస్ఎస్ఎఫ్ పీ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, డిపిఓ శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# ఉదయం 6 గంటలకు లేఆఫ్ మెయిల్స్..!

## ఒరాకిల్‌లో ఆగని కోతలు..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్‌లో మరో రౌండ్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. లేఆఫ్ జాబితాలో ఉన్న సిబ్బందికి ఉదయం ఆరు గంటల నుంచే లేఆఫ్ మెయిల్స్ రావడం ప్రారంభమైంది. కంపెనీ పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా ఈ ఉద్యోగాలు తొలగిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఏఐ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో టెక్ కంపెనీలన్నీ సిబ్బందిని భారీగా తగ్గించుకుంటున్నాయి. సోమవారం నుంచి కొత్తదఫా కోతలు ప్రారంభమయ్యాయని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. తమ ఉద్యోగాల కోతల గురించి పలువురు లింక్డిన్, రెడిట్‌లో పోస్టులు పెడుతున్నారు. అయితే ఎంతమందిని తొలగించారన్న దానిపై ఒరాకిల్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. కృత్రిమ మేధ, క్లౌడ్ సర్వీస్‌కు పెరుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా సంస్థ డేటా సెంటర్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో మూలధన వ్యయం కింద ఒరాకిల్ 28.5 బిలియన్ డాలర్లు వెచ్చించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కేటాయించిన మొత్తం 8.5 బిలియన్ డాలర్లు. అంటే మూడు రెట్లు ఎక్కువ. పూర్తి ఏడాదికి అంచనా వ్యయాన్ని 90 బిలియన్ డాలర్ల నుంచి 95 బిలియన్ డాలర్లుగా పెట్టుకుంది. అదే సమయంలో ఒరాకిల్ (రాతీజీఇశ్రీవ) ఏఐ వ్యాపారానికి డిమాండ్ కనిపిస్తోంది. ఈ త్రైమాసికంలో అదనంగా 30 బిలియన్ డాలర్ల ఏఐ క్లౌడ్ కాంట్రాక్టులపై సంతకాలు చేసినట్లు సంస్థ వెల్లడించింది. అయినా డేటా సెంటర్లపై వ్యయం పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలకు కోతలు పెడుతోంది. "పూర్తి పరిశీలన అనంతరం ఒరాకిల్ ప్రస్తుత వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా మీ రోల్‌ను తొలగించాలని నిర్ణయించుకున్నాం. ఈ సంస్థలో ఇదే మీకు చివరిరోజు. ఇంతకాలం మీరు అందించిన సహకారానికి కృతజ్ఞతలు" అని సంస్థ లేఆఫ్ మెయిల్‌లో రాసుకొచ్చింది. ఈ ఏడాదిలో ఇప్పటికే దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులను తొలగించింది.

# కొనసాగిన చమురు మంటలు

## 107 డాలర్లు దాటిన ధర భారీగా పతనమైన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఓ వైపు పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా చమురు ధరలు పెరగడం, మరోవైపు అమెరికా బాండ్ రాబడులు పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా మెటల్, రియాల్టీ, కెమికల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 777 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 279 పాయింట్లు క్షీణించింది. ఉదయం సెన్సెక్స్ 75,369.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,781.76) లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 1400 పాయింట్ల వరకు పతనమైంది. చివరికి 777.94 పాయింట్ల నష్టంతో 74,003.82 వద్ద ముగిసింది. నిఫ్టీ 279.50 పాయింట్లు కోల్పోయి 23,118.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.96గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, ఇండిగో, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యునిలీవర్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 107.40 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,273.11 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




**కారణాలివీ..**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. హుతీల దాడులతో హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ (పెట్రో లైన్)ను సౌదీ అరేబియా మూసివేసింది. దీంతో చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనే ఆందోళనలతో ముడి చమురు ధరలు భారీగా పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ బాండ్లపై భారీగా పెరిగాయి. 2023 నుంచి తొలిసారి 5 శాతం మార్కును దాటాయి. యూఎస్ బాండ్ రాబడులు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్లపై ఒత్తిడి పడింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయిలోనే ఉంచుతుందనే అంచనాలు మార్కెట్లను పడేశాయి.




# టాటా కెమికల్స్ ఏకంగా 20% జంప్

**దిల్లీ:** టాటా గ్రూపునకు చెందిన స్టాక్స్ మంగళవారం అనూహ్యంగా రాణించాయి. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ లైసెన్సును వదులుకోవడానికి టాటా సన్స్ సమర్పించిన దరఖాస్తును ఆర్‌బీఐ తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో టాటా సన్స్‌కు లిస్టింగ్ తప్పనిసరి కానుంది. ఈ పరిణామంతో ఆయా కంపెనీల షేర్లు రాణించాయి. టాటా కెమికల్స్ ఏకంగా 20 శాతం లాభపడింది. ఎన్‌బీఎఫ్‌సీలకు సంబంధించి అప్పర్‌లేయర్ విభాగంలో టాటా సన్స్ ఉంది. ఈ విభాగంలోని ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదుకావాల్సి ఉంటుంది. ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను వదులుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అవ్వడంతో టాటా సన్స్‌కు కూడా లిస్టింగ్ తప్పనిసరి కానుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటోమొబైల్, స్టీల్, కన్జూమర్ ప్రొడక్ట్స్, ఏవియేసన్, హాస్పిటాలిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగాలకు చెందిన లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీల్లో టాటా సన్స్‌కు మెజారిటీ వాటా ఉంది. ఈ నేపథ్యంలో ఆయా లిస్టెడ్ కంపెనీల షేర్లు మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో రాణించాయి.

**టాటా సన్స్ లిస్టింగ్ తప్పదేమో!**

టాటా కెమికల్స్ ఏకంగా 20 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఎన్‌ఎస్‌ఈలో ఒక్కరోజులోనే షేరు విలువ రూ.122 పెరిగి రూ.734.90కి చేరింది. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఇంట్రాడేలో 15.24 శాతం మేర లాభపడింది.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,61,965 (22 క్యారెట్లు) | ₹ 1,76,697 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000

# బిగ్ బ్యాటరీతో రెడ్‌మీ..

## 2 కొత్త స్మార్ట్‌ఫోన్లు..



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రెడ్‌మీ తన నోట్ 17 సిరీస్ నుంచి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేసింది. రెడ్ నోట్ 17 ప్రోరెడ్‌మీ నోట్ 17ప్రో మ్యాక్స్‌ను లాంచ్ చేసింది. 9000 ఎంఏహెచ్, 10000 ఎంఏహెచ్ బ్యాటరీలతో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. ఎక్కువ రోజులు బ్యాటరీ లైఫ్ ఉండాలనుకునే వారికి ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారనుంది. ఇక ఫోన్ల ఫీచర్లు పరిశీలిస్తే...

రెడ్‌మీ నోట్ 17 ప్రో మ్యాక్స్

ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3పై పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5 ప్రాసెసర్ ఇచ్చారు. నాలుగేళ్లు పాటు ఓఎస్, ఆరేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. 6.83 అంగుళాల 1.5ఐ అమోలెడ్ డిస్‌ప్లే, 120ఊళి రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా+8ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. 10,000ఎంప్త బ్యాటరీ సదుపాయం, 100చి వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 27చి వైర్డ్ రివర్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. 5ఉ, 4ఉ ఒఇ, బ్లూటూత్ 6.0, జూః ఎజూవ-అ పోర్టు కనెక్టివిటీ సదుపాయం ఉంది. 229 గ్రాములు.

ధర విషయానికొస్తే..

బేస్ వేరియంట్ 8జీబీఉః + 256జీబీ ధర రూ.49,999, టాప్ వేరియంట్ ధర 12జీబీ + 256జీబీ ధర రూ.55,999. మాచా గ్రీన్, సీక్రెట్ సన్‌రైజ్, స్టెల్త్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. సెప్టెంబర్ 23 నుంచి అమెజాన్‌లో కొనుగోలు చేయవచ్చు.

రెడ్‌మీ నోట్ 17 ప్రో


ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 6ఐ జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3పై పనిచేస్తుంది. 6.83 అంగుళాల 1.5ఐ అమోలెడ్ డిస్‌ప్లే, 120ఊళి రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా+ 8ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. రెడ్‌మీ నోట్ ప్రో 9,000ఎంప్త బ్యాటరీతో వస్తోంది. 67చి వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 22.5చి వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది.

ధర విషయానికొస్తే..

బేస్ వేరియంట్ 8జీబీ+128జీబీధర రూ.36,999, టాప్ వేరియంట్ 8జీబీ+256జీబీ ధర రూ.39,999గా కంపెనీ నిర్ణయించింది. సెప్టెంబర్ 17న అమెజాన్‌లో విక్రయానికి రానుంది. క్లౌడ్ బ్లూ, పర్పుల్ వైబ్, స్టెల్త్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కార్డులను ఉపయోగించి ఈ ఫోన్లను కొనుగోలు చేయడం ద్వారా రూ.5 వేల వరకు తక్షణ రాయితీ పొందొచ్చు. హెడీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌పై రూ.5 వేల వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తామని కంపెనీ తెలిపింది.

# బంగారం స్వచ్ఛత తప్పనిసరి

ఇటీవల చెన్నైలోని ఓ జువెలరీ దుకాణంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విక్రయానికి ఉంచిన హాల్‌మార్క్ లేని 804 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హాల్‌మార్కింగ్ లేని బంగారాన్ని విక్రయించకూడదని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా.. యథేచ్ఛగా విక్రయాలు కొనసాగుతుండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంతకీ హాల్ మార్కింగ్ అంటే ఏమిటి? బంగారం కొనుగోలు చేసే ముందు ఏమేం చూడాలి? బంగారు ఆభరణాల స్వచ్ఛతను తెలుసుకొనేందుకు 'హాల్‌మార్క్' విధానాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రూపొందించింది. దీని ఆధారంగా నగపై ముద్రించిన మూడు అంశాల్ని పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది - స్టాండర్డ్ మార్క్. రెండోది - స్వచ్ఛత గ్రేడ్. మూడోది - ఊజఎఆ నంబర్. 2021 నుంచే బంగారు నగలపై ఈ హాల్‌మార్కింగ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇది త్రిభుజాకారంలో ఉండే గుర్తు. ఆభరణం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తనిఖీ చేశామని, అందులో వాడిన బంగారం ప్రామాణికమైనదని ధ్రువీకరిస్తుంది. కాబట్టి ఎంచుకునే నగపై ఈ గుర్తును ముద్రించారో లేదో చెక్ చేసుకోవాలి. బంగారంపై ముద్రించిన క్యారెట్స్ సంఖ్యను పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరి. 24 క్యారట్ల బంగారాన్ని వంద శాతం స్వచ్ఛమైనదిగా భావిస్తారు. అయితే, ఈ బంగారంతో నగల తయారీ సాధ్యం కాదు గనక వెండి, రాగి, జింక్ వంటి ఇతర లోహాల్ని కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. ఇలా తయారైన నగల్లో అసలు బంగారం ఎంత శాతం? ఇతర లోహాలు ఏ మోతాదులో కలిపారు? అనే వివరాలు తెలుసుకోవచ్చు. ఇందుకోసం దీన్ని సాధారణ ఆభరణాలకు ఉపయోగిస్తారు. 75% స్వచ్ఛమైన బంగారం వజ్రాభరణాలకూ వినియోగిస్తారు. 14ఐ585 అంటే ఇందులో 58.5 శాతం మాత్రమే బంగారం ఉంటుందని అర్థం. బంగారు ఆభరణంపై ఉండే ఊజఎఆ (హాల్‌మార్క్ యునిక్ ఐడెంటిఫికేషన్) నంబర్ కూడా అవసరమే. ప్రతి నగల వ్యాపారి ఈ ఆరంకెల ఆల్ఫాన్యూమరిక్ ఉన్న ఆభరణాల్నే విక్రయించాలని ప్రభుత్వం చెబుతోంది. ప్రతి వ్యక్తికి ఆధార్ ఉన్నట్లే ప్రతి ఆభరణానికీ ఒక ప్రత్యేకమైన నంబర్‌ని కేటాయిస్తారు. ఈ కోడ్ సాయంతో కొనుగోలు చేసే బంగారం స్వచ్ఛమైందో, కాదో స్వయంగా తనిఖీ చేసుకోవచ్చు. ఇందుకోసం 'ఃమా అజీతీవ' అనే యాప్ కూడా అందుబాటులో ఉంది. యాప్ ఓపెన్ కాగానే 'ఎవతీతిటఎ ఊజఎఆ' అని కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆపై బంగారు ఆభరణం మీద ఉన్న ఊజఎఆ నంబర్‌ని అందులో ఎంటర్ చేయాలి. తద్వారా నగకు సంబంధించిన హాల్‌మార్కింగ్ వివరాలన్నీ ఓ షీట్ రూపంలో కనిపిస్తాయి. హాల్‌మార్క్ చేసిన కేంద్రం, ఆభరణం, స్వచ్ఛత.. తదితర విషయాలన్నీ స్వయంగా తెలుసుకోవచ్చు. దుకాణదారుడు ఇచ్చే బిల్లుతో ఈ వివరాల్ని సరిపోల్చుకోవచ్చు.






# ఒకే రైలు.. 250 ట్రక్కుల లోడ్..

## భారత్‌కే సాధ్యమైన ఫీట్!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సరకు రవాణాలో భారతీయ రైల్వే అరుదైన రికార్డు సృష్టించింది. ప్రపంచంలో మరే దేశానికీ సాధ్యం కాని మొదటి పూర్తి ఎలక్ట్రిఫైడ్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ను ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో డబుల్ స్టాక్ రైళ్లు ఎప్పటినుంచో నడుస్తున్నా.. అవి డీజిల్ ఇంజిన్లతోనే నడుస్తున్నాయి. కానీ, విద్యుత్ వైర్లు కలిగిన పూర్తి సరకు రవాణా మార్గం కలిగిన ఏకైక దేశంగా భారత్ వాటి ముందు సగర్వంగా నిలిచింది.

**ఏమిటీ కారిడార్?**

సరకు రవాణాను వేగవంతం చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను 2006లో ఏర్పాటు చేసింది. ఇందులో తూర్పు డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. దీని పొడవు 1337 కిలోమీటర్లు. 1506 కిలోమీటర్ల వెస్టర్న్ డెడికేటెడ్ కారిడార్‌లోని 326 కిలోమీటర్ల పొడవైన చివరి మూడు సెక్షన్లను ప్రధాని మోదీ ఇటీవల జాతికి అంకితం చేయడంతో డబ్ల్యూడీఎఫ్‌సీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. మొత్తం సరకు రవాణా మార్గం 2,843 కిలోమీటర్లకు చేరింది.

**ఏంటి ప్రయోజనం**

వెస్టర్న్ కారిడార్ ప్రపంచంలోనే మొదటి పూర్తి ఎలక్ట్రిఫైడ్ ఫ్రైట్ నడవా. ఇందులో డబుల్-స్టాక్ కంటైనర్ ట్రైన్లు నడుస్తాయి. ఎత్తైన ఓవర్‌హెడ్ వైర్లు (సుమారు 7.45 మీటర్లు) ఉండడం వల్ల రెండు కంటైనర్లను ఒకదాని పైన ఒకటి పెట్టి రవాణా చేయవచ్చు. దీనివల్ల ఒకే ట్రైన్‌లో ఎక్కువ సరకు తరలించొచ్చు. ఇంధన వినియోగం, ఉద్గారాలు తగ్గుతాయి. సాధారణ రైలు మార్గాల్లో ప్యాసింజర్ రైళ్లకు ఆటంకాలు తగ్గుతాయి. ఈ మార్గాల్లో ప్రయాణించే భారీ లోడ్ కలిగిన సరకు రవాణా రైళ్ల పొడవు కిలోమీటరు పైనే ఉంటుంది. ఇందుకోసం ముందు భాగంలో అత్యాధునిక 12,000 హెచ్‌పీ ఇంజన్, మధ్యలో 9,000 హెచ్‌పీ కలిగిన ఇంజిన్‌ను ఉపయోగిస్తుంటారు.

**వాణిజ్యానికి వెన్నెముక: మోదీ**

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డీఎఫ్‌సీ) అందుబాటులోకి రావడం వల్ల భారతదేశ రవాణా రంగం సరికొత్త రూపురేఖలు సంతరించుకుందని ప్రధాని మోదీ అన్నారు. లాజిస్టిక్స్ ఖర్చులు, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఇటీవల ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ, వడోదర మధ్య నడిచిన డబుల్-స్టాక్ కంటైనర్ రైలు ఒకే ట్రిప్‌లో ఏకంగా 250కి పైగా ట్రక్కులకు సమానమైన సరకును మోసుకెళ్లిందని గుర్తుచేశారు. 2,800 కిలోమీటర్ల పొడవైన తూర్పు, పశ్చిమ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు దేశ వాణిజ్యానికి వెన్నెముకగా నిలిచాయని ప్రధాని అన్నారు. గతంలో సరకు రవాణా రైలు 100 కిలోమీటర్లు వెళ్లేందుకు 6.5 గంటల సమయం పట్టేదని, ఇప్పుడు అందులో సగం కంటే తక్కువ సమయంలోనే గమ్యస్థానానికి చేరుకుంటోందని తెలిపారు.

## ఎన్‌ఎస్‌ఈ ఐపీవోకు దరఖాస్తు..

# జాగ్రత్తలు తప్పనిసరి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్‌ఎస్‌ఈ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. సెప్టెంబర్ 17న రూ.22,562 కోట్ల మెగా ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. సెప్టెంబర్ 21న ముగియనుంది. ధరల శ్రేణి రూ.1700-1785. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రిటైల్ ఇన్వెస్టర్లు ఎనిమిది షేర్లు కలిగిన ఒక్కో లాట్ కొనుగోలుకు రూ.14,280 వెచ్చించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ ఐపీఓకు దరఖాస్తు చేద్దామనుకుంటే.. ఎన్‌ఎస్‌ఈకి సంబంధించిన కీలక అంశాలతో పాటు రిస్కులూ తెలుసుకోవాల్సిందే.

మార్కెట్ లీడర్

1992లో ఏర్పాటైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ క్యాష్‌మార్కెట్, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, మ్యూచువల్ ఫండ్స్, కమొడిటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, డెట్ అండ్ ఇంట్రెస్ట్ రేట్ ఫ్యూచర్స్ ట్రేడింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఎన్‌ఎస్‌ఈలో 2026 జూన్ నాటికి 13.24 కోట్ల యూనిక్ రిజిస్టర్డ్ ఇన్వెస్టర్లు ఉన్నారు. క్యాష్ మార్కెట్‌లో 93.05 శాతం వాటా ఉంది. ఈక్విటీ ఫ్యూచర్స్‌లో 99.72 శాతం, ఈక్విటీ ఆప్షన్లలో 68.48 శాతం వాటా కలిగి ఉంది. ఎన్‌ఎస్‌ఈలో రోజుకు సగటున సుమారు రూ.1.55 లక్షల కోట్ల విలువైన క్యాష్‌మార్కెట్ లావాదేవీలు జరుగుతుంటాయి. బీఎస్‌ఈలో రూ.7,950 కోట్లు మాత్రమే. ఈక్విటీ ఫ్యూచర్స్‌లో రూ.1.59 లక్షల కోట్ల లావాదేవీలు జరుగుతుండగా.. బీఎస్‌ఈలో రూ.342 కోట్లు మాత్రమే. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల ద్వారా ఎన్‌ఎస్‌ఈకి రూ.1601.31 కోట్ల ఆదాయం వచ్చింది. లావాదేవీ ఛార్జీలే ప్రధాన ఆదాయ వనరు. దీని వాటా 78.65గా ఉంది. ఇందులో ఆప్షన్స్ ద్వారా 60.22 శాతం, ఫ్యూచర్స్ ద్వారా 8.92 శాతం సమకూరుతోంది. బీఎస్‌ఈలో 5,955 లిస్టెడ్ కంపెనీలు ఉండగా.. ఎన్‌ఎస్‌ఈలో 2,978 కంపెనీలు లిస్టయ్యాయి. మార్కెట్ విలువ మాత్రం దాదాపు సమానమే. ఎన్‌ఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.481.09 లక్షల కోట్లు కాగా.. బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.481.56 లక్షల కోట్లుగా ఉంది.




**రిస్కులు ఇవే..**

ఎన్‌ఎస్‌ఈకి సంబంధించిన ప్రధాన రిస్క్ దాని ట్రేడింగ్ పరిమాణమే. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆదాయాన్ని పరిశీలిస్తే లావాదేవీలపై విధించే ఛార్జీల కారణంగానే ఎన్‌ఎస్‌ఈకి 78.65 శాతం సమకూరుతోంది. ఒకవేళ ట్రేడింగ్ పరిమాణం తగ్గితే ఆ మేర ఆదాయమూ తగ్గుతుంది. ఎన్‌ఎస్‌ఈ ఎక్కువగా డెరివేటివ్స్‌పై ఆధారపడుతోంది. ఆప్షన్స్ ద్వారా 60.22 శాతం ఆదాయం సమకూరుతోంది. ఫ్యూచర్స్ ద్వారా 8.92 శాతం వస్తోంది. డెరివేటివ్స్ లావాదేవీలు లేదా మార్కెట్ వాటా తగ్గితే ఆ మేర ఆదాయంపై ప్రభావం ఉంటుంది. వినియోగదారుల కేంద్రీకరణ మరో ప్రమాదం. 2025-26లో ఎన్‌ఎస్‌ఈ ఆదాయంలో 46.78 శాతం టాప్ 10 ట్రేడింగ్ సభ్యులదే. ఈ సభ్యుల ట్రేడింగ్ కార్యకలాపాలు తగ్గడం, ఆర్థిక ఒత్తిడులు ఎదుర్కోవడం లేదా పోటీ ఎక్స్ఛేంజీలకు మారడం వంటివి ఎన్‌ఎస్‌ఈ ట్రేడింగ్ పరిమాణంపై ప్రభావం చూపొచ్చు. ఎన్‌ఎస్‌ఈ, దాని అనుబంధ సంస్థలు నిత్యం నియంత్రణ సంస్థల పర్యవేక్షణలో పనిచేస్తాయి. సెబీ, ఆర్‌బీఐ, ఐఎఫ్‌ఎస్‌సీఏ పర్యవేక్షణ, తనిఖీలు, ఆడిట్‌లు, పరిశీలనలు, నోటీసులు, జరిమానాల వంటివి ఎన్‌ఎస్‌ఈ లాభదాయకతను ప్రభావితం చేయవచ్చు. ఎన్‌ఎస్‌ఈకి పొంచి ఉన్న మరో ప్రమాదం టెక్నాలజీ. ట్రేడింగ్, క్లియరింగ్‌పైనే ఎన్‌ఎస్‌ఈ వ్యాపారం ఆధారపడి ఉంటుంది. ఇదంతా టెక్నాలజీతో ముడిపడి ఉంటుంది. 2021లో సాంకేతిక అంతరాయం కారణంగా ఎన్‌ఎస్‌ఈ ట్రేడింగ్ విభాగాలు సుమారు ఐదు గంటల పాటు నిలిచిపోయాయి. సైబర్ దాడుల ముప్పు ఎప్పుడూ పొంచి ఉండేదే.

# రానున్న ఐదేళ్లలో అత్యంత ప్రమాదకారిగా ఏఐ

## గూగుల్ మాజీ పరిశోధకుడు

**వాషింగ్టన్(జనంసాక్షి):** కృత్రిమ మేధతో భవిష్యత్తులో భారీ ప్రమాదం పొంచి ఉందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ సహా పలువురు టెక్ అధినేతలు ఇటీవల హెచ్చరికలు చేశారు. అది మరింత మెరుగవుతోన్న కొద్దీ మానవాళికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ జాబితాలో తాజాగా గూగుల్ డీప్‌మైండ్ మాజీ భద్రతా పరిశోధకుడు బిలాల్ చుగ్తాయ్ చేరారు. ఏఐ ఆందోళనతో అతడు ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గూగుల్ ఏజీఐ సేఫ్టీ బృందం కీలక సభ్యుడు జాష్ ఎంగెల్స్ సైతం ఆయన స్థానం నుంచి వైదొలిగారు. 'ఆరంభ సమయంలో ఏఐ ఓ హాస్యాస్పదమైన విషయంగా ఉండేది. కేవలం నాలుగేళ్లలోనే ఓపెన్ ఏఐకి చెందిన ఏఐ ఏజెంట్ల సమూహాలు తమను తాము మరింత మెరుగుపరుచుకున్నాయి. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. ప్రస్తుతం అవి ఓపెన్ ఏఐ నియంత్రణ నుంచి తప్పించుకుని.. సొంతంగా థర్డ్ పార్టీ కంపెనీలను హ్యాక్ చేస్తున్నాయి. రానున్న ఐదేళ్లలో కృత్రిమ మేధతో తీవ్ర నష్టాలు ఎదుర్కొనే అవకాశముంది. దానికి మనందరినీ అంతం చేసే సామర్థ్యముంది. గూగుల్‌లో ఏఐ అభివృద్ధిని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ అసాధారణ పెరుగుదల చూస్తుంటే ఆందోళనగా ఉంది. ఏఐ నుంచి వచ్చే విపత్తును ఎదుర్కోవడానికి కూడా సమయం లేని దశకు మనం చేరుకున్నాం' అని బిలాల్ చుగ్తాయ్ పేర్కొన్నారు.

# ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి మృతి

**పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ యువతి మృతి**

**ఇద్దరి వేధింపులే కారణం తండ్రి ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**గోదావరిఖని, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ప్రేమ పేరుతో ఇద్దరు వ్యక్తులు వేధించడంతో మానసికంగా కుంగిపోయిన ఓ యువతి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గోదావరిఖని లెనిన్‌నగర్‌లో చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి ఐజాక్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఐజాక్ కుమార్తె అక్షిత రాణి (20) నస్పూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న సమయంలో అక్కడ లెక్చరర్‌గా పనిచేసిన జెట్టి నవీన్ ప్రేమ పేరుతో వేధించేవాడని తండ్రి ఆరోపించారు. కుటుంబ సభ్యులు మందలించినా వేధింపులు కొనసాగడంతో సుమారు మూడేళ్ల క్రితం గర్రెపల్లి నుంచి గోదావరిఖనికి నివాసం మార్చినట్లు తెలిపారు. అనంతరం సింగరేణి ఆర్‌జీ–1 ఏరియాలోని 2–ఇంక్లైన్ గనిలో అప్రెంటిస్ శిక్షణకు వెళ్లిన సమయంలో ఓవర్‌మ్యాన్‌గా పనిచేస్తున్న బొమ్మకంటి రవికుమార్ కూడా ప్రేమ పేరుతో వేధించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపులతో ఆమె చదువు మధ్యలోనే నిలిపివేసి గౌతమినగర్‌లోని ఓ కంప్యూటర్ సెంటర్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న సాయంత్రం ఆమెకు ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నానని చెప్పిందని, అదే రాత్రి నవీన్ ఫోన్ చేసి అక్షిత పురుగుల మందు సేవించినట్లు సమాచారం ఇచ్చాడని తండ్రి తెలిపారు. అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 13న సాయంత్రం మృతి చెందింది. తన కుమార్తె మృతికి నవీన్, రవికుమార్ వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ (జనంసాక్షి):** ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ రూరల్ మండల పరిధిలోని 50 మంది లబ్ధిదారులకు రూ.17.3 లక్షల, అర్బన్ మండల పరిధిలో 53 మంది లబ్ధిదారులకు రూ.18.23 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.వైద్య చికిత్స కోసం కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# మక్తా మహబూబ్ పేట్ వార్డులో వన్ డే వన్ వార్డ్' కార్యక్రమం : పౌర సమస్యలపై సమీక్ష



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** ప్రతిరోజు ప్రతి వార్డు కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధి మక్తా మహబూబ్‌పేట్ వార్డులో మంగళవారం 'వన్ డే వన్ వార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్, మియాపూర్ డిప్యూటీ కమిషనర్, పట్టణ ప్రణాళిక విభాగం, యుబిడి శాఖతోపాటు ఇతర అన్ని విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఒకరోజు ఒక వార్డు కార్యక్రమంలో వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొని సమస్యలను చర్చించారు. ప్రధానంగా వార్డు పరిధిలోని రహదారుల మరమ్మత్తులు, భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీరు, స్మార్ట్ వాటర్ నిర్వహణ, పారిశుధ్యం, ఆక్రమణలు, రహదారి భద్రతకు సంబంధించిన అంశాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు లేవనెత్తిన, చర్చకు వచ్చిన గుర్తించిన అన్ని సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల అమలును నిరంతరం పర్యవేక్షించి, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు 'కంప్లయన్స్ నివేదికలు' సమర్పించాలని సూచించారు. వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను సమీక్షించడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం మరియు ప్రజలకు మరింత మెరుగైన మున్సిపల్ సేవలను అందించడం లక్ష్యమని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబిడి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుంట్లూరు రాజీవ్ గృహకల్ప వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆర్టీసీ బస్సు-టిప్పర్ ఢీ.. 20 మందికి పైగా ప్రయాణికులకు తీవ్ర గాయాలు**





**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని కుంట్లూరు రాజీవ్ గృహకల్ప సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల వివరాల ప్రకారం.. కుంట్లూరు రాజీవ్ గృహకల్ప నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని వస్తున్న హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెయిన్‌రోడ్డు దాటుతున్న సమయంలో నాగోల్ వైపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా వనస్థలిపురం, సికింద్రాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

# వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి

**చేవెళ్ల ఆర్డీవో పార్థసింహా రెడ్డి**



**చేవెళ్ల, సెప్టెంబరు 15 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు, ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకునేలా అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహా రెడ్డి సూచించారు. మంగళవారం చేవెళ్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పుష్కరిణిలో నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను వెంటనే తొలగించి పుష్కరిణి పరిశుభ్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే ప్రతి వినాయక మండపానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య ఏర్పాట్లపై పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్లాస్టిక్ పూజా సామగ్రి, ఇతర వ్యర్థాలను పుష్కరిణిలో వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి, ఎస్సై రవీందర్ నాయక్, మున్సిపల్ ఏఈ సాహితీ, నాయకులు ఎర్ర మల్లేష్, టేకులపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన రాజన్న జోన్ 3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ - సీపీ గౌజ్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ టౌన్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని మంగళవారం సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ, రాజన్న జోన్ - 3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఉన్నతాధికారులకు పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ తనిఖీల్లో భాగంగా కార్యాలయ పరిధిలోని నేరాల రికార్డులు, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితి పై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అలాగే రానున్న వినాయక చవితి (గణేష్ చతుర్థి) వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ సి. హెచ్. వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు రామచందర్ రావు, తిరుమల్, పుల్లయ్యలతో పాటు డివిజన్ పరిధిలోని ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా
# అక్రమ నిర్మాణాలు చేపట్టితే ఉపేక్షించేది లేదు

**దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకటమణి.**



**నిజాంపేట్ సెప్టెంబర్ 15 జనం సాక్షి :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్, పరిధిలోని దొమ్మర పోచంపల్లి ప్లాట్ నెం. 3/ పార్ట్ సర్వేనెంబర్. 253 పార్ట్‌లో ఎస్ 2 పర్మిషన్ తీసుకొని ఎస్ 4 అనధికార అంతస్తులను నిర్మించడం తో మంగళవారం దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో కలిసి కూల్చివేతలూ చేపట్టారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిఘా తీవ్రతరం దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ గజాలలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు చెక్ అనుమతులు ఒకలా తీసుకొని, అదనంగా అనధికారిక నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. భారీ కూల్చివేతలు ఖాయం ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ కూల్చివేతలు చేపట్టనున్నట్లు డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో గర్భిణి హత్య

**ప్రమాదంగా చిత్రీకరించేందుకు భర్త యత్నం**

- **గొంతు నులిమి హతమార్చినట్లు పోలీసుల వెల్లడి**
- **తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి హత్య**
- **నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**



**అల్వాల్, సెప్టెంబరు 15 (జనంసాక్షి):** భార్యపై అనుమానంతో ఆరు నెలల గర్భిణిని భర్త గొంతు నులిమి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాత్రూంలో కాలు జారి పడిందని చెప్పి ఘటనను ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించినట్లు వెల్లడించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన పరశురామ్, శివాని(20)కి ఏడాది క్రితం వివాహమైంది. నగరంలో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న పరశురామ్.. అల్వాల్ సూర్యనగర్ కాలనీలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు భార్య మరో వ్యక్తితో చనువుగా ఉంటోందన్న అనుమానంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. బేకరీ వ్యాపారం కోసం డబ్బులు ఇవ్వాలని కూడా ఆమెను వేధించేవాడని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మద్యం సేవించిన పరశురామ్ భార్యతో గొడవపడి గొంతు నులిమినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అనంతరం మామ వెంకటేష్‌కు ఫోన్ చేసి బాత్రూంలో కాలు జారి పడిందని చెప్పాడు. ఘటనపై అనుమానంతో వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు పరశురామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

# దౌలాపూర్, సుల్తాన్ పూర్ పేద రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**కేవీపీఎస్, ప్రజా సంఘాల డిమాండ్.**



**యాలాల సెప్టెంబర్ 15(జనంసాక్షి) :** తాండూర్ ఆర్డీవో కార్యాలయంలో డీఈవో కి కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప మాట్లాడుతూ యాలాల మండలం దౌలాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 73 లో 1980లో ప్రభుత్వం 11 పేద కుటుంబాలకు 25 ఎకరాలు పంపిణీ చేసిందని, అప్పటి నుండి వారు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాగే దౌల్తాబాద్ మండలం సుల్తాన్ పూర్ సర్వే నంబర్ 5 లోని 3 ఎకరాల భూమిని మూడు కుటుంబాలు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని అన్నారు.కాన్మర్తి నుండి కోడంగల్ కెనాల్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి భూములను తీసుకున్నారని, నష్ట పరిహారం చెల్లించకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా మూడింతల నష్టపరిహారం ఇవ్వాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మహేందర్, రైతులు రాములు, వెంకటయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.186 కోట్ల నిధులతో పినపాక నియోజకవర్గంలోని రహదారులకు మహర్దశ

**ఎమ్మెల్యే పాయం చొరవకు అశ్వాపురం కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు**



**అశ్వాపురం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పినపాక నియోజకవర్గంలోని రహదారులు, వంతెనల అభివృద్ధికి రూ.186 కోట్ల భారీ నిధులు మంజూరు కావడం పట్ల అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న రహదారి సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వారు పేర్కొన్నారు.నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ నిధులతో చేపట్టే రహదారులు, వంతెనల నిర్మాణ పనులు దసరా పండుగలోపే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటుండటం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పనులు పూర్తయిన అనంతరం సుమారు 15 ఏళ్లపాటు వాటి నిర్వహణ బాధ్యత సంబంధిత సంస్థలదే ఉండే విధానం వల్ల రహదారుల నాణ్యత, నిర్వహణకు మరింత భరోసా ఉంటుందని తెలిపారు.భారీ నిధులతో రహదారులు, వంతెనలు అభివృద్ధి చెందితే మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఇది నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, సర్పంచులు ఇర్పా కవిత, ఎనిక ఉషారాణి, మచ్చ నరసింహారావు, కుంజ జాను, ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్, నాయకులు ఆవుల రవి, మట్టా వీరభద్రరెడ్డి, ఎనిక రవి, తెలం వీరభద్రం, సమకూరు వెంకన్న, లంకమల్ల కొండలరావు, బచ్చు వెంకటరమణ, యువజన కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి నరేష్ కుమార్, వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **అంగడి రాయిచూర్ ఆసుపత్రిలో రికార్డులు, మందుల నిల్వల పరిశీలన**
- **వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశం**
- **లక్ష్మీపల్లిలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రక్రియపై సమీక్ష**
- **పెండింగ్ నోటీసులను త్వరగా పరిష్కరించాలని సూచన**



**కొడంగల్, సెప్టెంబరు 15 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కొడంగల్ మండలంలోని అంగడి రాయిచూర్ ప్రభుత్వ ఆసుపత్రి, లక్ష్మీపల్లి గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి వివిధ అంశాలను పరిశీలించారు. అంగడి రాయిచూర్ ఆసుపత్రిలో హాజరు, స్టాక్ రిజిస్టర్లతో పాటు మందులు, వైద్య సామగ్రి నిల్వలను తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోగులను పరామర్శించి వైద్య సేవలు, మందుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం, మందులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఫోన్‌లో ఆదేశించారు.
అనంతరం లక్ష్మీపల్లిలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటికే జారీ చేసిన, పెండింగ్‌లో ఉన్న నోటీసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా నిబంధనల ప్రకారం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జారీ చేసిన నోటీసుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, పెండింగ్ నోటీసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో డీపీవో జయసుధ, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో ఉషశ్రీ, మెడికల్ ఆఫీసర్ బుషిరా బేగం, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై సేవా సంకల్ప్ అభియాన్

- **సెప్టెంబరు 17 నుంచి నెలరోజుల పాటు కార్యక్రమాలు**
- **'ఆశీర్వాద దీపం'లో ప్రజలు పాల్గొనాలి**
- **కేంద్ర పథకాల లబ్ధిదారులకు సేవా కార్యక్రమాలు**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై బండి సంజయ్ విమర్శలు**



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబరు 15 (జనంసాక్షి):** గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్––జన్ సేవా హీ ప్రభు సేవా' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబరు 17న సాయంత్రం 7 గంటలకు 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించి మోదీ నిండు నూరేళ్లు ప్రజాసేవలో ఉండాలని ఆకాంక్షిస్తూ దీపాలు వెలిగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అదే రోజు రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 7 వరకు పాఠశాలల్లో 'సేవా అంకితభావం 25 సంవత్సరాలు', 'వికసిత భారత్' అంశాలపై చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామాల్లో కళా ప్రదర్శనలు, సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు 'ఆంగన్ మిలన్ సేవ' పేరుతో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర పథకాల లబ్ధిదారుల అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. 'సేవా సేతు అభియాన్'లో భాగంగా అసెంబ్లీ, మండల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కేంద్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు అందించాలని సూచించారు.
2047 నాటికి వికసిత భారత్ నిర్మాణానికి ప్రజలను భాగస్వాములను చేయాలని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఘనంగా నిర్వహిస్తామని చెప్పి మాట తప్పాయని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి విషయంలో ఒకే నాణేనికి బొమ్మా బొరుసుల్లా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగించలేని పరిస్థితిలో ఉందని, కర్ణాటక ముఖ్యమంత్రి వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

# సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలి

**అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి: చాడ వెంకటరెడ్డి**




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 15, ( జనం సాక్షి) :**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు అమరవీరుల స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేలా స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఆ పోరాటంలో వేలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, పేదలకు భూములు దక్కాయని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడంలో కమ్యూనిస్టుల పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు.సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని హిందూ––ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సాయుధ పోరాట స్మృతివనం ఏర్పాటు చేయాలని, అమరవీరుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని కోరారు. కరీంనగర్‌లోని అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం, కోతిరాంపూర్ బైపాస్ రోడ్డులోని మాజీ ఎంపీ బద్దం ఎల్లారెడ్డి విగ్రహాల చుట్టూ సుందరీకరణ చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం, నగరపాలక సంస్థపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమళ్ల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, బండ రాజిరెడ్డి, పైడిపెల్లి రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, బీర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## చిరుత దాడిలో మేక మృతి

మద్దూరు సెప్టెంబర్ 14 (జనం సాక్షి) : మద్దూరు మండలం దొరేపల్లి గ్రామ శివారులోని పులిగట్టు వద్ద చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పల్లెగడ్డ గ్రామానికి చెందిన బండెప్ప తన పొలం వద్ద మేకలను మేపి, ఆదివారం సాయంత్రం పాక వద్ద మేకలను కట్టివేశాడు. అయితే ఓ మేక కనిపించకపోవడంతో గుట్టపైకి వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మరోసారి గాలించగా గుట్ట సమీపంలో మేక మృతదేహం కనిపించింది. చిరుత దాడి చేసి మేకను చంపినట్లు బాధితుడు తెలిపాడు. మేక విలువ రూ.10 వేలకు పైగానే ఉంటుందని పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత దాడి చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన అధికారులు, అటవీశాఖ తరఫున నిబంధనల ప్రకారం పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు బాధితుడు వెల్లడించాడు.

## సింగరేణి కార్మికులకు 'సొంతింటి' సహకారం

- అసెంబ్లీలో ప్రస్తావించనున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
- ఐదేళ్లుగా సీఐటీయూ పోరాటానికి ఫలితం
- హెచ్‌ఆర్‌ఏ, వడ్డీలేని రుణంతో ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వానికి ఆదాయం.. పట్టణాభివృద్ధికి ఊతం



గోదావరిఖని, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): సింగరేణి కార్మికుల దశాబ్దాల కల అయిన 'సొంతింటి సహకారం' పథకాన్ని శాసనసభలో ప్రస్తావించనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి అభినందనలు తెలిపారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ గత ఐదేళ్లుగా చేస్తున్న పోరాటానికి స్పందించి పథకాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం, సింగరేణికి అదనపు ఆర్థిక భారం లేకుండా హెచ్‌ఆర్‌ఏ, వడ్డీలేని రుణ సదుపాయాలను అనుసంధానించి క్వార్టర్లు లేని కార్మికులు సొంత ఇళ్లు నిర్మించుకునేలా ప్రతిపాదన రూపొందించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణంతో రిజిస్ట్రేషన్లు, విద్యుత్, మున్సిపల్ రంగాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు సింగరేణి ప్రాంతాల్లో స్థిరనివాసాలు, వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా జరుగుతున్న ఈ ప్రయత్నంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కుంట ప్రవీణ్‌కుమార్, వంగల శివరాంరెడ్డి, అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ వద్ద 1.05 కిలోల గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడి**

**గంజాయి విలువ రూ.52,500.. బ్యాగు, మొబైల్ ఫోన్ స్వాధీనం**



గోదావరిఖని, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): గోదావరిఖని బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద వాహనాల తనిఖీల్లో 1.05 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన సికింద్రాబాద్-మల్కాజిగిరికి చెందిన కార్పెంటర్ పిన్నోజి గోపి, మాచర్ల పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగును తనిఖీ చేయగా ఎండిన గంజాయి ఆకులు, పండ్లు కలిగిన ప్యాకెట్ లభించింది. విచారణలో మహారాష్ట్రలోని చంద్రపూర్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. చంద్రపూర్ నుంచి రైలులో మంచిర్యాల, అక్కడి నుంచి ఆటోలో గోదావరిఖనికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.52,500గా తెలిపారు. గంజాయి తరలింపునకు ఉపయోగించిన బ్యాగు, మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పారమిత హెరిటేజ్‌లో ఫిన్లాండ్ విద్యా విధానం

- పాఠశాలను సందర్శించిన ఫిన్లాండ్ విద్యా ప్రతినిధులు
- ఆనందం, సృజనాత్మకతకు ప్రాధాన్యం: ప్రతినిధులు
- 1 నుంచి 5 తరగతుల్లో విధానం అమలు
- ఒత్తిడి లేని అభ్యాసమే లక్ష్యం: పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలను ఫిన్లాండ్‌కు చెందిన ఫిన్నిష్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సంస్థ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ విభాగం అధిపతి లారా మరియా, భారత ప్రతినిధి రష్మి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫిన్లాండ్ విద్యా విధానంలోని ప్రత్యేకతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షలు, ర్యాంకులు, పోటీ కంటే విద్యార్థుల ఆనందం, మానసిక శ్రేయస్సు, సమాన అవకాశాలు, సృజనాత్మకత, జీవన నైపుణ్యాలు, స్వయంగా నేర్చుకునే సామర్థ్యానికి ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్‌రావు మాట్లాడుతూ పిల్లలు ఆనందంగా నేర్చుకున్నప్పుడే నిజమైన అభ్యాసం జరుగుతుందని, మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి చేయకుండా వారి ప్రతిభను గుర్తించి స్వతంత్రంగా ఎదిగేలా చూడాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పారమిత హెరిటేజ్ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఫిన్లాండ్ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నట్లు డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి తగ్గించి, ఆనందంగా నేర్చుకునే వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొడంగల్-నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్‌పై రైతుల ఆందోళన

- భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయ సేకరణ
- న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్
- బాధిత కుటుంబాలకు 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి
- ఇందిరమ్మ ఇళ్లతో పునరావాసం కల్పించాలి

వికారాబాద్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి): కొడంగల్-నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా దుద్యాల మండలంలో మంగళవారం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాండూర్ ఆర్డీఓ, దుద్యాల తహసీల్దార్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రైతు శాసం వెంకటయ్య మాట్లాడుతూ ప్రతిపాదిత కాలువ నిర్మాణంతో తనకు సుమారు ఎకరం భూమి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొకాపేట్‌లో భూములకు కోట్ల రూపాయల విలువ చెల్లిస్తున్నప్పుడు కొడంగల్ ప్రాంత రైతుల భూములకు రూ.20 లక్షల పరిహారం ఎలా సమంజసమని ప్రశ్నించారు. చిన్న, సన్నకారు రైతులకు భూమే జీవనాధారమని, ప్రాజెక్టు కోసం భూములు తీసుకుంటే పరిహారం తోపాటు భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. భూములు కోల్పోయే ప్రతి కుటుంబా నికి కనీసం 200 గజాల ఇంటి స్థలం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయా లని, భూమి విలువకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## యంగ్ ఇండియా పాఠశాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

- నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతం చేయాలి
- అదనపు తరగతి గదులు రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలి
- ఎస్ఐఆర్ విచారణ మార్గదర్శకాల మేరకు చేపట్టాలి
- ఓటర్ల వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు



ఎలిగేడు, సుల్తానాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో పాఠశాల నిర్మాణ పనులను, సుల్తానాబాద్‌లో నూతన ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేస్తూనే నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని సూచించారు. అదనపు తరగతి గదులను రెండు నెలల్లోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం సుల్తానాబాద్ 5వ వార్డులోని శ్రీ వాణి డిగ్రీ, పీజీ కళాశాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. విచారణను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని, నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధార పత్రాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు పూర్తి ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్‌కుమార్, తహసీల్దార్లు యాకన్న, బషీరొద్దీన్, డిప్యూటీ ఈఈలు బాబురెడ్డి, మారుతి, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు : ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, సెప్టెంబర్15(జనంసాక్షి) : మహిళా సాధికారతతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను అందిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిజిటల్ (స్మార్ట్) రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో సుమారు 1.23 లక్షల పాత రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మారుస్తుండగా, కొత్తగా సుమారు 60 వేల మందికి రేషన్ కార్డుల్లో సభ్యులుగా నమోదుకు అవకాశం కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు పారదర్శకంగా అందించడమే ఈ డిజిటల్ కార్డు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, పౌరసరఫరాల అధికారి పుల్లయ్య, రెవెన్యూ అధికారులు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ, హైదర్గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామా ఇంద్రపాల్ రెడ్డి, నాయకులు జి. శ్రావణ్, ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పూల వ్యర్థాల పునర్వినియోగానికి ప్రణాళిక

- పండుగల అనంతరం పూల వ్యర్థాలపై ప్రత్యేక దృష్టి
- ఐడీఎల్ చెరువు వద్ద తొలిదశలో సేకరణ కియోస్కులు
- అగరబత్తీలు, ధూపాలు, దీపాల తయారీకి వినియోగం



శేరిలింగంపల్లి, (జనంసాక్షి): వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల సందర్భంగా పెద్దఎత్తున ఉత్పత్తయ్యే పూల వ్యర్థాలను పునర్వినియోగం చేసేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం 'పక్కా ఆర్గానిక్స్' సంస్థ ప్రతినిధులతో సీఎంసీ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పూల వ్యర్థాలను సాధారణ చెత్తగా కాకుండా ప్రత్యేకంగా సేకరించి, ఎండబెట్టి అగరబత్తీలు, ధూపాలు, దీపాలు తదితర విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే అవకాశాలను పరిశీలించారు. తొలిదశలో ఐడీఎల్ చెరువు వద్ద నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక పూల సేకరణ కియోస్కులు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. సేకరించిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి సర్క్యులర్ ఎకానమీకి అనుగుణంగా వినియోగించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలనుకునే ఎన్‌జీఓలు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలు ముందుకు రావాలని సీఎంసీ ఆహ్వానించింది. పండుగల వ్యర్థాలను తగ్గిస్తూ సుస్థిర నిర్వహణ, వనరుల పునర్వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొంది.

## వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న గుత్తేదారులు

- రక్షణ, మౌలిక వసతులు లేక ఇబ్బందులు
- అదనపు గంటలు పని చేయిస్తున్నారని ఆరోపణలు
- తుమ్మలూరులో సెంట్రింగ్ కార్మికుడి మృతి
- గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మహేశ్వరం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి మహేశ్వరం నియోజకవర్గానికి వస్తున్న వలస కార్మికుల శ్రమను కొందరు గుత్తేదారులు, యజమానులు దోచుకుంటున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బాలాపూర్, తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని కంపెనీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సరైన వసతి, రక్షణ కల్పించకుండా అధిక గంటలు పని చేయిస్తున్నారని పేర్కొన్నారు. పనిలో ప్రమాదాలు జరిగినా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 4న తుమ్మలూరు గ్రామంలోని ఇన్ఫోసిటీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద సెంట్రింగ్ పనులు చేస్తుండగా బిహార్‌కు చెందిన సజన్ కర్మాకర్ రెండంతస్తుల భవనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.

మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సమాచారం ఇవ్వడంలో జాప్యం చేశారని, కొంత మొత్తం ఇచ్చి వ్యవహారాన్ని ముగించేందుకు ప్రయత్నించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వలస కార్మికులకు భద్రత, మౌలిక వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ మహేశ్వరం మండల అధ్యక్షుడు గన్నబోయిన శివయాదవ్ డిమాండ్ చేశారు. అదనపు గంటలు పని చేయిస్తున్న సంస్థలు, గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని, కార్మికులపై దాడులు, బెదిరింపులను అరికట్టాలని కోరారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు

**11వ వార్డులో పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి**

చేవెళ్ల, సెప్టెంబరు 15 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపల్లి వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ బండారి శైలజా అగిరెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రజలకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ బలోపేతానికి ఐక్యంగా పని చేయాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కార్యకర్తలకు నాయకులు నిరంతరం అందుబాటులో ఉండాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- నూతన అధ్యక్షులకు నియామకపత్రాల అందజేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) : పదవులను కేవలం హోదాలుగా కాకుండా ఒక బాధ్యతగా స్వీకరించి, పార్టీ బలోపేతానికి, ప్రజల సేవకు అంకితభావంతో పనిచేయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డితో కలిసి నియోజకవర్గంలోని పలు మండలాల, డివిజన్ల నూతన అధ్యక్షులకు ఆయన నియామకపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు ఆదిభట్ల, తొర్రూర్, తుర్కయంజాల్, కొంగర, కుంట్లూర్, పెద్దఅంబర్‌పేట్, ఆదిభట్ల మున్సిపల్ డివిజన్ల నూతన అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో, ఐక్యంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు నాయకులు నిరంతరం అందుబాటులో ఉండి వారిని ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ఎక్కడికక్కడ ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారికే సముచిత స్థానం లభిస్తుందని, నూతన అధ్యక్షులు అందరూ సమష్టి కృషితో పార్టీ విజయాలకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్లు చిలుక మధుసూధన్‌రెడ్డి, గురునాథ్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాండురంగారెడ్డి, భూపతిగల్ల మహిపాల్, భాస్కరాచారి, ఈసీ శేఖర్‌గౌడ్, రాచర్ల వెంకటేశ్వర్లు, కొత్తకుర్మ శివకుమార్, ధనరాజ్ గౌడ్, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, దాసు, జడల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## కొండగట్టు పుణ్యక్షేత్రానికి కొత్త ఘాట్ రోడ్డుకు స్థల పరిశీలన

**ఎమ్మెల్యేగా కాదు అంజన్న భక్తుడిగా సేవ చేస్తా : ఎమ్మెల్యే సత్యం**



మల్యాల సెప్టెంబర్ 15 (జనం సాక్షి) : తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు వచ్చే భక్తుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా నూతన ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ తెలంగాణ దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేమ కొండగట్టు దేవస్థానమని దేవాలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా కాదు స్వామివారి భక్తుడిగా సేవ చేయడం అదృష్టమని నూతన ఘాట్ రోడ్ నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్ కోసం దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు సేవ చేస్తానని,కొండగట్టు ఘాట్ రోడ్ లో 11 సెప్టెంబర్ 2018 భారత దేశంలోనే జరిగిన బస్సు ప్రమాదం అతి పెద్దదని 65 మంది ప్రాణాలు కోల్పోయారని ఎంతోమంది ఇప్పటికి విగత జీవులుగా ఉన్నారని గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఘాట్ రోడ్డుపై శాసనసభ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆర్ అండ్ బి మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నూతన ఘాట్ రోడ్డు కోసం సంబంధించి ఆర్ అండ్ బి అధికారులను మరియు కన్సండ్ అధికారులను సర్వే చేయాల్సిందిగా ఆదేశించారని అందుకోసమే మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారని వాస్తు రీత్యా,భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా,భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలించి ప్రభుత్వానికి రిపోర్ట్ పంపిస్తున్నామని దొంగల మరి నుండి వై జంక్షన్ వరకు కూడా రోడ్డు విస్తరణ చేపట్టాలని మంత్రిని కోరారని బడ్జెట్ ఎంతైనా ఘాట్ రోడ్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీటీడీ నిధులు 35 కోట్ల 19 లక్షలతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు దేవస్థానంలో అదనపు గదులు,మాలవి రమణ మంటపం కోసం శంకుస్థాపన చేసిన కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగిందని రెండు మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్ అండ్ బి,వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటం లేకుంటే ఈ ప్రాంతానికి విముక్తి లేదు

- ఇందుర్తి ప్రాంతంలో ప్రజల కోసం ప్రాణాలర్పించింది కమ్యూనిస్టులే
- సిపిఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- చిగురుమామిడి మండలంలో అమరవీరులకు నివాళ్లర్పించిన సీపీఐ నేతలు



చిగురుమామిడి సెప్టెంబర్ 15(జనంసాక్షి): కమ్యూనిస్టు పార్టీ నేతల ప్రాణ త్యాగాల మూలంగా తెలంగాణ ప్రాంతం విముక్తి కాబడిందని,రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల సాక్షిగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని,ఆ మహత్తర పోరాటాన్ని వక్రీకరిస్తే సిపిఐ చూస్తూ ఊరుకోదని సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు.సెప్టెంబర్ 11నుంచి 17వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ చిగురుమామిడి మండల సమితి ఆధ్వర్యంలో మంగళ వారం ఇందుర్తి, గునుకులపల్లి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట, చిగురుమామిడి, రేకొండ బొమ్మనపల్లి గ్రామాలలో అమరులైన వీరుల స్మారక స్థూపాల వద్ద చాడ వెంకటరెడ్డి,సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాలు వేసి నివాళులర్పించారు.పార్టీ జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ వెట్టి చాకిరీ విముక్తి కోసం, బానిసత్వానికి వ్యతిరేకంగా, ఆకలి మంటలు, ఆర్థనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం దాస్య శృంఖాలాల విముక్తి కోసం పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు.

దొంగ అప్పు పత్రాలు సృష్టించి ప్రజలను ఇబ్బంది లకు గురిచేస్తున్న రంగారెడ్డి దొరకు వ్యతిరేకంగా ముస్కురాజిరెడ్డి,గునుకుల జనార్ధన్ రెడ్డి,కూన ముత్తయ్య లాంటి అనేకమంది రంగారెడ్డి దొరకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి అప్పు పత్రాలను తగలబెట్టిన చరిత్ర ఉందని, ఈ ప్రాంతంలో పార్టీని నిలబెట్టడంలో ఆనాటి మహానీయులు ఎంతోమంది త్యాగం చేశారని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు చింతపూల నరేందర్, కొంకట మౌనిక, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, న్యాలపట్ల రాజు, రాష్ట్ర జాతీయ కౌన్సిల్ సభ్యులు కవ్వంపెల్లి స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి,బోయిని పటేల్, తేరాల సత్యనారాయణ, కన్నం లక్ష్మీనారాయణ, వరుకోలు సదానందం,దుడ్డేల సమ్మయ్య, ఉప సర్పంచ్ చింతపూల అనిల్ కుమార్,సిపిఐ మండల సహాయ కార్యదర్శులు బూడిద సదాశివ, పైడిపెల్లి వెంకటేష్, సీనియర్ నాయకులు ముద్రకోల రాజయ్య,మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా,మంద ఎల్లయ్య, ఎలగందుల రాజు, చెప్యాల శ్రీనివాస్, అనువోజు జనార్ధన్, ఇల్లందుల రాజయ్య, కయ్యం తిరుపతి, నీల వెంకన్న, అందె సంపత్, కయ్యం వీరన్న, ముస్కు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో రైతులు ఆగమాగం

- చందాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట వంటావార్పు.. రైతులకు బీఆర్ఎస్ నాయకుల మద్దతు



వనపర్తి రూరల్, సెప్టెంబర్ 15, జనం సాక్షి : అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ డిమాండ్ చేశారు. వనపర్తి మండలం చందాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట చందాపూర్, మల్లాయపల్లి, దత్తాయపల్లి, పెద్దతండా గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం వంటావార్పు నిర్వహించి నిరసన చేపట్టారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ... గతంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం వేళాపాళా లేకుండా కోతలు విధిస్తున్నారని విమర్శించారు. ధర్నా విరమింపజేసేందుకు వచ్చిన ఏఈ చంద్రశేఖర్, డీఈ శ్రీనివాసులకు రైతులు వినతిపత్రం అందజేశారు. 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవంగా 7–8 గంటలు మాత్రమే వస్తోందని, కోత విధించిన విద్యుత్‌ను తిరిగి కలపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఈ శ్రీనివాసులు స్పందిస్తూ సుమారు గంటన్నర విద్యుత్ కోత ఉన్న విషయం వాస్తవమేనని, అదనపు విద్యుత్ సరఫరా కోసం రైతులు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల మహేంద్రయాదవ్, ధర్మానాయక్, మాధవ్‌రెడ్డి, చెన్నారెడ్డి, దేవర్ల నరసింహ, మహేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బిచ్యానాయక్, మల్లయ్య, చిట్యాల రాము, శ్యామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

### 19వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు

### మేనేజ్‌మెంట్ కోటా ఎంబీబీఎస్/బీడీఎస్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు కూడా విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. చేరే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని యూనివర్సిటీ తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటలలోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర పత్రాలను సమర్పించి అడ్మిషన్ పూర్తి చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమైందని యూనివర్సిటీ తెలిపింది. విద్యార్థులు నిర్ణీత గడువులో తమ అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని సూచించింది.

# నగరానికి నలువైపులా బస్ టెర్మినల్స్

## హైదరాబాద్ రవాణా వ్యవస్థ విస్తరణకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక

- గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్‌పై ప్రతిపాదనలు
- అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్‌కే పరిమితం
- లాస్ట్ మైల్ కనెక్టివిటీ ద్వారా మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సులతో ప్రయాణికులకు అనుసంధానం
- నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

హైదరాబాద్ నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి హైదరాబాద్‌లోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగరంలోని అంతర్గత ప్రాంతాల్లోకి రాకుండా ఆయా దిశల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, హైదరాబాద్‌కు వచ్చే అంతర్‌జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీంతో నగరంలోకి వచ్చే ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రి సమయాల్లో రోడ్లపైకి పెద్ద సంఖ్యలో రావడం వల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు కాలుష్యం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత బస్ టెర్మినల్స్ ద్వారా నిర్వహించే విధానంపై ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. అవసరమైన నిబంధనల మేరకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ టెర్మినల్స్‌ను వినియోగించుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ దూరప్రాంత బస్సులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధానం అమలులోకి వస్తే నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు సుమారు 150 ఎకరాల భూమిని బస్ టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, కనెక్టివిటీ తదితర సౌకర్యాలను కల్పించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు.

**2,200 ఎలక్ట్రిక్ బస్సులతో ప్రజా రవాణాకు మరింత బలం**



హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు మెరుగైన సిటీ బస్ కనెక్టివిటీ కల్పించడంతో పాటు, బస్ టెర్మినల్స్ నుంచి నగరంలోని ప్రతి ప్రాంతానికి ప్రయాణికులు సులభంగా చేరుకునేలా రూట్లను రూపొందించనున్నట్లు తెలిపారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థతో నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను నియంత్రించడంతో పాటు, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా మార్గాలను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు.

**ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు కీలక అడుగు**

హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే విధానం వల్ల నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌ను మరింత సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫెలోస్ తొలిబ్యాచ్ పూర్తి

### అభినందనలు తెలిపిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద నిర్వహిస్తున్న 'మన్మోహన్ సింగ్ ఫెలోస్' తొలి బ్యాచ్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్ పర్సన్ మధుయాష్కి గౌడ్, మాజీ చైర్ పర్సన్ ప్రవీణ్ చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ.. శిక్షణ పూర్తి చేసుకున్న మన్మోహన్ సింగ్ ఫెలోస్‌తో మాట్లాడి వారితో అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రగతిశీల భారత నిర్మాణం పట్ల వారు చూపుతున్న ఆసక్తి, అభిరుచిని అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి ఆలోచనలు, విధానాలు, దేశాభివృద్ధిలో ప్రొఫెషనల్స్ పాత్ర వంటి అంశాలపై చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేయడం, ఏఐపీసీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా నాయకులు చర్చించారు. 'మన్మోహన్ సింగ్ ఫెలోస్' రెండో బ్యాచ్ కోసం దరఖాస్తుల ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దేశ ప్రగతి, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, అభివృద్ధిపై ఆసక్తి ఉన్న యువతతో పాటు వివిధ రంగాల్లోని వృత్తిని నిపుణులు, మేధావులు ఈ ఫెలోస్‌లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.

## ఇందిరమ్మ టవర్స్.. 4 నియోజకవర్గాల్లో దరఖాస్తుల గడువు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20, 2026 వరకు పొడిగించారు. రెండో శనివారం, ఆదివారం, పండుగలు, ఇతర వరుస సెలవుల కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించాలని వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తులు అందాయి. వాటిని పరిశీలించిన అనంతరం దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు.

## ఒంటరి మహిళల పింఛన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

### తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** చేయూత పింఛన్ల కోసం ఒంటరి మహిళలు దరఖాస్తు చేసుకునే ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసినప్పటికీ, దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువు సెప్టెంబర్ 15తో ముగియనున్న నేపథ్యంలో మరికొంతకాలం పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. భర్తతో విడిపోయిన కాలానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో విచారణ జరిపి ధ్రువీకరించే అధికారాన్ని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కల్పిస్తూ ఈ నెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం అభినందనీయమన్నారు. అయితే కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన వెంటనే వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు రావడం, సెప్టెంబర్ 15 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోవడం వల్ల అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి దరఖాస్తుల గడువును మరో పది రోజులు పొడిగించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఒంటరి మహిళలకు పింఛన్ దరఖాస్తు ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఒంటరి మహిళ కూడా పింఛన్‌కు దూరం కాకుండా దరఖాస్తుల గడువును పొడిగించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎండీ యాకూబ్ పాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఉద్యమకారుల ఎఫ్‌ఐఆర్ రికార్డుల డేటా అందించండి

### డీజీపీకి తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వినతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన వివిధ దశల పోరాటాల్లో అక్రమ కేసులు, అరెస్టులు, జైలు శిక్షలు ఎదుర్కొన్న ఉద్యమకారుల వివరాలను సమగ్రంగా సేకరించే ప్రక్రియలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్‌ను డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వరాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు, కేసుల వివరాలు, అరెస్టులు, రిమాండ్, జైలు శిక్షలకు సంబంధించిన పోలీసు రికార్డులు, అందుబాటులో ఉన్న డేటాను కమిటీకి అందజేయాలని వారు డీజీపీని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించేందుకు పోలీసు శాఖ వద్ద ఉన్న అధికారిక రికార్డులు ఎంతో కీలకమని వారు వివరించారు. ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియలో భాగంగా సంబంధిత రికార్డుల సేకరణ అవసరమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ స్పందిస్తూ, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పోలీసు శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. సంబంధిత రికార్డుల సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులకు సూచనలు చేస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల చరిత్ర, వారి త్యాగాలు అధికారిక రికార్డుల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉద్యమ చరిత్రను సజీవంగా అందించవచ్చని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

## పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

### ముందుండి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా : డిజిపి సి.వి. ఆనంద్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి) :** పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని, ముందుండి అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా 37 మందికి పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డిజిపి చొరవ తీసుకుని డిజిపి కార్యాలయంలో శుక్రవారం ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారం రోజుల సమయం ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డిజిపి వివరించారు. "కేసులు వేసుకుని నష్టపోవద్దు. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు" అని సూచించారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీల కు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్నారు.

**కేసుల ఉపసంహరణకు ముందుకు..**

డిజిపితో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డిజిపికి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన 1991, 1995,1996 బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల నుండి అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డిజిపి సి.వి. ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## యువ సైక్లిస్టులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రోత్సాహం

### 1వ క్యాడెట్ నేషనల్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్-2026లో విజేతలకు బహుమతుల ప్రదానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి)**

హైదరాబాద్‌లోని నాగోల్ బండ్లగూడ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 1వ క్యాడెట్ నేషనల్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్--2026కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ మ్యాక్స్‌వెల్ ట్రెవర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు, సాంకేతిక పర్యవేక్షణతో, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సహకారంతో ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 8 నుంచి 11 సంవత్సరాల వయస్సు గల 154 మంది బాలబాలికలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పతకాలు సాధించారు. మెడల్ ట్యాలీలో తెలంగాణ 6 స్వర్ణాలు, 6 రజతాలు, 6 కాంస్యాలతో మొత్తం 18 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పిల్లల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సైక్లింగ్ ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు పిల్లల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, పోటీతత్వ స్ఫూర్తి పెంపొందిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్న ఆయన, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ సైక్లిస్టులకు ఇలాంటి ఛాంపియన్‌షిప్‌లు గొప్ప వేదికగా నిలుస్తాయని అన్నారు. తల్లిదండ్రులు, కోచ్‌లు, నిర్వాహకులు అందిస్తున్న ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరెంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.







ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారు అని ఆయన అన్నారు. తెలంగాణకి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి ఉప్పల శ్రీనివాస్ గుప్త అభినందించారు. గెలుపుతో పాటు ఓటమిని కూడా క్రీడాస్ఫూర్తితో స్వీకరించి, లక్ష్య సాధన కోసం నిరంతరం సాధన కొనసాగించాలని యువ సైక్లిస్టులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటీసీడబ్ల్యూఏ అధ్యక్షుడు డాక్టర్ మ్యాక్స్‌వెల్ ట్రెవర్, జనరల్ సెక్రటరీ ఎం.కె. పాషా, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. మల్లారెడ్డి విజయ్‌కాంత్ రావు, చంద్రారెడ్డి, అజిత్ సింగ్, సంజీవరెడ్డి, ఓబులేసు యాదయ్య, జగన్నాథ్ దాస్, లోరైన్ ట్రెవర్ నిర్వాహకులు కోచ్ లు, తల్లితండ్రులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370